విశాలాంధ్ర

	ఏజంటుద్వారా/పోస్టుద్వారా	
నెలకు	రు. 4_70	రు. 5_00
3 నెలలకు	14_00	15_00
6 నెలలకు	28_20	30_00
సంవత్సరమునకు	56_40	60_00

దినపత్రిక 15 పైసలు
ఆదివారంసంచిక 20 పైసలు
చందా వివరాలు

VISALAANDHRA Phone No. 75301
ఉ ద య ం
★ ★ ★ Regd No. 203

విశాలాంధ్ర

703919

సంచిక 22 సంపుటి 143
విజయవాడ 7—8—72 సోమవారం
6 పేజీలు 15 పై.

సోషలిస్టు దేశాల్లో భారత్ కళాకారుల పర్యటన

న్యూఢిల్లీ, ఆగస్టు 6

సోవియట్ యూనియన్, జర్మన్ డెమోక్రటిక్ రిపబ్లిక్ (తూర్పు) జర్మనీ, పోలెండ్ దేశాల్లో పర్యటించేందుకుగాను ఈ నెల 11 న ఇక్కడనుంచి భారత్ కళాకారులు బయలుదేరుతున్నారు.

కళాకారుల బృందంలో శ్రీమతి దమయంతి, శ్రీమతి నయన జావేరి, లాల్‌గుడి జయరామన్ ప్రభృతులు వున్నారు.

ఆగస్టు 10న భారత-పాక్ ఉన్నత సైనికాధికారుల చర్చలు

సిమ్లాఒప్పందంలోనిఅంశాలఅమలుకై కార్యక్రమంరూపొందించేందుకుసుచేత్‌ఘర్ చెక్ పోస్టువద్దసమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 6

జమ్మూ-సియాల్‌కోట రోడ్‌పై భారత భూభాగంలో సుచేత్ ఘర్ చెక్‌పోస్టువద్ద ఈనెల 10 వ తేదీ ఉదయం 10-30 గంటలకు భారత్-పాక్ సేనల ప్రతినిధులు సమావేశమై సిమ్లా ఒప్పందం అమలు గురించి చర్చిస్తారు.

ఈ వివరాలను నేటి ఉదయం యిక్కడ ప్రకటించారు. భారత్ తరపున ఉత్తరరంగ అధిపతి లెప్టినెంట్ జనరల్ పి.యస్. భగత్ పాకిస్తాన్ తరపున లెప్టినెంట్ జనరల్ అబ్దుల్ హమీద్‌ఖాన్ సమావేశంలో పాల్గొంటారు.

సైనిక దళాల ఉపసంహరణ కార్యక్రమాన్ని వారు రూపొందిస్తారు, మందు పాతరలు యితర రక్షణ కట్టడాలను తొలగించే విషయం చర్చిస్తారు.

ఉపసంహరణ సునాయాసంగా జరిగిపోతుందనీ, గత డిసెంబర్‌కు ముందున్న వాస్తవాధీనరేఖ నిర్ణయం ప్రభావం దీనిపై ఉండబోదనీ ఇస్లామాబాద్‌లో విదేశాంగశాఖ ప్రతినిధి నేడు చెప్పారు.

ఉభయ సైన్యాల ఆక్రమణలో ఉన్న స్థానాలను నిర్ధారించవలసి వున్నదని అన్నారు.

ఏమైనా ఈ సమస్య, సైనిక ఉపసంహరణ కార్యక్రమానికి భంగకరం కాదన్న ఆశాభావాన్ని పాక్‌ప్రతినిధి వ్యక్తం చేశారు.

14 రోజుల యుద్ధం ముగిశాక కూడా భారత్ సైన్యాలు కొంతదూరం ముందుకు చొచ్చుకుపోయాయని అయన ఆరోపించారు.

టీచర్లకు లిబరలైజ్‌డ్ పెన్షన్‌పథకం

రాష్ట్ర ఆర్థిక మంత్రిశ్రీ భగవంతరావుప్రకటన

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఆగస్టు 6

ఉపాధ్యాయులకు లిబరలైజ్‌డ్ పెన్షన్ పథకాన్ని అమలు జరపనున్నట్లు రాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ అనగాని భగవంతరావు నేడిక్కడ వెల్లడించారు.

పట్టణ జాతీయోపాధ్యాయ సంఘంవారి మహాసభ ముగింపు రోజున ప్రసంగిస్తూ ఈ విషయాన్ని తెలియజేశారు.

ఉపాధ్యాయుల పెన్షన్ పథకం గూర్చి రాష్ట్ర ముఖ్యమంత్రి అగస్టు 15 న ఒక ప్రకటన చేయనున్నారని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఇంటిఅద్దె అలవెన్సును పెంచే విషయాన్ని అక్టోబరులో తిరిగి పరిశీలించి ఒక నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు తెలిపారు.

1946నాటి విద్యారంగ పరిస్థితి ఏవిధంగా వున్నదో నేడుకూడ అదేవిధంగా వున్నదని అయన అన్నారు.

ప్రభుత్వ అంచనాలు, పథకాలు జనాభా పెరుగుదలవలన తలక్రిందు అవుతున్నాయన్నారు.

సామాజిక న్యాయం, అధిక ఉత్పత్తి, జాతీయశీలం అన్నవి ప్రధాన లక్ష్యాలుగా వుండాలన్నారు.

రు. 4 కోట్ల బకాయి

1969 నాటికి ప్రభుత్వం ఉపాధ్యాయులకు యివ్వవలసిన గ్రాంట్లు రు. 3 కోట్ల 61 లక్షలపైగా బకాయివున్నదని అంగీకరించారు.

దాదాపు రు. 2 కోట్లు పంచాయతీ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఈ ఒక కోటి 61 లక్షల రూపాయలు మున్సిపాలిటీలలో పనిచేసు ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి వున్నదన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకుగల బాకీలను యిందులో యింకా జత చేయలేదని ఆర్థిక మంత్రి వెల్లడించారు.

పంచాయతీ సంస్థల ఆధ్వర్యానగల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులపై సమితి అధ్యక్షుల, పంచాయతీ అధ్యక్షుల, ప్రభావాలు పడుతున్నాయని ఆయన అంగీకరించారు.

ఆహ్వానసంఘ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు శ్రీ కె. ఎల్. ఎస్. ప్రసాద్ ప్రసంగిస్తూ, విద్యామంత్రి మారినప్పుడల్లా విద్యావిధానం మారుతున్నదని విమర్శించారు.

శాసన సభ్యులు శ్రీమతి సరోజినీ అనందబాయి ప్రసంగిస్తూ ప్రభుత్వం ఉపాధ్యాయుల కోర్కెలు తీర్చగలదని చెపుతూ, ధర్నాలు మొదలైన ఆందోళనా కార్యక్రమాలు చేపట్టకూడదని సలహా యిచ్చారు.

సమావేశంలో శాసనమండలి సభ్యులు శ్రీ మన్నవ గిరిధరరావు, శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు ప్రభృతులు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రసంగించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రెస్‌కౌన్సిల్ విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 6

తెలంగాణా ఆందోళన సందర్భంగా హైదరాబాద్‌లోని పి. టి. ఐ. వార్తా సంస్థ పంపిన వార్తలు వాస్తవ విరుద్ధంగా వున్నాయని భావించి, అందుకు బాధ్యుడైన హైదరాబాద్ పి. టి. ఐ. విలేకరిని శిక్షించవలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పి. టి. ఐ. వార్తాసంస్థపై వత్తిడి తీసుకొనిరావడానికై 1970 లో రెండు టెలిప్రింటర్ సర్వీసులను రద్దు చేసినట్లు ప్రెస్ కౌన్సిల్ నిర్ణయించింది.

ప్రస్తుతం ఒరిస్సా మంత్రిగా వున్న శ్రీ బంకా బిహారీదాస్ చేసిన ఫిర్యాదుపై ప్రెస్ కౌన్సిల్ పై విధంగా తీర్పు చెప్పింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ విధంగా టెలిప్రింటర్ సర్వీసులను రద్దు చేయడం పత్రికా స్వాతంత్ర్యాన్ని భగ్నపరచడమే అవుతుందని ప్రెస్ కౌన్సిల్ వివరించింది.

పి. టి. ఐ. విలేకరి శ్రీ హైదర్‌ను హైదరాబాద్ నుండి బొంబాయికి బదిలీచేసే వరకు, పి. టి. ఐ. వార్తాసంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని టెలిప్రింటర్ సర్వీసును పునరుద్ధరించమని కోరకపోవడం, హైదర్ బదిలీ అనంతరమే టెలిప్రింటర్ సర్వీసును పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం ప్రెస్ కౌన్సిల్ గమనించినట్లు పత్రికాప్రకటనలో పేర్కొన్నారు.

ఈ పరిస్థితులన్నింటిని పరిశీలించిన పిదప, టెలిప్రింటర్ సర్వీసులను వెనుకటి తేదీ నుండి పునరుద్ధరించుట కొరకై రాష్ట్ర ప్రభుత్వం వత్తిడికి లొంగిపోయి, శ్రీ హైదర్‌ను పి. టి. ఐ. సంస్థ బదిలీ చేసినట్లు అనుమానించవలసివస్తున్నదని అయితే తగినన్ని ఆధారాలు లభ్యంగా నందున ప్రెస్ కౌన్సిల్ నిర్దిష్టమైన నిర్ణయం చేయలేకపోయిందని ఆ ప్రకటనలో పేర్కొన్నది.

కరాచీవద్ద రైలు ప్రమాదం

50 మంది మృతి

రావల్పిండి, ఆగస్టు 6

కరాచీ సమీపంలో ఒక ఎక్స్‌ప్రెస్ రైలు, గూడ్సుతో ఢీ కొనటంతో 50 మంది వ్యక్తులు మరణించినట్లు తెలుస్తూంది. మరో150 మంది గాయపడ్డారు.

ఇంతవరకు 38 మృత దేహాలను కనుగొన బడినట్లు పాకిస్తాన్‌లోని అసోసియేటెడ్ వార్తా సంస్థ తెలియజేసింది.

బెలూచి మంత్రి నసీర్ రచనలపై పాక్ నిషేధం

న్యూఢిల్లీ, ఆగస్టు 6

బెలూచిస్తాన్ సమాచార శాఖామంత్రి గుల్‌మీర్‌ఖాన్ నసీర్ కవితపై పాక్ రేడియోవిధించిననిషేధంవల్ల బెలూచిస్తాన్‌లో విచిత్ర పరిస్థితి ఏర్పడింది.

ప్రముఖ బెలూచీ విప్లవ కవి రచనలు వేటినికూడా ప్రసారం చేయకూడదని పాక్ కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ప్రకటించింది.

సైన్యాల ఉపసంహరణ

పాక్ ప్రతినిధి ఆశాభావం

ఇస్లామాబాద్, ఆగస్టు 3

సిమ్లా ఒప్పందంలో పేర్కొన్న మేరకు, ఉభయ దేశాల సైన్యాల ఉపసంహరణ కార్యక్రమం 30 రోజులలోనే సవ్యంగా ముగియ గలదని పాక్ అధికార ప్రతినిధి ఒకరు నేడిక్కడ ఆశాభావం వ్యక్తంచేశారు.

కాశ్మీర్ రంగంలోని లీపా ప్రాంతంలో ఇటీవల పాక్ సైనికులు ఆక్రమించిన రెండు స్థావరాల నుంచి కూడా వారు ఉపసంహరించుకోవలసి వున్నదని భారత విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ, 1971 డిశంబరులో 14 రోజుల యుద్ధం ముగిశాక అప్రాంతంలో

ధర్నా, పికెటింగులు జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మికులకు యల్లమందారెడ్డి విజ్ఞప్తి

ఒంగోలు, ఆగస్టు 6

భూ పరిమితి బిల్లులోని తీవ్రమైన లొసుగులను తొలగించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 10 నుంచి 12 వ తేదీ వరకు జరిగే ధర్నా, పికెటింగు, ప్రదర్శనలతోను 15 వ తేదీన జరిగే ప్రజా ప్రదర్శనలలోనూ పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా రాష్ట్రవ్యవసాయ కార్మికసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి నేడిక్కడ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఈ ఆందోళనాకార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్యక్రమాన్ని తీసుకోవలసిందిగా జిల్లా, తాలూకా వ్యవసాయ కార్మికసంఘాలకు, అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా వ్యవసాయ కార్మికులను ఆయన కోరారు.

స్వాతంత్ర్యయోధుల పింఛను పథకం

గుంటూరు జిల్లానుంచి 856 దరఖాస్తులు

గుంటూరు, ఆగస్టు 5

స్వాతంత్ర్య యోధుల పింఛను పథకం క్రింద గుంటూరు జిల్లాలో 856 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ శ్రీ కె. జయభారత రెడ్డి నేడిక్కడ పత్రికల వారికి చెప్పారు.

ఇందులో 698 దరఖాస్తులను పరిశీలించి నిధులు మంజూరు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపటం జరిగిందని అయన చెప్పారు.

ముగ్గురికి ఆహ్వానం

తామ్రపత్ర బహూకృతికి

గుంటూరు, ఆగస్టు 5

గుంటూరుజిల్లా నుండి శ్రీయుతులు జి. వి. పున్నయ్యశాస్త్రి, కన్నెగంటి సూర్యనారాయణ, శ్రీమతి అఖిలాండమ్మలకు ఢిల్లీలో అగస్టు 15 ఉత్సవాలలో 'తామ్రపత్ర'లు అందచేయబడతాయి. కేంద్రప్రభుత్వం నుండి వీరికి ఆహ్వానాలందాయి. ఈజిల్లా నుండి అరుగురిపేర్లను యీ గౌరవానికి కలెక్టర్ సూచించారు.

కృష్ణాజిల్లానుండి 6 గురు సన్మానితులు

విజయవాడ, ఆగస్టు 6

స్వాతంత్ర రజితోత్సవాల సందర్భంగా ఆగస్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్యయోధులకు జరిగే సన్మానానికికృష్ణాజిల్లానుండి అరుగురిని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిక చేసింది.

శ్రీయుతులు మద్దుకూరి చంద్రశేఖరరావు, కంభంపాటి సత్యనారాయణ (సీనియర్), ఎస్. ఆనందరావు, పైడిపాటి అప్పలస్వామి, వల్లభనేని రామబ్రహ్మం, అన్నే మల్లికార్జునుడు గారలు సన్మానోత్సవ సభలో పాల్గొనడానికి ఢిల్లీ వెళుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున అహ్వానాలను జిల్లా కలెక్టరు శ్రీ యస్. వి. గిరి వీరికి అందచేశారు. (వి. వి.)

'హరిజన సంస్కరణోద్యమం'

ఉత్తరప్రదేశ్‌లో వింత సంఘటన

ప్రతాప్‌ఘర్, ఆగస్టు 5

ఉత్తర ప్రదేశ్‌లోని ప్రతాప్‌ఘర్‌జిల్లా, రాణీగంజ్ పోలీస్ స్టేషన్ అజమాయిషీ క్రిందగల హరిహరగంజ్ దాని చుట్టు ప్రక్కనగల గ్రామాలలోగల హరిజనులు తిరిగి పాత పద్ధతిలోనే జీవించడానికి ఒత్తిడి చేసే "హరిజన సంస్కరణోద్యమం" ప్రారంభమైంది.

చనిపోయిన జంతువులను తీసిపారవేయడానికి నిరాకరించినందుకు, తమ స్త్రీలను వెట్టిచాకిరికి పంపనందుకు ఈ గ్రామాలలోని హరిజనులపై హరిజనేతరులు దౌర్జన్యానికి పాల్పడుతూ బీభత్సం చేస్తున్నారు. ఇది పట్టీ సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ శ్రీ వి. ఎస్. చౌబే జరిపిన విచారణలో తేలింది.

చర్మకారులకు అహార ధాన్యంగానీ, అత్యవసర సరుకులుగానీ అమ్మేది లేదని "హరిజన సంస్కరణోద్యమ" నిర్వాహకులు ఢంకా భజాయించి చెపుతున్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కొందరు గ్రామంలోని కూడలులలో నిలబడి చర్మకారులను గ్రామంలో ప్రవేశించకుండా అడ్డగిస్తున్నారు.

పొలాలలో గడ్డి కోయకుండా చర్మకారులను నిరోధిస్తున్నారని, చర్మ కారుల ఇళ్ళ గోడలపైననే వ్యతిరేక నినాదాలు వ్రాసివున్నాయనీ, ఈ నేరానికి పాల్పడుతున్నవారి పేర్లు చెప్పటానికికూడా చర్మకారులు కొందరు భయపడుతున్నారని చౌబే అన్నారు.

గత జులై 28 న హరిహరపూర్‌వద్దగల ఆటిపూర్ గ్రామంలో దాదాపు 50 మంది చర్మకారులను మూకుమ్మడిగా బందించి కొట్టారని జిల్లా కమ్యూనిస్టు సమితి కన్వీనర్ శ్రీ ప్రజాభూషణ్‌సింగ్ చేసిన ఫిర్యాదుపై యీ దర్యాప్తు జరిగింది. చర్మకారులను కొట్టడంమాత్రం జరిగిందనీ, మూకుమ్మడిగా కొట్టిన ఘటనలకు సంబంధించిన ఆధారాలు లభ్యం కాలేదనీ, నేరస్తులపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని శ్రీ చౌబే తెలిపారు.

కేరళలో కాలేజీల పునః ప్రారంభానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కొచ్చిన్, అగస్టు 6

రాష్ట్రంలో చాలా ప్రయివేటు కాలేజీలు మూసివేసిన దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయటం జరిగిందని కేరళ విద్యా శాఖ మంత్రి శ్రీ మహమ్మద్‌కోయా నేడిక్కడ తెలియ చేశారు.

ప్రభుత్వం యీ సమస్యపై జాప్యం చేస్తున్నదనే ఆరోపణలను తిరస్కరిస్తూ ప్రభుత్వం ఎటువంటి జాప్యం చేయదని, దీనిపై ఎవరు ఆందోళన చెందవలసిన అవసరంలేదని ఆయన అన్నారు.

ఈ క్లిష్ట పరిస్థితిలో ప్రజలు సహకారం యివ్వాలనికోరుతూ ప్రభుత్వ చిత్తశుద్ధిసామర్థ్యాన్ని శంకించటం ప్రస్తుత దశలో స్వార్థపరవర్గాలకు ఉపయోగపడుతుందని చెప్పారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సహకరించే విద్యార్థుల, ఉపాధ్యాయుల జాబితాను యూనివర్సిటీ తయారుచేసిందన్నారు.

"ఒరేయ్, నాది సెవంటీ త్రి ఫాషన్ రోయ్!"

విజయవాడలో సెక్షన్ 30

విజయవాడ, ఆగస్టు 6

భూపరిమితి బిల్లులోని లొసుగుల తొలగింపును డిమాండ్‌చేస్తూ అగస్టు 10-12 తేదీలలో సత్యాగ్రహాలు, ధర్నాలు, తదితర అన్ని ఆందోళనా కార్యక్రమాలను చేపట్టాలని ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గం యిచ్చిన పిలుపు మేరకు విజయవాడలో కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి తలపెట్టదలచిన ఆందోళనా కార్యక్రమాన్ని దృష్టిలో వుంచుకొనిపోలీసుఅధికారులు విజయవాడలో ఈ నెల 7వ తేదీ మధ్య రాత్రి నుండి 13వ తేదీ మధ్య రాత్రి వరకు సెక్షన్ 30 విధించారు.

ఈ సెక్షన్ మత, పెళ్ళి అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలకు వర్తించదనీ, మిగతా కార్యక్రమాల నిర్వహణకు పైన తెలిపిన రోజులలో ముందు అనుమతి తీసుకోవలసి వుంటుందని ఎ. ఎస్. పి. శ్రీ డి. వి నరసింహమూర్తి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

హ్యూవద్ద 5 గ్రామాలు విముక్తిసేన వశం

క్వాంగ్‌ట్రివద్దఎదురుదాడి; అనేకమందికీలుబొమ్మసైనికులహతం

సైగాన్, ఆగస్టు 6

దక్షిణ వియత్నాం ఉత్తర రంగంలో రాచరిక రాజధాని హ్యూ నగరం వద్ద 5 గ్రామాలను విముక్తి సేనలు నేడు స్వాధీనం చేసుకున్నాయని ఎ. పి. వార్తాసంస్థ తెలిపింది.

క్వాంగ్‌ట్రి నగరంలోకిప్రవేశించడానికి యత్నిస్తున్న కీలుబొమ్మ సేనను విముక్తి సేన నిరోధించింది. అక్కడ జరిగిన పోరాటంలో కీలుబొమ్మ సేన పెద్ద సంఖ్యలో హతమయినట్లు ఎ. పి. వార్తా సంస్థతెలుపుతోంది.

ఇలా ఉండగా కాంబోడియాలో విముక్తి సేన టాంకు దళాలు విజృంభించాయి. కాంబోడియాలో టాంకు దళాలు దాడి చేయడం ఇదే ప్రథమం.

ఇటీవల దక్షిణ వియత్నాం యుద్ధం ప్రధానంగా ఉత్తర రంగంలో కేంద్రీకరించబడింది. గత అరు వారాలుగా 20000 కీలుబొమ్మ సేన వందలాది అమెరికా విమానాలతో"ఎదురుదాడి"జరిపినప్పటికి నగరాన్ని వశపరచుకోలేకపోయారు. హ్యూ నుండి ఉత్తరానికి పోయే హైవే 1. ను ఇప్పటికే కొంత ప్రాంతం ఆక్రమించుకున్న విముక్తి సేన ప్రస్తుతం క్వాంగ్‌ట్రిలోని కీలుబొమ్మ సేనల సరఫరాలను విజయవంతంగా బంద్ చేయగలరు.

విశాఖ జైలునుండి 6 గురు నక్సలైట్ అగ్రనాయకుల రహస్యలేఖ

వ్యక్తిగత హింసాకాండపట్ల వ్యతిరేకత

శ్రీకాకుళం, ఆగస్టు 6

కొంతమంది భూస్వాములను రహస్య సాయుధ దళాలు ఖతం చేయడం అనేది "తప్పుడు"పంథా అని ప్రస్తుతం జైల్లో ఉన్న అరుగురు నక్సలైట్ అగ్రనాయకులు భావిస్తున్నారు.

వారు జైలునుండి బయట ఉన్న నాయకత్వానికివ్రాసిన లేఖలో ఈవిషయం వెల్లడి అయినట్లు యు. యన్. ఐ. విలేకరి కథనం.

ఈ వ్యక్తిగత హత్యాకాండ రైతాంగ పాత్రను వేరుచేసిందనీ గెరిల్లా పోరాట సూత్రాలకు ఇది విరుద్ధమనీ ఆ నాయకులు అభిప్రాయపడ్డారు

ఆ 6 గురు నక్సలైట్ నాయకులు: కానూసన్యాల్, సురేన్‌బోస్ (ప॥ బెంగాల్) చౌదరి తేజేశ్వరరావు, కొల్లా వెంకయ్య (ఆంధ్రప్రదేశ్), నాగభూషణం పట్నాయక్, భువన మోహన్ పట్నాయక్ (ఒరిస్సా). వీరంతా విశాఖపట్నం సెంట్రల్ జైల్లో ఉన్నారు పార్టీ పంథా గురించి వారొక అవగాహనకు వచ్చి పై లేఖ వ్రాసినట్లు తెలుస్తూంది. చారు మజుందార్ అరెస్టుకు ముందు తేదీ ఆ లేఖపై ఉంది.

బయటవున్న నాయకత్వంతో విధానాలపై విభేదాల గురించి వారు వివరించారు ఇప్పటివరకూ పార్టీ అనుసరించిన విధానాలు పూర్తిగా చైనా విప్లవ అనుభవాలకు భిన్నమైన నవ షీ. నక్సల్‌బరీ మార్గంలో దానిని నిర్దిష్టంగా ఆచరించడంలోకూడా అలాగే జరిగిందనిచెప్పారు.

భారత బూర్జువా వర్గం

భారత బూర్జువావర్గ స్వభావం నిర్ణయించడంలో వారు చారుమజుందార్‌తో తీవ్రంగా విభేదించారు. భారత బూర్జువా వర్గం మొత్తంగా "కాంప్రడార్ బూర్జువా వర్గమే"ననీ, అది సామ్రాజ్యవాదులకు తాబేదారయిందనీ మజుందార్ వాదన. కాని ఈ భావన భారతదేశంలోని జాతీయ బూర్జువా వర్గం ఉన్నదన్న వాస్తవానికి విరుద్ధమని అరుగురు నాయకులు తెలిపారు.

"జనతా ప్రజాస్వామిక విప్లవానికి" రైతాంగ సాయుధ వ్యవసాయపోరాటమే పట్టుగొమ్మ అని వారు విశ్వసించారు భూమి కోసం రైతాంగాన్ని సమీకరించడం, గెరిల్లా పోరాట పంథాలు ప్రధాన ఎత్తుగడల స్వరూపం అని చెప్పారు. ఇది రాజకీయాధికారంతో ముడిపడి ఉన్న సమస్య అని ఆ లేఖలో వ్రాసారు.

ఒంటెత్తుపోకడ

ప్రజా సమీకరణపు గెరిల్లా పోరాటమే సరైన పంథాఅని వారు స్పష్టీకరించారు అయితే బయటవున్న నాయకత్వం రాజకీయ, నిర్మాణ సంబంధమైన అంశాలను పట్టించుకోకుండా ఈ సూత్రాన్ని మొండిగా అనుసరించిందని విమర్శించారు.

భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో వున్న భావ సారూప్యత గల అనేక గ్రూపులను సమైక్యం చేయడం గురించి చర్చిస్తూ వారి మధ్య వున్న వైరుధ్యాలు "పరస్పరం పొత్తు పొసగనివి కాదు". అయితే ఐక్యమయే గ్రూపులన్నీ మావో భావనలపై విశ్వాసముంచాలని తెలిపారు.

మార్గదర్శం: రివిజనిస్టు ప్రభావం

నక్సల్ బరీ పంథాపై "తెరాయ్ నివేదిక"నూ, "భారత దేశంపై వసంత కాల మేఘగర్జన" అనే శీర్షికతో పీపుల్స్ డైలీ వ్రాసిన సంపాదకీయాన్ని వారు ప్రస్తావించారు. ఈ రెండు నివేదికల ప్రాతిపదికగా కార్యకర్తలను సమైక్యం చేయవలసిందిగా బయటి నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

రివిజనిజం, నయా రివిజనిజాల "ప్రమాదకరమైన ప్రభావం" ఏరూపంలోనూ పడకుండా ఉండాలని బయటి నాయకత్వాన్ని కేశరునూ వారు హెచ్చరించారు.

"అన్ని కేసులలోనూ రాజకీయ డిఫెన్సు తీసుకోవాలని" ఆ నాయకులు నిర్ణయించినట్టు తెలుస్తూంది.

ఢిల్లీలో స్వాతంత్ర దిన రజతోత్సవ కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగస్టు 6

అగస్టు 14 వ తేదీ అర్ధరాత్రి ఇక్కడ జరిగే ఉత్సవంతో సంవత్సరం పొడుగునా సాగే భారత స్వాతంత్ర్య రజతోత్సవాలు ప్రారంభ మవుతాయి.

వచ్చే సోమవారం అంటే 14 వ తేదీ అర్ధ రాత్రి పార్లమెంట్ఉభయసభలసభ్యులు సమావేశమవుతారు. ఈ సమావేశంలో రాష్ట్రపతి శ్రీ గిరి, ప్రధాని శ్రీమతి గాంధీ, ఉపరాష్ట్రపతి శ్రీ యస్. పథక్, స్పీకర్ శ్రీ జి. యస్ ధిల్లాన్ ప్రసంగిస్తారు,

ఈ కార్యక్రమాన్ని ఆకాశవాణి కేంద్రాలన్ని ప్రసారం చేస్తాయి. రాజధానిలో 14 వ తేదీ రాత్రి కాగడాల ప్రదర్శన జరుగుతుంది.

ప్రతి సంవత్సరం జరుగుతున్న విధంగానే ఆగస్టు 15 వ తేదీ ప్రధాని శ్రీమతి గాంధి ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని అవిష్కరిస్తారు. త్రివిధ దళాల వందన స్వీకారాన్ని ప్రధాన మంత్రి స్వీకరిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో కూడా ప్రధాని ప్రసంగిస్తారు. ప్రధాని ప్రసంగాన్ని ఆకాశవాణి ప్రసారం చేస్తుంది.

అగస్టు 15 వ తేదీ మధ్యాహ్నం ఎర్రకోటలో స్వాతంత్ర్య పోరాటంలో వీరోచిత పాత్రను నిర్వహించిన వారికి సన్మానం జరుగుతుంది. దాదాపు 1500 మంది స్వాతంత్ర్య యోధులనుప్రభుత్వం ఈ కార్యక్రమానికి అహ్వానించింది. వీరికి తామ్రపత్ర అవార్డులను ప్రధానమంత్రి బహూకరిస్తారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తుకుతెచ్చే పాటలను గానంచేస్తారు.

రాజధానిలోజరిగే ఉత్సవంలో తామ్రపత్ర అవార్డులను స్వీకరించలేని స్వాతంత్ర్య యోధులకు, ఈ సంవత్సరం దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగే ఉత్సవాలలో ప్రధాన మంత్రి ఈ అవార్డులను బహూకరిస్తారు,

రాష్ట్ర రాజధానులలో కూడా స్వాతంత్ర్య ఉత్సవాలు జరుగుతాయి జిల్లా కేంద్రాలు, సమితి కేంద్రాలు, పంచాయితీ కేంద్రాలలో కూడా ఈ ఉత్సవాలు జరుగుతాయి.

స్వాతంత్ర్య దిన రజతోత్సవాల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాయి.

మంత్రులు-వాగ్దానాలు

భగవంతరావు భాష్యం

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఆగస్టు 6

మంత్రులు సభలలో వాగ్దానాలు ఎందుకు చేస్తారు ?

రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీఅనగాని భగవంతరావు నేడిక్కడ స్వయంగా పై ప్రశ్నకు సమాధానమిచ్చారు.

రాష్ట్ర మంత్రులు తమ శాఖలకు చెందిన సంస్థల, ఉద్యోగుల ప్రతినిధులు కలుసుకున్నప్పుడు వారిని సంతృప్తి పరచేందుకై వెంటనే వాగ్దానాలు చేయకతప్పదన్నారు.

కోర్కెలు కోరేవారి సంతృప్తి కొరకు యీవిధంగా చేయకతప్పదని చెప్తూ చేసిన వాగ్దానాలను అమలు పరచాలంటె బొక్కసంలో పైసా కూడ మిగలదన్నారు

ఇందువలన తాను మాత్రం వాగ్దానాలు చేయనని చెప్పుకున్నారు.

స్వాతంత్ర్య రజితోత్సవ సందర్భమున
10% స్పెషల్ రిబేటు
8-8-72 నుండి 16-8-72 వరకు
(13 మరియు 15 తేదీలు మినహా)
కోఆప్టెక్స్
చేనేతవస్త్రాలు
ఆంధ్రప్రదేశ్ అంతటా మరియు ఇతరపెద్దపట్టణాల్లో గల మా 150 విక్రయశాలల్లోనూ
అన్నిప్రాథమిక చేనేతసహకార సంఘాలలోనూ విక్రయించబడుచున్నవి.
ఆంధ్ర చేనేత సహకార సంఘం లిమిటెడ్
విజయవాడ-3.
PRAKASH ARTS

దక్షిణ ఎమెన్‌లో భవనాల జాతీయం

బీరుట్, ఆగస్టు 6

ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యంలో ఉన్న వాణిజ్య, నివాస భవనాలను ఎమెన్ జన ప్రజాతంత్ర రిపబ్లిక్ (దక్షిణ ఎమెన్) నిన్న జాతీయం చేసిందని ఇరాక్ వార్తా సంస్థ తెలిపింది.

జాతీయం చేయబడిన భవనాలన్ని ప్రజల పరమవుతాయి. ఈ మేరకు ప్రతి ఒక్క కుటుంబానికి ఒక గృహం లభిస్తుందని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు తెలిపింది.

జాతీయకరణ అమలుకు గృహనిర్మాణ శాఖ "ప్రజా కంట్రోలు కమిటీల" ఏర్పాటు చేసింది.

బూసియా అరెస్టుకు ఉత్తర్వు

బమాకో (మాలి), ఆగస్టు 6

ఘనా మాజీ ప్రధాని కోఫీబూసియాను అరెస్టు చేయవలసిందిగా కల్నల్ అచంపాంగ్ నాయకత్వాన వున్న నేషనల్ డింపన్ కౌన్సిల్ నిన్న ఉత్తర్వు చేసిందని రాజధాని అక్రానుండి వచ్చిన వార్తలను టాస్ తెలిపింది.

బూసియా ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్నారు. "జాతీయ భద్రత" దృష్ట్యా బూసియా అరెస్టుకు ఉత్తర్వు చేసినట్లు ఘనాప్రభుత్వం తెలిపింది. గత నెల ఘనాలో బూసియా తిరుగుబాటు చేయడానికి ప్రయత్నించగా దానిని భగ్నం చేశామని ప్రభుత్వం ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

మలావీ ప్రభుత్వంలో ముసలం

లుసాకా, ఆగస్టు 6

మలావీ అధ్యక్షుడు హేస్టింగ్స్ బాండా, రవాణా మంత్రి జానెస్వేంగ్వేను అధికారంలోని మలావీ కాంగ్రెస్ పార్టీ నుండి, ప్రభుత్వం నుండి తొలగించారు. రాజధాని బ్లాంటైర్‌నుండి వచ్చిన వార్తలను టాస్ నేడు తెలిపింది.

పుకార్లపై ఉత్తర ఎమెన్ తిరస్కృతి

కైరో, ఆగస్టు 6

ఉత్తర ఎమెన్ నుండి సోవియట్ నిపుణులను స్వదేశం పంపడానికి నిర్ణయించినట్లు మొన్న ఇక్కడ ప్రచారంలో పెట్టబడిన వార్తలో "ఏ మాత్రం వాస్తవం లేదు" అని కైరోలోని ఉత్తర ఎమెన్ రాయబార కార్యాలయం నిన్న తెలిపింది. కైరో పత్రిక అల్ అక్బర్ పై వార్తను ప్రచారంలో పెట్టింది.

కుటుంబానికి 100 బీఘాల భూ గరిష్ఠ పరిమితి

బంగ్లాదేశ్ నిర్ణయం

ఢాకా, ఆగస్టు 5

కుటుంబానికి 100 ప్రామాణిక బీఘాల పరిమితి విధించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

రెవిన్యూమంత్రి అబ్దుల్ రాబిసార్నియా నిన్న ఇక్కడ పత్రికాగోష్ఠిలో ఈ విషయం తెలిపారు. ఈ విషయమై అమలు కానున్న చట్టం మేరకు భూ పరిమితిని ఎప్పుడైనా తగ్గించే హక్కు ప్రభుత్వానికి ఉంటుంది. ఈ చట్టం క్రింద భూగరిష్ఠ పరిమితి నిర్ణయించేందుకు వీలుగా గత డిసెంబరు 16 వ తేదీ అనంతరం జరిగిన బదలాయింపులు గుర్తింపబడవు.

భూమిలేని వ్యవసాయ కార్మికులకు, ఒకటిన్నర ఎకరాల లోపు భూమి ఉన్నపేదలకు భూములు పంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుతం ప్రభుత్వం వద్ద సాగుబడియైన 160,000 హెక్టార్ల భూమి ఉంది. 25 బీఘాలలోపు భూమిగల కుటుంబాలకు భూమిశిస్తు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆగస్టు 15 న అట్టహాసాలు దుబారాలు వద్దు

రాష్ట్రాలకు ప్రధాని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

దేశంలో కరువు పరిస్థితులు, విద్యుత్ లోటు దృష్ట్యా ఆగస్టు 15 న స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా దుబారాలు చేయవద్దని పొదుపుగా ఉండాల్సిందనీ రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రధాని శ్రీమతి గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారస్థాయిలో విందులు, తదితరాలు జరపవద్దని ఆమె ఆదేశించారు. భవనాలకు విద్యుద్దీపాలు, ఇతర అలంకరణలు ఆడంబరాలుగాకుండా లాంఛనప్రాయంగామాత్రమే చేయాల్సిందిగా ప్రధానమంత్రి కోరారు.

మైసూరు నిర్ణయం

మైసూరు రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో కరువు పరిస్థితులదృష్ట్యా స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా ప్రభుత్వ భవనాలకు విద్యుత్ అలంకరణలను మానుకోవాలని మైసూరు ప్రభుత్వం నిర్ణయించింది. అధికార స్థాయిలో విందులు, ఇతర దుబారాలు చేయకూడదని నిర్ణయించారు.

ప్రత్యామ్నాయ విద్యా సౌకర్యాలు

కేరళప్రదేశ్ యూత్ కాంగ్రెస్ డిమాండ్

కొట్టాయం, ఆగస్టు 5

90 వేల మంది కాలేజీ విద్యార్థులు తమ చదువు కొనసాగించుకునేందుకు వీలుగా కేరళ ప్రభుత్వం ఆగస్టు 13 లోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని కేరళ ప్రదేశ్ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ వి.సి. చాకో కేరళ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ సుధీరన్ నేడొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్, స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గ కమిటీ సమావేశం జరిపిన తర్వాత వారు పై విధంగా డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెసు, స్టూడెంట్స్ యూనియన్ ఆగస్టు 13న కొచ్చిన్‌లో ప్రత్యేక సమావేశం జరిపి విషయమై "అంతిమ నిర్ణయం" తీసుకుంటామని వారు ప్రకటించారు.

"రాష్ట్ర మంత్రివర్గం అధికారంలో కొనసాగాలా? లేదా? అన్న విషయాన్ని ఆగస్టు 13 న సమావేశంలో" తాము నిర్ణయిస్తామని వారు చెప్పారు.

ప్రత్యామ్నాయ విద్యాసౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైపోయిందని అన్నారు.

ప్రైవేటు కాలేజీల యాజమాన్యంతో "నిష్ప్రయోజనమైన చర్చలు" జరపడం ఆపివేయాలని కోరారు.

కేరళలోని మొత్తం 101 ప్రైవేటు కాలేజీలలో 36 కాలేజీలను మాత్రమే ఇప్పటికి తెరిచారు.

ఎ. కె. ఆంథోని హెచ్చరిక

పాల్ఘాట్, ఆగస్టు 5

ప్రైవేటు కాలేజీల యాజమాన్యంమొండి వైఖరి ఫలితంగా, ఆ సమస్య రాజకీయ సమస్యగా పరిణమించింది కాబట్టి దాన్ని రాజకీయంగానే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని కేరళప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ ఎ. కె. ఆంథోనీ నేడిక్కడ హెచ్చరించారు.

ప్రభుత్వ, యాజమాన్య ప్రతినిధుల చర్చలు విఫలం కావడానికి కేరళ కాంగ్రెస్‌దే బాధ్యత అని ఆయన విమర్శించారు.

ఆ సమస్య చర్చలద్వారా పరిష్కరింపబడే అవకాశం ఇప్పటికీ వున్నదని ఆయన అన్నారు.

క్లాసుల బహిష్కరణ

కొట్టాయం, ఆగస్టు 6

ప్రైవేటు కాలేజీ యాజమాన్యంపట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న "వైఖరికి" నిరసనగా, ఈ నెల 7 నుంచి క్లాసులను బహిష్కరించవలసిందిగా కేరళ కాంగ్రెస్‌కు చెందిన స్టూడెంట్స్ యూనియన్ నేడిక్కడ విద్యార్థులను కోరింది.

ఆ స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గం నేడిక్కడ సమావేశమై పై మేరకు నిర్ణయించింది.

ఆందోళనలో రెండవ భాగంగా ఆగస్టు 10 నుంచి ప్రభుత్వ ఆఫీసులవద్ద పికెటింగ్ జరిపేందుకు నిర్ణయించామనికూడా తెలిపారు.

నాలుగు రాష్ట్రాల్లో వర్షాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5

అనావృష్టికి గురైన నాలుగు రాష్ట్రాలలో నేడు వర్షాలు పడటంతో ఆయా రాష్ట్రాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తర ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలలో భారీ వర్షాలు కురిశాయి

అలాగే రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో నేడు వర్షాలు కురిశాయి.

ఢిల్లీలో వర్షం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

మూడు వారాలపాటు పొడి వాతావరణంతో ఉడికిపోయిన ఢిల్లీ పౌరులు నేటి సాయంత్రం భారీగా జల్లులు పడటంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. ఢిల్లీలో 25 చదరపు మైళ్ళ ప్రాంతంలో వర్షం పడింది.

రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితి

మార్క్సిస్టుపార్టీ విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 5

రాష్ట్రంలో తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఏర్పడిన దృష్ట్యా, తక్షణమే సహాయ కార్యక్రమాలను చేపట్టవలసిందిగా ఈ నెల 3 వ తేది యిక్కడ సమావేశమైన రాష్ట్ర మార్క్సిస్టుపార్టీ కార్యదర్శి వర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

భూ పరిమితి బిల్లుపై సెలెక్టు కమిటీలో తమ పార్టీ సభ్యుడిని మినహాయిస్తూ ప్రభుత్వం అవలంబించిన వైఖరిని ఈ సమావేశం ఒక తీర్మానంలో ఖండించింది.

స్వాతంత్ర్య దిన రజతోత్సవాల సందర్భంగా అధికార ఉత్సవాలలో పాల్గొనకుండా స్వతంత్రంగా ఉత్సవాలను నిర్వహించవలసిందిగా తమ పార్టీ శాఖలకు పిలుపిచ్చింది.

ఈ నెల 20 వ తేదీ విజయవాడలో జరిగే ప్రజా ప్రదర్శనలో పాల్గొనవలసిందిగా మరో తీర్మానంలో ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

శ్రీ కేశవులు రాజీనామా

ఎ. పి. సి. సి. ప్రధాన కార్యదర్శి పదవికి

హైదరాబాద్, ఆగస్టు 5

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అడ్‌హాక్‌కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ కె.వి.కేశవులు నేడు తనపదవికి రాజీనామా చేశారు. శ్రీ కేశవులు తన రాజీనామాను ఎ. పి. సి. సి. అధ్యక్షులు శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్‌కు అందజేశారు.

అయితే రాజీనామాను ఇస్మాయిల్ ఇంకా ఆమోదించలేదు. ఇటీవల శ్రీ కేశవులు చేసిన కొన్ని వ్యాఖ్యలపై పార్టీలో విమర్శలు రావటంతో రాజీనామా చేసినట్లు భావించబడుతుంది.

జులై 26 వ తేదీన కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యాన జరిగిన భూసంస్కరణల ప్రదర్శనకు పార్టీలో పెద్ద ఎత్తున విద్రోహం జరిగిందని శ్రీ కేశవులు విమర్శించారు.

ఉపాధ్యక్షపదవికి శ్రైవర్‌పోటీ

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా

వాషింగ్టన్, ఆగస్టు 6

అమెరికా ఉపాధ్యక్ష పదవికి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా శాంతిదళాల మాజీ డైరెక్టర్ సర్జెంట్ శ్రైవరును మెక్‌గవర్న్ గతరాత్రి నామినేట్ చేశారు.

శ్రైవర్ వయసు 56 సంవత్సరాలు. ఎడ్వర్డ్ కెనెడీ బావమరిది. గత సోమవారం పోటీ నుండి విరమించుకున్న థామస్ ఈగిల్టన్ స్థానే ప్రస్తుతం శ్రైవర్ పోటీ చేస్తున్నారు

ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సెనేటర్ ఎడ్మండ్ మస్కీ తిరస్కరించిన కొద్దిగంటలకే శ్రైవర్ నామినేషన్ వార్త వచ్చింది. "ఉపాధ్యక్షుడిగా పోటీచేసేందుకు తన సామర్థ్యంపట్ల" మెక్‌గవర్న్‌కు పూర్తి విశ్వాసం వున్నదని శ్రైవర్ ఒక పత్రికా గోష్ఠిలో చెప్పారు. శ్రైవర్ గతంలో ఫ్రాన్సులో అమెరికా రాయబారిగా పని చేశారు.

మెక్‌గవర్న్ విజ్ఞప్తిని మస్కీ తిరస్కరించడం డెమొక్రటిక్ పార్టీకి తీవ్ర విఘాతంగా పరిగణిస్తున్నారు.

మస్కీ తిరస్కృతి

ఉపాధ్యక్ష అభ్యర్థిత్వానికి

కెన్‌బంక్, మైనె, ఆగస్టు 5

డెమొక్రటిక్‌పార్టీ తరఫున అధ్యక్షపదవికి పోటీకై మెక్ గవర్న్ చేసిన ప్రతిపాదనను సెనేటర్ ఎడ్మంగ్ మస్కీ నేడు తిరస్కరించారు.

మాస్కోనుండి ఈజిప్ట్ ప్రతినిధుల పయనం

మాస్కో, ఆగస్టు 6

సోవియట్‌లో 4 రోజుల పర్యటన ముగించుకున్న ఈజిప్టు పార్లమెంటరీ ప్రతినిధివర్గం నేడు స్వదేశానికి బయలుదేరింది.

సుప్రీం సోవియట్ ఆహ్వానంపై 20 మంది సభ్యులు గల ప్రతినిధివర్గం మాస్కో, లెనిన్‌గ్రాడ్‌లను సందర్శించింది.

గోలన్ పర్వతశ్రేణులవద్ద కాల్పులు

సిరియాలోని ఆక్రమిత గోలన్ పర్వత శ్రేణులవద్ద కాల్పుల విరమణరేఖగుండా ఇజ్రాయెల్ అరబ్ సేనలు గతరాత్రి కాల్పులు జరిపాయని టెల్ అవీవ్ వార్త.

భవానీసేన్ స్మారక భవనం

కలకత్తా, ఆగస్టు 6

భవానీసేన్ స్మారకార్థం కలకత్తాలో ఒక భవనాన్ని కట్టాలని పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం యిటీవల నిర్ణయించింది.

ఆ భవనాన్ని రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుగానూ, మార్క్సిస్టు సాహిత్య లైబ్రరీగానూ ఉపయోగించాలని నిర్ణయించడం జరిగింది.

శ్రీ భవానీసేన్ సంక్షిప్త జీవిత చరిత్రనొక గ్రంథంగానూ, ఆయన రచనల్లో ముఖ్యమైన వాటిని చేర్చి మరొక గ్రంథంగానూ ప్రచురించాలని కార్యవర్గ సమావేశం నిర్ణయించింది.

బందిపోటుదొంగలపై విచారణ

ఈ నెల 7 వ తేదీనుంచి

భోపాల్, ఆగస్టు 5

మధ్యప్రదేశ్‌లో గత ఏప్రియల్‌మాసంలో లొంగిపోయిన బందిపోటు దొంగలపై విచారణ ఈ నెల 7 వ తేదీనుంచి ప్రారంభమవుతుంది.

గ్వాలియర్‌లో నేడు ఒక పత్రికాగోష్ఠిలో ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేథీ ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రత్యేక కోర్టులలో ఈ విచారణ జరుగుతుందని ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి అయినవని ఆయన తెలిపారు.

గ్వాలియర్ సెంట్రల్ జైలులో బందిపోటు దొంగల నాయకులైన మోహర్ సింగ్, మదోసింగ్‌లతో ముఖ్యమంత్రి విడివిడిగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

ఆర్థిక విధాన మంత్రివర్గ కమిటీ పునర్వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఇటీవల ఆర్థిక విధాన మంత్రిమండలి కమిటీని, ఆర్థిక సమన్వయ కమిటీని పునర్వ్యవస్థీకరించారు.

ప్రధాని శ్రీమతి గాంధీ పునర్వ్యవస్థీకరించబడిన ఆర్థిక విధాన మంత్రి మండలి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి, ప్రణాళికా మంత్రి, ఉక్కు-గనుల మంత్రి, వాణిజ్యమంత్రిత్వశాఖల మంత్రి సభ్యులుగా వ్యవహరిస్తారు.

ఆర్థిక సమన్వయ కమిటీలో ఈ క్రింది వారు సభ్యులుగా వ్యవహరిస్తారు.

శ్రీమతి గాంధీ, ఫక్రుద్దీన్ అలీఅహ్మద్, వై. బి. చావన్, జగ్ జీవన్‌రామ్, స్వరణ్ సింగ్, డి. పి. ధర్, మోహన్ కుమారమంగళం, టి. ఎ. పాయ్, సి. సుబ్రహ్మణ్యం, ఎల్. ఎన్. మిశ్రా.

అక్రమ నిల్వలను అరికట్టేందుకు తీవ్రమైన చర్యలు

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

అత్యవసర వస్తువులను అక్రమంగా నిల్వ చేయటాన్ని అరికట్టేందుకు తీవ్రమైన చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర హోం శాఖ రాష్ట్రప్రభుత్వాలను నేడు ఆదేశించింది.

అనావృష్టికి గురైన ప్రాంతాలలో కేంద్రమంత్రులు, కేంద్రబృందాలు పర్యటనా కార్యక్రమాలు నేడుతుదిరూపం యివ్వటం జరిగింది.

రాజధానిలో, చుట్టూవున్న రాష్ట్రాలలో నేడు వర్షాలు పడ్డట్టు వార్తలందటంతో అనావృష్టి తీవ్రత భయపడినంతగా వుండకపోవచ్చునని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

నేటిరాత్రిలక్నోకుబయలుదేరుతున్న కేంద్ర ఆహారశాఖ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ 11 వ తేదీన కలకత్తాను 12, 13 తేదీలలో పాట్నాను సందర్శిస్తారు.

కేంద్ర వ్యవసాయశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఎ పి. షిండే రేపు బొంబాయి వెళతారు. శ్రీ షిండే 8 వ తేదీన హైదరాబాద్‌కు వచ్చి, 10 వ తేదీన భోపాల్ వెళతారు. ప్రొఫెసర్ షేర్‌సింగ్ రేపు అహమ్మదాబాద్ వెళ్ళి, అక్కడినుండి 10 వ తేదీన జైపూర్ వెళతారు.

కేంద్ర బృందాలు రానున్న కొద్ది రోజులలో పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, గుజరాత్‌లలో పర్యటించి అనావృష్టి పరిస్థితిని ఎదుర్కొనే నిమిత్తం ఆయా రాష్ట్రాలకు అవసరమగు సహాయాన్ని గురించి అంచనావేసి, కేంద్రానికి సిఫారసు చేస్తాయి.

ప్రతి బృందానికి ప్రణాళికా సంఘం ప్రతినిధి నాయకత్వం వహిస్తారు. ఈ బృందాలలో ఆర్థిక శాఖ, ఆహార వ్యవసాయశాఖ, రవాణాశాఖ, జల విద్యుత్‌శాఖ, ఆరోగ్యశాఖ ప్రతినిధులు వుంటారు.

శాంతి ఖనిలో లాకౌట్

మేనేజిమెంటు అక్రమ చర్య

బెల్లంపల్లి, ఆగస్టు 5

శాంతి ఖని బొగ్గుగని యీ నెల 3 వ తేదీనుండి మేనేజిమెంటు మూసివేసింది.

గనిలో పనిచేసే కోల్ కట్టర్సుకు ప్రేలుడు పదార్థాలు యివ్వడానికి నిరాకరించింది.

షైరర్సు డిటోనేటర్స్‌ను గనిలోకి తీసుకపోకూడదని, కోల్‌కట్టర్సు డిటోనేటర్స్ తీసుకొనిపోవాలని - ఆదేశించి కోల్‌కట్టర్సు, షైరర్సు మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి దానికి పూనుకొన్నది గనిని అక్రమంగా మూసివేసింది.

కార్మిక సంఘ ఉపాధ్యక్షులు శ్రీ బి. గంగారాం గనిమేనేజిమెంటు అక్రమ చర్యతో, గనిని మూసివేయడాన్ని హైదరాబాద్‌లోని ప్రాంతీయ లేబర్ కమిషనర్‌కు, సింగరేణి కాలరీస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు, తదితర అధికారులకు టెలిగ్రాంద్వారా తెలియపరిచారు.

వెంటనే జోక్యం చేసుకుని అక్రమ లాకౌట్‌ను నివారించవలసిందిగా వారిని కోరారు.

ఫలప్రదమైన వీనస్ 8 ప్రయోగం

మాస్కో, ఆగస్టు 5

శుక్రగ్రహ పరిశోధనకు సోవియట్ ప్రయోగించిన వీనస్ 8 తన పనిని పూర్తి చేసిందనీ, ఆ గ్రహానికి సంబంధించిన విలువైన సమాచారం అందజేసిందనీ నేడు టాస్ వార్తాసంస్థ తెలియజేసింది.

ఈ నౌక నమూనా రూపకల్పవేత్త డిప్యూటీ చీఫ్ ప్రావ్దాకు యిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం తెలిపారు.

ఈ నౌక ప్రయోగానికి ముందు దీని యూనిట్లపై చేసిన ప్రయోగం ఫలితాలు ఆచరణలో సరియైనవిగా తేలినవని ఆయన అన్నారు.

ఇపుడు మేము ఇంకా సంక్లిష్టమైన సమస్యలను తొలగించడానికి చూస్తున్నామని ఆయన అన్నారు.

వీనస్ 8 ని వీనస్ 7 అనుభవంపై నిర్మించామనటం నిస్సందేహమని, వీనస్‌పై దిగిన శకటం రూపకల్పన మాత్రం పూర్తిగా కొత్తవని ఆయన అన్నారు.

నిరక్షరాస్యుల సంఖ్య 38.6 కోట్లకు పెరుగుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 6

మనదేశంలో ఇప్పటికి 38.6 కోట్లమంది నిరక్షరాస్యులు వున్నారని ఇటీవల జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి

అక్షరాస్యుల సంఖ్య 1971 లో 16.6 నుండి 1961 లో 24, 1971లో 29.3 శాతానికి పెరిగినప్పటికీ నిరక్షరాస్యుల సంఖ్య రెండు దశాబ్దాల్లో మునుపటికన్నా 8.8 కోట్లకు పెరిగింది

ఇందుకుకారణం జనాభా విపరీతంగా పెరగడమేనని, ప్రాథమిక,నయోజన విద్యా వసతులు తగినట్టుగా లేకపోవడమే నని చెబుతున్నారు.

అక్షరాస్యులలో జాతీయ సగటు స్థాయి అయిన 24.03 శాతానికి తక్కువగా 11 రాష్ట్రాలలో వున్నట్లు 1961 లో జరిగిన జనాభా లెక్కలు తెలియచేస్తున్నాయి. యివి ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, మధ్యప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లు. వానిలో ఇప్పుడు హిమాచల్‌ప్రదేశ్ మాత్రమే అభివృద్ధిచెంది జాతీయ సగటు స్థాయిని దాటి 29.3 శాతానికి చేరుకున్నది.

కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్‌లో అక్షరాస్యులు సంఖ్య ఎక్కువగా అనగా 61.24 శాతం వుంది

ఈవారాంతంవర్షాలు పడకపోతే ఒరిస్సాలో తీవ్రమైన కరువు

భువనేశ్వర్, ఆగస్టు 6

నిన్న ఒరిస్సాలో ప్రారంభమైన వర్షాలు ఈ వారాంతం వరకూ పడకపోతే రాష్ట్రంలో "తీవ్ర కరువు పరిస్థితి" ఏర్పడుతుందని రెవిన్యూ మంత్రి శ్రీ బ్రిజ్‌మోహన్ మహంతి అన్నారు.

పునర్వ్యవస్థీకరించబడిన "ప్రకృతివైపరీత్యాల కమిటీ" రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన నిన్న ప్రసంగించారు. ముఖ్యమంత్రి శ్రీమతి నందిని శతపథి సమావేశానికి అధ్యక్షతవహించారు. గత సంవత్సర కాలంగా వరుసగా ప్రకృతి వైపరీత్యాల సంక్షోభం గురించి ఆమె వివరించారు.

బాధలకు గురైన ప్రజానీకమందరికీ సహాయం అందించాలన్నారు. సహాయ కార్యక్రమాలకు వెచ్చిస్తున్న మొత్తం డబ్బు సరిగా వినియోగింపబడలేదని రెవిన్యూ మంత్రి ఒప్పుకున్నారు. ప్రభుత్వ ఉత్తరువులు కింది స్థాయికి చేరడంలో జాప్యం జరుగుతుందన్నారు

లక్షా 50 వేల మంది వరద బాధితులు

రాష్ట్రంలోని 13 జిల్లాలకు 6 జిల్లాల్లోని లక్షా 50 వేల మంది ప్రజానీకం గత నెల వరదలకు గురిఅయ్యారని అధికార లెక్కలు తెలిపాయి

వరదల్లో 10 మంది మరణించారు. 3444 పశువులు మరణించాయి. 6 లక్షల 90 వేల 816 ఎకరాల భూమి ముంపుకు గురయింది.

బంజరు భూముల వేలం పద్ధతికి స్వస్తి చెప్పాలి

పంజాబ్ ప్రభుత్వ నిర్ణయంపై ప్రధానికి పార్లమెంటు సభ్యుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 5

పంజాబ్‌లో బంజరుభూముల్ని హరిజనులకు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు నిర్ణీత ధరకు యిచ్చే పథకాన్ని మార్పుచేయవద్దని కోరుతూ, ముగ్గురు పార్లమెంటు సభ్యులు శ్రీ తేజ్‌సింగ్ స్వతంత్ర (కమ్యూనిస్టు), శ్రీ సత్యపాల్‌కపూర్ (కాం), శ్రీభాన్‌సింగ్‌భౌరా(కమ్యూనిస్టు) ప్రధానమంత్రికి విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు.

ఇంతకుముందు అకాలీల నాయకత్వాన వున్న మిశ్రమ మంత్రివర్గం బంజరు భూములను హరిజనులకు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు అందుబాటులో వుండేటట్లుగా, ఎకరం నిర్ణీత ధర దాదాపు రు. 400 గా నిర్ణయించింది అయితే ఆ నిర్ణయం అమలు జరగకుండానే వుండిపోయింది.

ఆ తరువాత నిర్ణీత ధరకు గాకుండా, ఆ భూములను వేలం వేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆ భూములను వేలం వేయటంవలన భూముల ధర పెరిగి, హరిజనులకు, వ్యవసాయ కార్మికులకు లభించకుండా పోయే ప్రమాదం వున్నదని పార్లమెంటు సభ్యులు ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

భూ సంస్కరణలు సహించలేని నిరంకుశ అధికారులు బంజరు భూములు వేలం వేయాలని కోరుతున్నారని, భూసంస్కరణల ప్రధాన ఉద్దేశాన్ని వమ్ము చేయదలచినవని ప్రధానమంత్రికి వారు తెలియజేశారు.

విద్యుత్ వాడకంపై 40 శాతం కోత

పరిశ్రమలకు విపరీతనష్టం

చండీఘర్, ఆగస్టు 5

పంజాబ్‌లో విద్యుత్ వాడకంపై తీవ్రమైన కోత విధింపువల్ల, కోట్ల కొలది రూపాయల నష్టం సంభవిస్తుందని, పరిశ్రమల శాఖ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

గత సంవత్సరం విధించిన 15 శాతం కోత వలన రాష్ట్రానికి రు. 18 కోట్ల నష్టం రావడమే గాకుండా, పరిశ్రమలు వార్షికంగా మూతపడటం వల్ల, కార్మికులు వేతనాల రూపంలో రు. 16 లక్షలు నష్టపోవడం జరిగిందని తెల్పారు.

గత సంవత్సరంకన్నా, ఈ సంవత్సరం విద్యుత్ కోత 40 శాతం గావడంవలన, పరిశ్రమలు ఎక్కువ కాలం మూసివేయాల్సివస్తుందని, అందుచేత నష్టం ఎక్కువగా వుంటుందని అన్నారు.

సుబ్బారాయుడుకు అస్వస్థత

హైదరాబాదు, ఆగస్టు 4

రాష్ట్రమంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడుకు అస్వస్థత ఏర్పడి నేడు ఉస్మానియా ఆస్పత్రిలో చేరారు.

స్పీకర్‌కు విశాఖ రైతుల మెమోరాండం

హైదరాబాద్, ఆగస్టు 3

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి స్థల సేకరణకై రైతులవద్ద నుంచి తీసుకొంటున్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా, ఎక్కువ ధరను చెల్లించాల్సిందిగా వేయి మంది రైతులు సంతకాలుచేసిన విజ్ఞప్తి పత్రాన్ని నేడు కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ పోతిన సన్యాసిరావు, శాసనసభ స్పీకర్‌కు సమర్పించారు.

ఆ సమయంలో స్పీకర్ స్థానంలో వున్న డిప్యూటీ స్పీకరు శ్రీ జగన్నాథరావు విజ్ఞప్తి పత్రాన్ని స్వీకరించారు.

దిగువ సీలేరు కార్మికుల తొలగింపుపై స్టే

దిగువ సీలేరు ప్రాజెక్టులో 750 మంది కార్మికులను రిట్రెంచిచేసి, లే ఆఫ్ ప్రకటించడంపై కార్మికమంత్రి శ్రీ టి. అంజయ్య స్టే ఉత్తర్వులు జారీచేశారు

కమ్యూనిస్టు శాసన సభ్యులు శ్రీ పోతిన సన్యాసిరావు, అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల సమాఖ్య కార్యదర్శి శ్రీ ఆర్. మజుందార్ చేసిన విజ్ఞప్తిపై మంత్రి స్టే ఉత్తర్వులు జారీచేశారు.

సత్తెనపల్లి విద్యార్థుల విజయం

జూనియర్ కాలేజీలో డిటెన్షన్ల రద్దు

సత్తెనపల్లి, ఆగస్టు 6

సత్తెనపల్లి జూనియర్ కాలేజీలో అక్రమంగా డిటెయిన్ చేయబడిన విద్యార్థులను ప్రమోట్ చేయటంతో జులై 18 నుండి చేస్తున్న సమ్మెను ఆగస్టు 2 వ తేదీన విరమించారు.

విద్యార్థుల కోర్కెలను ఆమోదించటంతో నిరాహారదీక్ష చేస్తున్న శ్రీ పి. నజీర్ ఖాన్, ఎ. బ్రహ్మానందంలకు రెండవ తేదీ ఉదయం శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య పండ్ల రసం యిచ్చి నిరాహార వ్రతాన్ని పరిసమాప్తం చేశారు.

సమ్మె విరమణానంతరం విద్యార్థులు విజయోత్సాహంతో పట్టణ వీధులలో ఊరేగింపు జరిపారు.

సమ్మె కొనసాగించటంలోను, నిరాహార దీక్షను విజయవంతంగా జరపటంలోను సహకరించిన వారికి కాలేజీ విద్యార్థి నాయకులు శ్రీ యస్. యం. సుభాని అభినందించారు. విద్యార్థి ఫెడరేషన్ తరఫున శ్రీ కె. ఆదినారాయణ, శ్రీవై. చెంచయ్యలు విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఒక ప్రకటనలో అభినందించారు.

బంగ్లాదేశ్‌లో వరదలు

ఢాకా, ఆగస్టు 5

బంగ్లాదేశ్‌లోని బోగ్రాజిల్లాలో సంభవించిన వరదలవల్ల 6 గురు వ్యక్తులు మరణించారని, 80 వేలమంది వరదలకు గురయ్యారని డిప్యూటీ కమిషనర్ అజిజుల్ హక్ తెలియచేశారు.

దరల స్థిరీకరణ ప్రభుత్వ అభిమతం

శ్రీ ధార్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 5

నిత్యజీవితావసర వస్తువుల ధరలు తగ్గేటట్లు చూడటం మాత్రమేగాక ధరల స్థిరీకరణ జరిగేటట్లు చూడటం ప్రభుత్వ అభిమతమని ప్రణాళికశాఖమంత్రి శ్రీ డి. పి. ధార్ తెలియజేశారు.

కరువు పరిస్థితులు,ధరల పెరుగుదల సమస్యలపై చర్చించుటకై ఏర్పడిన కాంగ్రెస్ పార్లమెంటుసభ్యుల ఇష్టాగోష్టి సమావేశంలో శ్రీ ధార్ మాట్లాడుతూ భారత ఆహారసంస్థవద్ద తగినన్ని నిల్వలున్నాయని, అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

అంతమాత్రంచేత, ఆత్మ సంతృప్తి చెందడం మంచిదిగాదని కొరతగావున్న కాయధాన్యాలు, నూనె ధాన్యాలు, ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికంచేయాలని అన్నారు.

వ్యవసాయ మంత్రిత్వశాఖ తయారుచేసిన అత్యవసర కార్యక్రమాన్ని, పరిస్థితిని ఎదుర్కొనుటకు వ్యవసాయ మంత్రిత్వశాఖ తయారుచేసిన అత్యవసర కార్యక్రమాలను, ప్లానింగ్ కమిషన్ సూచనలను వివరించారు.

అంతకుముందు సభ్యులు అత్యవసర ప్రాతిపదికపై చర్యలు తీసుకొని, పరిస్థితి తీవ్రంగాకముందే జాగ్రత్త పడాలనికోరారు.

ఈ కార్యక్రమాలు ప్రజల భాగస్వాములయ్యే విధంగావుండాలని కోరారు.

కొంతమంది సభ్యులు పంపిణీ విధానంలో లోపాలు వల్లనే ధరలు పెరుగుతున్నాయని, ఆహార వస్తువుల పంపిణీ క్రమబద్ధంగా వుండేటట్లు చూడాలని అన్నారు.

ఎక్కువ చౌక డిపోలు తెరవాలని, ప్రస్తుత మున్న చౌక డిపోలు చాలవని అన్నారు.

ఆహార ధాన్యాల తరలింపుకై మరిన్ని రైల్వే వ్యాగన్లను కేటాయించాలని, గొట్టపు బావులను మరమ్మతు జేసేందుకు వర్క్‌షాపులను ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు.

శ్రీరాం రిఫ్రిజిరేషన్ యూనియన్ ఎన్నికలు

హైదరాబాదు, ఆగస్టు 6

శ్రీరాం రిఫ్రిజిరేషన్ ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులుగా శ్రీ కె.ఎల్. మహేంద్ర తిరిగి ఎన్నికైనారు.

ప్రధాన ఉపాధ్యక్షులుగా శ్రీ పి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ జి. పాండురంగం, కోశాధికారిగా శ్రీ యం. శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

కొత్త లైన్లకన్నా జంట మార్గాలే లాభదాయకం

రైల్వే బోర్డు వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 6

ప్రస్తుతమున్న రైలు మార్గాలను జంట మార్గాలుగా చేయటం, కొత్త లైనకన్నా-వానివల్ల దూరం తగ్గినప్పటికీ-లాభదాయకమని రైల్వే బోర్డు పరిశీలనలో తేలింది.

ప్రస్తుతమున్న మార్గాన్ని జంటమార్గం చేయడంకన్నా కొత్తలైను వేయడంవల్ల ప్రతి కిలోమీటరుకు 25 శాతం ఎక్కువ ఖర్చు అవుతుంది. కొత్త రైలుమార్గంలో, ప్రతి స్టేషన్‌లో సిగ్నలింగ్ ఏర్పాటుకు, జంటరైలుమార్గం ఏర్పాటుచేయటంవల్ల ఏర్పరచవలసిన సిగ్నలింగ్ ఏర్పాట్లకు ఖర్చులో సగం తేడా వుంటుంది అనగా కొత్త స్టేషన్‌కు రు. 5 లక్షలు అవసరమైతే జంట మార్గంగా మార్చే స్టేషన్‌కు రు 2.5 లక్షలు మాత్రమే ఖర్చు అవుతుంది.

జంటమార్గం ఏర్పాటు చేసే సందర్భంలో టెలి కమ్యూనికేషన్ ఏర్పాటుకు కిలో మీటరుకు దాదాపు రు 3 వేలు అవసరం కాగా, కొత్త లైన్లకు మధ్య ప్రతి కిలో మీటరుకు రు 11 వేలు అవసరమౌతుంది.

జంటరైలు మార్గంగా మార్చడం చాలా సులభతరమైనవని. అతి ముఖ్యమైన సికింద్రాబాదు - వాడీ సెక్షన్‌ను జంట మార్గంగా మార్చడానికి 15 సంవత్సరాలు పట్టింది. అదే కొత్తమార్గమైతే ఇంకా చాలా సమయం తీసుకునేది.

నూతన మార్గానికి అదనపు కమర్షియల్ సిబ్బంది అవసరంకాని జంట రైలుమార్గంలో రైళ్ళు నడవడానికి, కొత్త సిగ్నల్సును అజమాయిషీ చేయడానికి మాత్రమే అదనపు సిబ్బంది అవసరమౌతుంది

స్కాలర్‌షిప్‌ల పథకం కొనసాగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 6

మెట్రిక్యులేషన్ తర్వాత హిందీ బోధనా భాషగా చదువు కొనసాగించే విద్యార్థులకు స్కాలర్‌షిప్ పథకాలను యధావిధిగా కొనసాగించేందుకు కేంద్రం నిర్ణయించింది

ఈ స్కాలర్‌షిప్పుల పథకం హిందీయేతర భాష మాతృభాషగాగలవారికి 1973 విద్యా సంవత్సరంలో వర్తిస్తుంది

రాష్ట్రాలవారీగా స్కాలర్‌షిప్పుల పంపకం ఈ క్రింది విధంగా ఉంటుంది

ఆంధ్రప్రదేశ్‌కు 356, గుజరాత్‌కు 104, అస్సాంకు 57, కాశ్మీర్‌కు 18, కేరళ 179, మహారాష్ట్రకు 195, మేఘాలయ 4, తమిళనాడు 347, పశ్చిమ బెంగాల్ 85, మైసూరు 247, నాగాలాండ్-2, నికోబార్ దీవులు 1, గోవా 1

3 లక్షల టన్నుల ప్రత్తినిల్వలు

బాపట్ల తాలూకాలో

నిడుబ్రోలు, ఆగస్టు 6

గుంటూరుజిల్లా బాపట్ల తాలూకాలో 3 లక్షల టన్నుల ప్రత్తి నిల్వలు పేరుకుపోయాయి ఇండియన్ కాటన్ కార్పొరేషన్ అధికారులు ప్రత్తిని కొనుగోలు చేసేందుకు ముందుకు రావటంలేదు.

ఉత్పత్తిదారుల వద్ద పేరుకుపోయిన ప్రత్తి నిల్వలను కొనుగోలు చేసేందుకు ముందుకు రావలసిందిగా శాసన సభ్యులు శ్రీ డి రంగారావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం భూమిని సాగు చేసేందుకు, ఎరువులు కొనుగోలు చేసేందుకు, బ్యాంకుల అప్పులు చెల్లించేందుకు రైతుల వద్దవున్న ప్రత్తినిల్వలను కొనుగోలు చేయవలసిందిగా ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

నూలు ధరల పెరుగుదలతో ఇనుమడించిన కష్టాలు

చేనేత పారిశ్రామికులపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శ

మచిలీపట్నం, ఆగస్టు 6

ముడిసరుకు అయిన నూలుధరలు విపరీతంగా పెరిగిపోవటంవలన చేనేత పారిశ్రామికులు పనిలేక తీవ్రమైన యిబ్బందులకు గురవుతున్నారని, రోజురోజుకు ధరలు పెంచుతున్న సట్టావ్యాపారులను ప్రభుత్వం అరికట్టలేక పోతున్నదని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం అధ్యక్షులు, బందరు తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ మెట్ల వీరయ్యగారొక ప్రకటనలో విమర్శించారు.

23 జులైన 10 పౌన్లు 75 రూపాయలు అమ్మిన 60 నెంబరు నూలు ఆగస్టు 2తేదీన 85 రూ॥ అమ్ముతున్నారని అలాగే 80 నెంబరు నూలు 106రూపాయలనుండి 115కు పెరిగింది అయన తెలియ చేశారు.

సట్టా వ్యాపారులు, బ్లాక్ మార్కెటుదార్ల అక్రమ చర్యలకు బలి అవుతున్న చేనేత పారిశ్రామికుల పరిస్థితిని గమనించి వారి సమస్యలను పరిష్కరించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయని ఆయన విమర్శించారు.

విజయవాడలో పౌష్టికాహార పథకం

ఆగస్టు 15 నుండి అమలు

విజయవాడ, ఆగస్టు 6

విజయవాడ మురికివాడలలో ఆగస్టు 15 నుండి పౌష్టికాహార పథకాన్ని అమలుజరుపనున్నట్లు పట్టణ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీ ఆర్. ప్రసాదరావు యిటీవల యిక్కడ జరిగిన లయన్స్‌క్లబ్ సమావేశంలో ప్రకటించారు.

ఈ పథకం కేంద్ర ప్రభుత్వ సాయంతో అమలు జరపబడుతుంది కేంద్రం నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేసింది

ఈ పథకం క్రింద పదివేలమంది బాలబాలికలకు బోనుమిల్కు, ఉప్మా అందచేస్తామని ఆయన తెలిపారు

పథకం సక్రమంగా అమలు జరిగేందుకు లయన్స్ క్లబ్‌వంటి సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్ల పరిస్థితి సరిగా వుండకపోవటానికి, డిస్పెన్సరీలలో మందులు లేకపోవటానికి, సిటీ సర్వీసు సంతృప్తికరంగా లేకపోవటానికి నిధులు కొరతయే కారణమని అన్నారు

ఆర్థిక పరిస్థితి మెరుగు పడనందున కొత్త పనులు ప్రారంభించేందుకు వీలు లేదన్నారు

క్లబ్ సమావేశానికి శ్రీ జి. వర్మారావు అధ్యక్షత వహించారు. శ్రీ డి ఆర్. కె. మూర్తి ముఖ్య అతిథిని పరిచయం చేశారు. క్లబ్ కార్యదర్శి శ్రీ గొట్టిపాటి మురళీ మోహన్ వందన సమర్పణ చేశారు.

(వి. ఎ)

బెంగుళూరు, ఆగస్టు 5

మైసూర్ శాసనసభ, శాసనమండలి సమావేశాలు నేడు 14 వ తేదీకి వాయిదా పడ్డాయి.

నందికొట్కూరు సమితి అధ్యక్షునిచే 200 ఎకరాలు బినామీ బదలాయింపు

తహసిల్‌దారు బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసిల్‌దారు అక్రమ చర్య

నందికొట్కూరు, ఆగస్టు 6

కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకా అల్లూరు గ్రామంలో శ్రీ ఇప్పల తిమ్మారెడ్డి, అతని తమ్ముడు శ్రీ చెంచురెడ్డి, వీరిద్దరి తల్లి లక్ష్మమ్మలకు హిందూ అవిభక్త కుటుంబానికి 400 ఎకరాల పొలం వున్నది.

అందులో 90 ఎకరాలు కె.సి. కెనాల్ క్రింద వుంది. ఇది రెండు పంటలు పండుతుంది. భూముల బదలాయింపుల నిషేధపు ఆర్డినెన్సు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తర్వాత ఈ ఆర్డినెన్సు నుండి తప్పించుకొనేందుకు నందికొట్కూరు సమితి అధ్యక్షులైన శ్రీ ఇప్పల తిమ్మారెడ్డి తన రాజకీయ పలుకుబడిని వుపయోగించి, డిప్యూటీ తహసిల్‌దారు శ్రీరాధాకృష్ణమూర్తి తాత్కాలికంగా తహసిల్‌దారు బాధ్యతలు నిర్వహిస్తుండగా 200 ఎకరాల పొలాన్ని తన తీతగాంద్రపేర, కూలీలపేర, తన చెప్పు చేతల్లోని వారిపేర దొంగతనంగా పట్టాలు ట్రాన్సుఫర్లు చేయించారు. ఈ ట్రాన్సుఫర్లకు వెనుకటి తేదీలు వేయించారు. ఈ రాధాకృష్ణమూర్తి వెనుక నందికొట్కూరు సమితిలో మేనేజర్‌గా పనిచేసి వెళ్ళారు.

బినామీల బదలాయింపులదార్ల పేరుతోనే సెటిల్‌మెంటు లెవీలు విధించారు. అయితే వెనుక సెటిల్‌మెంటు లెవీ విధింపులోగానీ, మా ప్యారీ లెక్కలలోగాని 10 (ఎ): 6 వ నెంబరు లెక్కల్లోగాని శ్రీతిమ్మారెడ్డికుటుంబం హక్కు భుక్తంలో యీ భూములున్నట్లు రుజువు వున్నది. భూసంస్కరణలనుండి తప్పించుకోవడానికే యీ బదలాయింపులు జరిగాయి.

ఈ విషయమై నందికొట్కూరు సోషలిస్టు ఫోరం ఒక కరపత్రం వేసింది. వెంటనే రెవిన్యూ రికార్డులు సీజుచేసి బినామీ బదలాయింపులకు బాధ్యులైన వారిపై తగుచర్యలు తీసుకోవాలని ఆ కరపత్రం కోరింది.

మారెళ్లలో కౌలు రైతు బేదఖల్‌కు భూస్వామియత్నం

పత్తికొండ, ఆగస్టు 6

కర్నూలుజిల్లా పత్తికొండ తాలూకా మారెళ్లగ్రామంలో శ్రీ చాకలి గిడ్డయ్య తన తండ్రి కాలంనుండి దాదాపు 80 సంవత్సరాలుగా శ్రీ యాడికి వెంకటస్వామికి చెందిన శ్రోత్రియం భూమిలో సుమారు 15 ఎకరాలు సాగుచేసుకుంటూ కౌలు యిస్తున్నాడు.

శ్రోత్రియం మొత్తం విస్తీర్ణం దాదాపు 1200 ఎకరాల గలవు.

ఇదిగాక వందఎకరాలు పట్టా భూమి కూడా భూస్వామికి వుంది. భూముల బదలాయింపుల విషేధపు ఆర్డినెన్సు వచ్చిన తర్వాత భూమిమండి వదలిపోవాల్సినదిగా శ్రీ వెంకటస్వామి శ్రీ గిడ్డయ్యను వత్తిడి చేయడం జరిగింది.

అయినా 15 ఎకరాలలో శ్రీ గిడ్డయ్య విత్తనం వేశాడు. ఇప్పుడు గ్రామ కరణం భూముల వివరాలు రాస్తున్నారు. కాని ఆ భూమిని శ్రీ గిడ్డయ్య కౌలుకు చేస్తున్నట్లు రాయలేదని తెలుస్తున్నది. కౌలు కిచ్చినట్టుగా రాసి యివ్వమని రైతు అడిగితే భూస్వామి రాసి యివ్వలేదు. 80 ఏళ్ళుగా సాగుచేస్తున్న ఆ పేదరైతును పొలంనుంచి వెళ్ళగొట్టడం చట్టవిరుద్ధం. భూస్వామి తన పలుకుబడితో బేదఖల్ చేసే ప్రమాదముంది.

అందువలన జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్‌ఆఫీసర్‌కు శ్రీగిడ్డయ్య అర్జీ పెట్టుకుంటూ తనను పొలం నుండి వెళ్ళగొట్టకుండా రక్షణ కల్పించాలని కోరారు. ఈ భూమిని "బండచేను" నామకంటోనిచేను" అని అంటారు. ఈ శ్రోత్రియం పొలానికి రెడ్డి, కరణం శ్రోత్రియందారులే కాబట్టి ఈ విషయంలో తనకు న్యాయం కలుగజేయాలని ప్రభుత్వాన్ని శ్రీ గిడ్డయ్య కోరారు.

నిడదవోలులో దొంగతనాలు

నిడదవోలు, అగస్టు 4

నిడదవోలు పట్టణంలో దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి. ప్రతి శనివారం సంత రోజున సైకిళ్ళ దొంగతనాలు జరుగుతున్నవి.

ఇటీవల శ్రీ కొంపెల్లి కామేశ్వరరావు యింటిలో దొంగలుపడి వంటయింటిలోవున్న స్టీలు పాత్రలు, ఖరీదు అయిన చీరలుమొత్తం సుమారు రు. 600 ఎత్తుకుపోయారు. ఈ విషయం పోలీసులకు రిపోర్టుచేయడం జరిగింది.

ఇళ్ళలో వున్న రేడియోలు, గడియారాలు బట్టలూ దొంగతనం జరుగుతున్నాయి. పోలీసువారుశ్రద్ధ తీసుకొంటే యీ దొంగతనాలు అరికట్టవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

పొన్నూరులో లారీ, బస్సు ఢీ

పొన్నూరు, అగస్టు 4

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో కోటమ్మ గుడివద్ద గత నెల 27 వ తేదీన ఆర్. టి. సి. లారీ-బస్సు ఢీకొనగా ఆర్. టి. సి. బస్సుకు మాత్రం ప్రక్క సన్న అద్దాలు పగిలిపోయినవి.

బస్సులోవున్న ఒక స్త్రీకి స్వల్పమైన గాయం తగిలింది. ఇక్కడ రోడ్డులో అగసుంత స్థలం లేనందున చాలా యిరుకుగా వుంటున్నది. అందువలన యిలాంటి సంఘటనలు జరిగే అవకాశాలు ఏర్పడుతున్నాయి దీనికి తోడు డ్రైవర్ల అజాగ్రత్తకూడా వుంది. ఇక్కడ ట్రాఫిక్ కంట్రోలు చేయుటకు ఒక కానిస్టేబుల్ అయినావుంటే యిలాంటి ప్రమాదాలు చాలా నివారించవచ్చును.

హరిజనుని కొట్టగా బావిలోపడి మృతి

జడ్డంగి అన్నవరంగ్రామంలో భూస్వామి దురాగతం

పెద్దాపురం, అగస్టు 5

తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు తాలూకా జడ్డంగి అన్నవరం గ్రామంలో గ్రామ మునసబ్ శ్రీ తోట సత్యనారాయణ ఒక హరిజనుని కొట్టాడు. ఆ హరిజనుడు మునసబ్ దొడ్డిలోని బావిలో పడి చనిపోయాడు. యీ సంఘటన గతనెల 27 వ తేది జరిగింది.

అందుపై ప్రత్తిపాడు పోలీసులు నూతి నుండి శవాన్ని తీసి పంచాయతీ జరిపి పోస్టు మార్టంకొరకు ప్రత్తిపాడు ఆసుపత్రికి పంపారు.

పోలీసులు మునసబును అరెస్టుచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు మాఫీ చేయించుటకు స్థానిక శాసనసభ్యుడు కృషి చేస్తున్నట్లు తెలుస్తుంది.

మందులు లేకుండా కలరా రోగి మృతి

చిలకలూరి పేటలో

చిలకలూరిపేట, అగస్టు 5

గుంటూరుజిల్లా నర్సరావుపేట తాలూకా చిలకలూరిపేటలో ఆర్. కృష్ణారెడ్డి పుగాకు కంపెనీలో ఈ నెల 1వ తేదీ పనిచేస్తూ వుండగా గణపవరం గ్రామానికి చెందిన పులి లక్ష్మమ్మకు కలరా తగిలింది.

సాయంత్రం 5 గంటలకు చిలకలూరిపేట గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకుపోగా డ్యూటీలోవున్న డాక్టర్ మందులులేవన్నాడు. ఇన్‌ఛార్జి డాక్టర్ తాళాలు వేసుకొని వెళ్ళాడని అన్నాడు. మందులు తెచ్చుకుంటే వాడుతానని చెప్పాడు.

మందులు తెచ్చుకోవడం జరిగింది రోగికి కొన్ని మందులు వాడటం జరిగింది.

కలరా తగిలిన రోగికి సరైన మందులు వాడనందున తెల్లవారు ఝామున 4 గంటలకు రోగి మృతి చెందింది

రోగికి కావలసిన మందులు యివ్వలేని స్థితి కల్పించి, తాళం వేసుకుపోయిన డాక్టర్‌పై చర్య తీసుకోవాలని చిలకలూరిపేటలో కలరా నిరోధక చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట ఏరియా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ గాత్రం నాగయ్య కోరుతున్నారు.

ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు ధర్మకర్తల సంఘ సమావేశం

విజయవాడ, అగస్టు 6

ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు ధర్మకర్తల సంఘ సమావేశం ఇటీవల విజయవాడలోని శ్రీ సర్వోత్తమ భవనంలో జరిగింది శ్రీ నాగినేని వెంకయ్య అధ్యక్షత వహించారు.

వచ్చే 3 సంవత్సరాలకు క్రింది కార్య నిర్వాహక వర్గాన్ని ఎన్నుకొన్నారు.

శ్రీ నాగినేని వెంకయ్య అధ్యక్షులుగా, శ్రీ ఎలమంచిలి వాగేశ్వరరావు ఉపాధ్యక్షులుగా; శ్రీ పాతూరి నాగభూషణం కార్యదర్శిగా, శ్రీ దిగవల్లి శేషగిరిరావు సహాయ కార్యదర్శిగా, శ్రీ కోదాటి నారాయణరావు, శ్రీ మేళ్ళచెర్వు వెంకటేశ్వర్లు సభ్యులుగా ఎన్నికైనారు.

ఆంధ్రప్రదేశ్ గాంధీ సాహిత్య నికేతనం నిర్వహణ బాధ్యతను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం వారి అభ్యర్థన ననుసరించి స్వీకరించుటకు అంగీకరించారు.

నాటకోత్సవాలకు ఎంట్రీల గడువు పొడిగింపు

హైద్రాబాద్, అగస్టు 6

వివిధ సాంస్కృతిక సంస్థల కోరిక ననుసరించి అక్టోబరులో జరిగే నాటకోత్సవంలో పాల్గొనే నాటక నాటికల దరఖాస్తులు అకాడమీకి చేరవలసిన గడువును అగస్టు 10 వ తేదీవరకు పొడిగించడం జరిగిందని ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఉత్సాహంగల సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అగస్టు 10 వ తేదీలోగా ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ కార్యాలయానికి దరఖాస్తులు చేరేటట్టు పంపవలెను.

నూజివీడు ఆర్.టి.సి డిపో కార్మికులచే జీతాలు నిరాకరణ

విజయవాడ, అగస్టు 6

ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణా బ్రాంచి సహాయ కార్యదర్శి శ్రీ అన్నవరపు సుబ్బారావును, యూనియన్‌ను, డివిజనల్ కంట్రోలు అసభ్యంగా మాట్లాడినందుకు నిరసనగా నూజివీడు డిపో కార్మికులు ఈనెల 1 వ తేదీ జీతాలు తీసుకోకుండా నిరాకరించారు.

ఆర్. టి. సి, ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణా బ్రాంచి సహాయ కార్యదర్శి శ్రీ అన్నవరపు సుబ్బారావు జూలై 29 వ తేదీ గుంటూరు — నూజివీడు సర్వీసులో కండక్టరుగా డ్యూటీలో వుండగా విజయవాడ డివిజనల్ కంట్రోలర్ శ్రీ బి. బి. కృష్ణయ్య బస్సుఆపి బస్సులో నూజివీడు డిపో సిబ్బంది ప్రయాణిస్తున్నారనేనెపంతో శ్రీసుబ్బారావును అసభ్యంగా మాట్లాడారు. యూనియన్‌పేరు పెట్టి నీచంగా మాట్లాడారు.

అక్రమంగా కేసు వ్రాసి స్పేరులో పెట్టడం జరిగింది. డి. వి. సి. తో వున్న చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు అంతకు కొద్ది నిమిషాల ముందే బస్సును తనిఖీచేసి సక్రమంగా వున్నట్లు ఎస్. ఆర్. లో నమోదు చేయడం, అప్పటికే బస్సులో ప్రయాణించుతున్న సిబ్బందిని చూసికూడా వారు అనుమతించడం జరిగింది

డివిజనల్ కంట్రోలర్ యొక్క యీ అనుచిత వైఖరికి నిరసనగా నూజివీడు డిపోలోని ఐ. యన్. టి. యు. సి. కార్మికులతో సహా మొత్తం సిబ్బంది యీ నెల 1 వ తేదీ జీతాలు తీసుకోలేదు.

డిపో కార్యదర్శి శ్రీ ఆర్. నారాయణరావు, డిపో మేనేజర్‌కు మెమొరాండం అందచేశారు. సుమారు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో డిపోమేనేజర్ శ్రీసుబ్బారావును స్పేరునుండి తొలగించి డ్యూటీకి పంపడం జరిగింది.

శ్రీ వెల్లంకి సుబ్బారావు అభినందనలు

ఈ నెల 1 వ తేదీ నూజివీడు డిపోలో కార్మికులు సంయుక్తంగా నిర్వహించిన జీతాల నిరాకరణ కార్యక్రమంవల్ల బ్రాంచి కార్యదర్శి శ్రీ వెల్లంకి సుబ్బారావు కార్మికులను అభినందించారు.

సంస్థలో గుర్తింపు పొందిన యూనియన్ ఆఫీసు బేరర్‌నూ, యూనియన్‌నూ నిందించిన డివిజనల్ కంట్రోలరు యొక్క అనుచిత వైఖరిని ఆయన ఖండించారు.

వ్యవసాయ కార్మిక కనీసవేతనాల కమిటీ ఎదుట సాక్ష్యం

శ్రీకాకుళం జిల్లాలో

శ్రీకాకుళం, అగస్టు 6

వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించుటకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ శ్రీకాకుళం వచ్చిన సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం తరఫున శ్రీ కూన కృష్ణమూర్తి, శ్రీ నారాయణమూర్తి, కంచిరావు, శ్రీ సూర్యనారాయణ, శ్రీ వి. రామ్మూర్తి, అప్పాయినాయుడు వివిధ తాలూకాల తరఫునహాజరై రిపోర్టుయిచ్చారు.

జోన్ల మార్పుటలో తాలూకా పరిధియే గాక నీటి వనరులు ఆధారంగా తీసుకోవాలని కోరారు. అలా చూచుకొంటే కాల్వ నీరు పారే ప్రాంతం మొదటి జోనుగానూ, ఏజెన్సీ ప్రాంతం, వర్షాధార ప్రాంతం 2 వ జోనుగా గుర్తించాలన్నారు.

ఇక రేట్ల విషయంలో పనులు ఒత్తిడి దినాలలో దిన కూలీ రు. 3 50 నుండి రు. 3 వుండాలనీ, మామూలు దినాలల్లో పురుషులకు రు. 3, స్త్రీకి రు 1.50కి తగ్గించరాదని కోరారు,

ముఖ్యంగా ప్రభుత్వ రేట్లకంటే తక్కువ వున్నచోట వ్యవసాయ కార్మికులకు చెందిన లేబర్ అధికారులు జోక్యం చేసుకొని భూస్వాములకు వ్యతిరేకంగా నిలబడి కార్మికులకు రక్షణ కలిగించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండపేట, తాపేశ్వరంలో

తాపేశ్వరం, అగస్టు 6

తూర్పుగోదావరిజిల్లా మండపేటలోనూ, తాపేశ్వరంలోనూవిద్యుచ్ఛక్తి ప్రతి 15 నిముషాలకు ఒకసారి ఆగిపోతూవుంది.

ఒకొక్కదఫా మూడు, నాలుగు గంటలు కరెంటు వచ్చుటలేదు. ఈ విధంగా ఎందుకు ఆగిపోతూవుందో అధికారులనుండి ఏ విధమైన సమాచారం తెలియుటలేదు.

ఈ విధంగా ఆగిపోవుటచే పరిశ్రమలకు, మెరక వ్యవసాయదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నవి.

విద్యుచ్ఛక్తి కొరత లేకున్నా ఈవిధంగా ఆగిపోవడం నిర్వహణలోపమని భావింపబడుతూ వుంది.

రెంటచింతలలో వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం

రెంటచింతల, అగస్టు 6

పల్నాడుతాలూకా రెంటచింతల గ్రామంలో గతనెల 30వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘసమావేశం జరిగింది.

తాలూకా వ్యవసాయ కార్మిక సంఘాధ్యక్షులు సమావేశంలో ప్రసంగిస్తూ వ్యవసాయ కార్మిక సంఘ వుద్యమాన్ని గూర్చి వివరించారు.

ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

శ్రీ షేక్ మస్తాన్ అధ్యక్షులుగా శ్రీ మాంకాలి దేవయ్య ఉపాధ్యక్షులుగా, శ్రీ ఓర్సు సుందరరావు కార్యదర్శిగా, శ్రీ పేదారపు నరసయ్య సహాయ కార్యదర్శిగా. శ్రీ సురభి అమరలింగం కోశాధికారిగా ఎన్నికైనారు.

మంగళగిరి టి. బి. ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్ మూత

(విశాలాంధ్ర విలేకరి)

మంగళగిరి, అగస్టు 6

గుంటూరుజిల్లా మంగళగిరిలోని ప్రభుత్వ టి. బి. ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌కు వచ్చి ఆపరేషన్లు చేసే సర్జన్ జూలై 24 న అమెరికా వెళ్ళిన కారణంగా మరొకరెవరూ లేని పరిస్థితిలో మూసివేయబడింది.

ఆస్పత్రిని పెట్టిన మొదట్లో ఆపరేషన్ థియేటర్‌కు సర్జన్‌ను నియమించారు తర్వాత సర్జన్‌సుగా వున్న డా॥ విశ్వనాధంను గుంటూరు ప్రభుత్వజనరల్‌ఆస్పత్రిలో 'తొరాసిక్' సర్జన్‌గా వేసి, ఆయనే వారానికొకసారి వచ్చి వెళ్ళేలాగు ఏర్పాటు చేశారు. 'ఎనస్తీషియా' (మత్తుమందు) యిచ్చే డాక్టరును నియమించమని ఆస్పత్రి సూపరెంటెంటు ప్రభుత్వానికి ఎన్నిసార్లు వ్రాసినా సమాధానంలేదు కనీసం వారానికొకసారి గుంటూరునుండి పంపమని కోరినా సమాధానంలేదు.

ప్రస్తుతం ఆ సర్జన్ అమెరికా వెళ్ళాడు. 'ఎనస్తీషియా'యిచ్చే డాక్టరునునియమించి, తిరిగి సర్జన్‌ను వేస్తేగాని ఆపరేషన్ థియేటర్ మరల ప్రారంభంకాదు. ఈ థియేటరు మూతపడిన కారణంగా గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన రోగులు బాధపడవలసి వస్తున్నది. లక్ష రూపాయల విలువగల పరికరాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

కనుక ప్రభుత్వం వెంటనే ఈ ఆస్పత్రికి సర్జన్‌ను, ఎనస్తీషియా డాక్టరును నియమించి ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభింపజేసి రోగులను ఆదుకోవాల్సిందిగా గుంటూరుజిల్లా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీ ఎ శివరామకృష్ణయ్య, మంగళగిరి పంచాయితీ సమితి ఉపాధ్యక్షులు శ్రీ నాగళ్ళ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో కోరారు.

అప్‌గ్రేడ్ ఆస్పత్రిగా మార్చాలి

మంగళగిరి ప్రభుత్వ డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ హాస్పిటల్‌గా మార్చాల్సిన అవసరముందని కూడా ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు.

ఆ ప్రకటనలో యింకా యిలా వుంది:

మంగళగిరి సబ్‌తాలూకాను తాలూకాగా మార్చే ప్రతిపాదన కూడా వుంది మంగళగిరి మున్సిపాలిటీకూడాఅయింది చుట్టుప్రక్క లక్ష జనాభా గల గ్రామాలకు కూడలి. ప్రతి దినం యీ ఆస్పత్రి ఓ. పి. కి 400 మందికి పైగా రోగులు వస్తారు.

ట్రంక్ రోడ్డు మీద జరిగే ప్రమాదాల కేసులు కూడా యిక్కడకు వస్తాయి. అందుచేత సివిల్ సర్జన్‌ను నియమించాల్సిన అవసరం కూడా వుంది. ప్రజల సహకారంతో భవనాలు కట్టడం కూడా జరిగింది. ఈ పరిస్థితిలో 20 పడకలు మంజూరు చేసి అప్‌గ్రేడ్ చేయాలని అనేక సంవత్సరాల నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రభుత్వానికి సిఫారసు చేసి పంపినా యింతవరకు ఏమీ జరుగలేదు కనుక ప్రభుత్వం తక్షణమే యీ విషయాలను పరిశీలించి మంగళగిరి ప్రభుత్వ డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ ఆస్పత్రిగా మార్చాలని కోరుతున్నాం

రాజమండ్రి మున్సిపల్ కార్మికులచే ఒకపూట పని నిలుపుదల

రాజమండ్రి, అగస్టు 6

రాజమండ్రి మున్సిపల్ కార్మికులు మున్సిపల్ లేబరు యూనియన్ ఆధ్వర్యాన జూలై 29వ తేదీ సాయంత్రం మున్సిపల్ కార్యాలయంవద్ద ప్రదర్శన జరిపారు.

మున్సిపల్ కమీషనర్ పనివారల సమస్యలను విని సమాధానం చెప్పడానికి బదులు విసుక్కోవటంలో అధికారుల ఈ వైఖరికి నిరసనగా 30 వ తేదీ ఉదయం కార్మికులు ఒకపూట పనిమానివేశారు. ఆ సందర్భంగా పనివారల సమస్యలపై యూనియన్ కార్యదర్శి శ్రీ ముత్యాల చిన అప్పలస్వామి, ఉపాధ్యక్షులు శ్రీ వరదా బ్రహ్మానందం, శ్రీ ముత్యాలరాజు మాట్లాడారు.

లోగడ యిచ్చిన బకాయీల తాలూకు లెక్కలుగట్టి తేడాలు సవరించి మిగిలినది యివ్వాలని, నెలకు రు. 7 చొప్పున పెంచిన డి ఎ 5 నెలలకు రు. 35 వెంటనే యివ్వాలని, 1968 వ సంవత్సరం నుండి బదిలీ పనివారికి బకాయీలు వెంటనే యివ్వాలని, దుస్తులు, చెప్పులు, నూనె, సబ్బులు వెంటనే యివ్వాలని, మున్సిపల్ కార్మికుల పేటలో నీటి కుళాయిలసంఖ్య పెంచి, లైట్లు రోడ్లు వేయాలని, మస్తర్లు సక్రమంగా వేయాలని మున్సిపల్ కార్మికులు కోరారు.



వ్యవసాయరంగం

తెగుళ్లను నిరోధించగల కొత్తరకం పుగాకు జాతులు

అన్యజాతి సంపర్క పద్ధతులలో మొజాయిక్, రూట్-రాట్ మొదలయిన రోగాలకు లొంగని పుగాకు రకాలను సోవియట్ శాస్త్రవేత్తలు మిహైల్‌తెరొన్నెవ్‌స్కీ, (డి.ఎస్.సి. వ్యవసాయం)) అలెగ్జాండ్రా తెరంత్యేవాలు ప్రపంచంలోకల్లా ప్రప్రథమంగా పెంపొందించారు. మధ్య ఆసియా, మోల్డావియాలలో ఇదివరకు సాగుచేస్తూండిన జాతులస్థానే కొత్త జాతి పొగమొక్కలు డ్యూబెక్ 366 అమెరికన్ 287 త్రెసిజోండ్-3072 పైరు చేయబడుతున్నాయి. రోగాలను లొంగని జాతుల సాగువలన పంట నికరంగా అందుతూంది. రైతులకు తెగుళ్ళను నిర్మూలించే క్రిమి సంహారక మందులు ఉపయోగించే అవసరమూ తగ్గిపోయింది.

మిహైల్‌తెరొన్నెవ్‌స్కీ. అలెగ్జాండ్రా తెరంత్యేవాలు ఎన్నో ఏళ్ళపాటు జరిపిన పరిశోధనల ఫలితంగా కొత్త పుగాకు జాతులు లభించాయి. రోగాలకు లొంగని పుగాకు జాతుల కోసం సాగించిన అన్వేషణ ఎంతో కాలంపాటు ఫలించలేదు పుగాకు మొక్కలనుంచే మంచి రకాలను ఎన్నికచేసే పద్ధతి ననుసరించినంతకాలం ఈ వైఫల్యం ఎదురయింది. చివరకు శాస్త్రవేత్తలు సుదూరజాతి సంపర్కంద్వారా కొత్త మొక్కల్ని రూపొందించగలిగారు. ఇది చాలా కఠినమైన పద్ధతి నేడు అడవుల్లో పెరిగే అడవి జాతిని కోటీరా గ్లూకినోసా జాతి మొక్క దీనికి చాలా అనుకూలంగా వచ్చింది. ఈ మొక్కలోని క్రోమోసోములు కొన్ని సాగు పుగాకు మొక్క క్రోమోసోములు కొన్నింటి స్థానం తీసుకోగలవని పరిశోధనలలో తేలింది.

ఈ విచిత్రమైన మొక్కలతో పనిచేస్తున్నప్పుడు పొంగునా ఆశ్చర్యకర సమస్యలే ఎదురయాయి. జాతి సంకరంలో పుట్టిన మొక్క విత్తనాలు వేస్తే మొలవలేదు. మొలచినవి పీలగా వుండిపోయాయి కొన్ని జాతుల సాంకర్యం బయోలాజికల్‌గా పొసగదు ఈ అవరోధాన్ని అధిగమించడానికై శాస్త్రవేత్తలు మన్నులోగాక అంపరమైన రసాయన పదార్థాలనూ, పోషక పదార్థాలనూ చేర్చిన 'అగర్-అగర్'లో ఈ విత్తనాలను మొలకెత్తించారు అంటుపద్ధతి కూడా ప్రయత్నించారు. అంటు పద్ధతిలో పెంచిన మిశ్రమ జాతి మొక్కలు రోగాలకు లొంగలేదు. కాని వానికి విత్తనాలులేవు

ఈ మిశ్రమ జాతి మొక్కల వారసులలో కావలసిన లక్షణాలు సుస్థిరంగా వుండేటట్లు చేయడానికి మిహైల్‌తెరొన్నెవ్‌స్కీ అలెగ్జాండ్రా తెరెంత్యేవాలు ఎన్నెన్నో క్లిష్టాతిక్లిష్టమైన పరిశోధనలు జరిపారు. తర్వాతనే మిల్‌డ్యూ, మొసాయిక్ తెగుళ్ళకి లొంగని పుగాకు జాతులను వ్యాపార స్థాయిలో పెంచగలిగారు.

తెగుళ్ళకు లొంగని ఈ పొగాకు జాతులు సోవియట్‌లోని పొగాకుపేసే రాష్ట్రాలన్నింటికేగాక బయటి దేశాలకు కూడా పాకేయి.

ఉదాహరణకి బల్గేరియాలో కొత్త కొత్త జాతుల సృష్టికి ఇది ప్రాతిపదికగా వినియోగపడ్డాయి మొజాయిక్, మిల్‌డ్యూ తెగుళ్ళని నిరోధించగల నెవ్రోకోన్ - 261 జాతిని తయారు చెయ్యడానికి పునాదిగా డ్యూబెక్-366 రకం ఉపయోగపడింది

ఇప్పుడు సోవియటులోని పొగతోటలలో వైద్య శాస్త్రవేత్తలు రూపొందించిన ఇమ్యూన్-580 రకాన్ని ప్రవేశపెడుతున్నారు. ఇది మహా ప్రమాదకరమైన దౌనీ మిల్‌డ్యూ తెగులుకు లొంగని రకం. పుగాకు మొక్కకు దూరపు చుట్టం అయిన ఆస్ట్రేలియా దేశపు నికోటియా డెబ్నేయ్‌తో సంకరపరిచారు వూహించికూడా వుండని ఫలితాలు లభించాయి

బొలీవియన్ టొమాటోసిఫార్మిస్ మొక్కతో సంకర పరిచినప్పుడు లభించిన జాతులు ఇంకా అధిక పంట నిచ్చాయి ప్రాథమిక ఫలితాల్ని బట్టి ఈ జాతిమొక్క వేస్తే హెక్టారుకు 5,0 టన్నులు హెచ్చు దిగుబడి వుంటుందని లెక్క తేలింది

కొత్త కొత్త తెగుల్ని రూపొందించేటందుకు క్యూబా శాస్త్రవేత్తలు మొక్కల ఎన్నిక పద్ధతిని అనుసరిస్తున్నారు త్వరలోనే వారు కృత్రిమ వాతావరణ గృహాలనుపయోగించి ఏడాదిలో కృత్రిమ జాతి మొక్కల్ని రెండు తరాలుగాక మూడు తరాలను పెంచగలుగుతారు అప్పుడు కొత్త జాతిని సంపాదించడానికి 10-12 ఏళ్ళు పట్టడానికి బదులు 5-6 ఏళ్ళు చాలుతుంది కృత్రిమ భూసారంలో పుష్పించేవి ఉండే సరాసరి మొక్కను పెంచగలుగుతే ఇంకా త్వరగా పని జరుగుతుందని మిహైల్ తెరొన్నెవ్‌స్కీ అన్నారు. దీనివలన ఎన్నిక చక్రం త్వరితంగా సాగుతుంది

తెగుళ్ళకు లొంగని కొత్త జాతి మొక్కలను సుదూర జాతి సంపర్కంతో రూపొందించినందుకు మిహైల్ తెరొన్నెవ్‌స్కీ, అలెగ్జాండ్రా తెరంత్యేవాలకు 1970 లో ప్రభుత్వ అవార్డు లభించింది

వారు అనుసరించిన పద్ధతి వలన కలగగల లాభాలు ఇక్కడితో ముగియవని క్రిస్టోవ్‌స్కా-లోవ్ (బల్గేరియన వ్యవసాయ విజ్ఞాన పరిషత్తు అధ్యక్షులు, వృక్షశాస్త్రం ఎన్నిక విజ్ఞానసంస్థ డైరెక్టరు) కూ, బన్ శాస్త్రవేత్తల పరిశోధనలు జీవశాస్త్ర విజ్ఞానానికెంతో ప్రాముఖ్యం వున్నదనీ, సుదూర జాతి సృష్టిలో సంపాదించిన అనుభవాన్ని పెద్ద పెట్టున మిగతా పంటలకు కూడా వర్తింప చేయాలి అని అన్నారు.

యూరి పెనొమరెంకో

'కావేరి'-కొత్త వరివంగడము

ఆంధ్రప్రదేశ్‌లో వరి పండించే కొన్ని ప్రాంతాలలో అదనులో తగినంత నీటి పాదుదల సౌకర్యములులేవు

అందుచేత నీటి పారుదల ద్వారా పరిమితంగా లభించే నీటిని ఈ ప్రాంతపు రైతులు లాభదాయకంగా ఉపయోగించుకొనుటకు తక్కువ కాలంలో కోతకువచ్చి, ఎక్కువ దిగుబడినిచ్చే వరి రకములను పండించుట లాభదాయకం. అంతేకాకుండా, తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే వరి రకములను పండించుట ద్వారా ఏడాదికి మూడు పంటలుకూడా పండించవచ్చు.

ఎక్కువగా ఎరువులను వాడుట,ప్యాకేజి పథకములను అమలు పరచుటతోపాటు ఎక్కువ మోతాదులలో ఎరువులను వాడినప్పుడు ఈ వరి వంగడములు వేసిన ఎరువుల మోతాదును తట్టుకొని ఎక్కువపంట నిచ్చే శక్తి కలిగివుండాలి.

అటువంటి వరివంగడముల ఆవశ్యకత గుర్తించుటకు తక్కువ వ్యవధిలో అనగా 105 నుండి 110 రోజులలో కోతకువచ్చే 'కావేరి' రకం వరి వంగడము విడుదల చేయబడింది.

ఆంధ్రప్రదేశ్‌లో వాడుకలోవున్న ఎక్కువ దిగుబడినిచ్చే వరివంగడములలో ఐ.ఆర్-8, జయ మరియు హంస ముఖ్యమైనవి ఐ. ఆర్. 8 రకం వరి 135 నుండి 140 రోజుల లోను, జయ రకం 125 నుండి 130 రోజుల లోను, హంస రకం 120 నుండి 125 రోజుల లోను కోతకు వస్తాయి

తమిళనాడులో వాడుకలో వున్న తక్కువకాలంలో కోతకు వచ్చే టికెఎమ్-6 రకమును, అధికమైన దిగుబడినిచ్చే పొట్టి తైచుంగ్‌నేటివ్-1 రకమును కలిపి, కావేరి రకమును రూపొందించారు.

ఇది పొట్టిగా, నిటారుగా వుండి ఎక్కువ గడ్డినిచ్చే వరిరకము ఈ రకపు వరిమొక్కలు 70 నుండి 90 సెం॥ మీ ఎత్తు వరకు పెరుగుతాయి. గింజలు పొట్టిగాను, గట్టిగాను వుంటాయి. ఐ ఆర్-8 జయ రకములకంటె దీని గింజలు నాణ్యంగా వుంటాయి వీటిని మరపట్టినప్పుడు 72 శాతం బియ్యము లభిస్తుంది. ఈ రకముతో వండిన అన్నము తెల్లగావుండి బాగా పుడికే స్వభావము కలిగి వుంటుంది దీనిలో 8.9 శాతం ప్రొటీనులు లభించునాయి

తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే స్వభావము కలిగివుండుటచే నూతుల, చెరువులద్వారాలభించే నీటితో 'ఖరీఫ్', మరియు రబీ పంటకాలములలో పండించుటకు ఇది ఎంతో అనువైనది. మన రాష్ట్రంలో ఈ పంటకు అనుకూల వాతావరణ పరిస్థితులు కలిగివుండుటచే, కావేరి పంటను లాభదాయకంగా పండించ వచ్చును.

(బి.సి.ఎ.ఆర్.)

రేడియో

మంగళవారం ఆగస్టు 8

శక 1894 ∴ శ్రావణ 17

విజయవాడ

357.1 మీ. (840 కిలో సై.)

ఉదయం: 5.55 వందేమాతరం, ఉషోదయం; 6.02 ఆం. వా: 6.04 భక్తిరంజని: 6.40 సూక్తిముక్తావళి: 6.45 పొలంపనులు: 6.55 ప్రబోధ గేయాలు: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ విశేషాలు: 7.05 తె. వా: 7.15 లయవిన్యాసం: 7.30 వాద్యబృందం: 7.45 సంగీత శిక్షణ జూనియర్లకు: 8.00 హిం.వా: 8.10 ఆం. వా: 8.20 వయొలిన్: 9.00 హిం. వా: 9.02 ఆం. వా: 9.04 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11.45 ఉన్నత పాఠశాలలకు; 12.05 వయొలిన్: 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.10 పసిడి పంటలు: 1.20 చిత్ర తరంగిణి: 1.30 వనితావాణి: 1.59 వాతావరణ సూచన: 2.00 ఆం. వా: 2.10 కళాశాలలకు: 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 హైద్రాబాద్ వలె: 5.55 స్థానిక ప్రకటనలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 పురాణ కాలక్షేపం: 6.25 వ్యవసాయదారులకు: 6.30 కల్పలత: 6.55 కబుర్లు: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ విశేషాలు: 7.05 తె. వా: 7.15 పంట సీమలు: 7.45 ధరలు, వాతావరణం: 8.35 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం వా: 9.00 ఆం. వా: 9.15 క్లారినెట్: 10.30 ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (ఎ)

217.4 మీ. (1380 కిలో సై.)

ఉదయం: 6.00 వందేమాతరం: 6.02 ఆం. వా: 6.04 మంగళధ్వని, కార్యక్రమ వివరణ: 6.10 భక్తిరంజని: 6.40 సూక్తిముక్తావళి: 6.45 వాద్యగోష్ఠి: 6.55 పాడిపంట: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె. వా: 7.15 క్లారినెట్: 7.45 ఈపాట నేర్చుకుందాం: 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 వి. వలె: 9.00 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

మధ్యాహ్నం: 11.45 ఉన్నత పాఠశాలలకు: 12 05 గానసుధ: 12.20 హిం. వా. 12.30 తె. వా: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.10 చిత్రసీమ: 1.30 వనితావాణి: 1.59 వాతావరణ సూచన: 2.00 ఆం. వా: 2.10 కళాశాలలకు: 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 క్లారినెట్: 5.55 ప్రసార విశేషాలు: 6.00 ఆం. వా: 6.05 ప్రాం. వా: 6.15 ఉ. వా: 6.25 వ్యవసాయదారులకు: 6.30 గ్రామ సీమలు: 7.00 అనగ.అనగ. కథానిక: 7.05 తె. వా: 7.15 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7.45 లలిత సంగీతం: 8.00 చిత్రగించవలెను: 8.15 చిత్రసీమ: 8.30 క్లారినెట్: 8.45 నాటిక: 8.45 హిం. వా: (కడప మాత్రమే): 9.00 ఆం. వా: 9.15 వి. వలె: 10.30 ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - (బి)

217.4 మీ. (1380 కిలో సై.)

ఉదయం: 6.30 వందేమాతరం: 6.40 ఈశ్వర అల్లా తేరేనాం: 7.00 హిం. వా: 7.02 కార్యక్రమావళి: 7.05 లలిత సంగీతం: 7.20 ముఖాముఖీ: 7.30 ఫిల్మిగానే: 7.05 విద్యార్థి లోకం: 8.10 హిందూస్థానీ సంగీతం: 8.25 చిత్రసీమ: 8.50 ఉ. వా: 9.00 భీమసేన జోషి: 9.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 2.00 ఫిల్మిగానే: 2.10 హిం. వా: 2.20 ఫిల్మిగానే: 2.30 స్త్రీలకు: (హిందీ) 3.00 హిం. వా: 3.02 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 హిందూస్థానీ సంగీతం;5.45 చిత్రసీమ: 6.05 హిం.వా: 6.10 రంగుల రేడియో: 6.40 ఫిల్మిగానే: 7.00 హిం. వా: 7.02 కార్యక్రమావళి: 7.05 కర్నాటక సంగీతం: 7.20 మగ్గాల ప్రోగ్రాం: 7.50 త్రిలోకం: 8.00 హిం. వా: 8.02 కార్యక్రమ విశేషాలు: 8.05 ప్రవరాలు: 8.15 రేడియో న్యూస్‌రీల్: 8.25 రాష్ట్రీయ సంగీత్: 8.35 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 వైరంగ్: 9.15 ఉ. వా: 9.30 వార్తావళి: 9.45 వైరంగ్ (ఉర్దూలో కార్యక్రమం): 10.30 ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6.55 వందేమాతరం, మంగళ ధ్వని: 7.02 ఆం. వా: 7.04 విరామ సంగీతం: 7.05 తె. వా: 7.15 కర్నాటక వార్తలు: 7.45 భక్తిరంజని: 8.00 హిం. వా: 8.10 ఆం. వా: 8.20 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 తె. వా: 12.40 వాద్యసంగీతం: 12.50 మెల్లిసై: 1.00 కార్యక్రమ వివరణ: 1.02 ఆం. వా: 1.04 పాశ్చాత్య సంగీతం: 1.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 పాశ్చాత్యసంగీతం: 6.00 ఆం. వా: 6.05 కార్యక్రమ వివరణ: 6.30 ప్రవరాలు: 7.02 ఆం. వా: 7.04 కార్యక్రమ వివరణ: 7.05 తె. వా: 7.15 ఇలయ [illegible]: 8.15 రేడియో న్యూస్‌రీల్: 8.25 ఇతర ప్రాంత సంగీతం: 8.35 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం వా: 9.00 ఆం. వా: 9.15 స్పాట్‌లైట్: 9.30 పాశ్చాత్య సంగీతం - యువవాణి: 10.00 పాశ్చాత్య సంగీతం: 11.00 సమాప్తి.

చౌకడిపోలకై తహసిల్‌దారుకు మెమొరాండం

తిరువూరులో

తిరువూరు, అగస్టు 6

తిరువూరు తాలూకాలోని 29 గ్రామాల నుండి 4200 సంతకాలు చేయించిన మెమొరాండాన్ని తహసిల్‌దారుకు అందజేస్తూ తాలూకాలో చౌకడిపోలు నెలకొల్పాలని కోరడం జరిగింది.

తిరువూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ సుంకర వీరభద్రరావు, సహాయ కార్యదర్శి శ్రీ ఎ. జగన్నాధాచార్యులు, తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ వేమిశెట్టి కోటయ్య, తాలూకా మహిళా సమాఖ్య కన్వీనర్ శ్రీమతి ఎ రామకోటమ్మ యీ మెమొరాండాన్ని ఈనెల 1వ తేదీన తహసిల్‌దారుకు అందచేశారు.

ఆ మెమొరాండంలో యిలా వుంది:

ఆహారధాన్యాల ధరలు పెరిగిపోయాయి. కిలో బియ్యం రు. 1.15 నుండి రు. 1.50 వరకు అమ్ముతున్నారు. పేద ప్రజలు కొనలేకపోతున్నారు. కనుక ప్రతి పంచాయితీ గ్రామానికి ఒక చౌకడిపో పెట్టాలి. కిలో బియ్యం 75 పైసలకు అమ్మాలి.

[illegible] వసూళ్ళు వాయిదా వేయాలి.

తాలూకాలో [illegible] వర్షాలు [illegible] పైర్లు ఎండిపోతున్నాయి. [illegible]

వెంటనే [illegible] మెమొరాండంలోని [illegible] ప్రభుత్వానికి తెలియజేస్తానని తహసిల్‌దారు చెప్పారు.

చెరుకుపల్లిలో వర్ణాంతర వివాహం

చెరుకుపల్లి, అగస్టు 6

కృష్ణాజిల్లా చెరుకుపల్లిలో శ్రీ గోనాని [illegible] అంబేద్కర్ [illegible] సాంఘిక సేవా [illegible] సభ జరిగింది.

ఈ సభలో [illegible] ఎలిజబెత్ [illegible] వివాహం జరిగింది.

శ్రీ [illegible], శ్రీ [illegible], శ్రీ [illegible] ప్రసంగించారు.

శ్రీ [illegible] మాంసపు [illegible] భోజనం [illegible].

యాదవోలు మంచినీటి పథకానికి ప్రారంభోత్సవం

చిన్నమాయాపెం, అగస్టు 6

పశ్చిమ గోదావరిజిల్లా యాదవోలులో మంచినీటి పథకానికి [illegible] సమితి అధ్యక్షులు శ్రీ [illegible] జూలై 30 వ తేదీ ప్రారంభించారు.

ఈ [illegible] శ్రీ [illegible] సుమారు రు. 2000 [illegible] నిర్మించారు.

సినిమా ప్రకటనలు
తప్పక చూడండి!

కృష్ణ పిక్చర్స్ వారి
పండంటి కాపురం
కృష్ణ, రంగారావు, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, జమున, దేవిక, విజయనిర్మల, బి. సరోజాదేవి.

రవిశంకర్ పిక్చర్స్‌వారి
మేనకోడలు

ఉప:శ్రీవారి
మానవుడు-దానవుడు
99 వ రోజు

జెమినీవారి
మంచిరోజులు వచ్చాయి

విశాలాంధ్ర
1972 ఆగస్టు 7 సోమవారం

కదలండి

ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల బిల్లును జాయింట్ సెలక్టు కమిటీకి నివేదించారు.

శాసనసభ, శాసనమండలిలో జరిగిన చర్చల సరళిని పరిశీలిస్తే, స్వతంత్రపార్టీ, జనసంఘం, కాంగ్రెసులోని భూస్వామ్య అనుకూల శక్తులు బిల్లును మరింత నీరు కార్చాలని వాదించారు. ఆ విధంగా బిల్లును తూట్లుపొడవటానికి ఉభయ శాసనసభల్లోని అభివృద్ధి నిరోధకశక్తులు ఒకవైపు ప్రయత్నిస్తూంటే మరోవైపు శాసనసభల వెలుపలనుండి భూస్వామ్య శక్తులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తున్నారు. రాష్ట్ర కిసాన్ సమ్మేళన్, గ్రామీణ ప్రజల సమాఖ్య లాంటి భూస్వామ్య సంస్థలు ముఖ్యమంత్రికి సమర్పించిన మెమోరాండమే దీనికి నిదర్శనం. అన్యాక్రాంతాలను నిషేధిస్తూ ఆర్డినెన్సు జారీచేసిన తేదీనుండి మాత్రమే శాసనాన్ని అమలుపరచాలని, రివెన్యూ రికార్డులలో నమోదయిన తరగతులను పరిగణనలోకి తీసుకోవాలనే తదితర అంశాలతో వారి విజ్ఞాపన పత్రం ఉంది.

బిల్లులోవున్న ప్రగతిశీల అంశాలపై భూస్వాములు దాడిని కేంద్రీకరించుతున్నారు.

బిల్లులో ఉన్న లొసుగులను తొలగించటానికి, సాధ్యమైనంత మేరకు పేద, సాదా జనానికి సెంటో, కుంటో భూమి పంచేలా బిల్లును సవరించేందుకై కమ్యూనిస్టు తదితర ప్రజాస్వామిక శక్తులు ఉభయ శాసనసభలలో శక్తికొలదీ కృషి చేశారు. బిల్లులోవున్న ప్రగతిశీల అంశాలను వమ్ముచేసే ప్రమాదకర లొసుగులు ఉన్నాయని కూడ హెచ్చరించారు. పండ్ల తోటలను, ప్రయివేటు నీటివనరుల క్రింద మాగాణి భూములను, మెట్ట భూములుగా పరిగణించటం, కృష్ణా డెల్టా లాంటి భూములలో ఒక కారు వరిపంట, రెండవకారు మినుము పెసర, ప్రత్తి, వేరుశెనగ మొదలైన పంటలుపండే భూములను బిల్లులో ఒక కారు పంటభూములుగా చూపడం, 1971 జనవరి నుండి చట్టం అమలులోకి రావటం వగైరా లొసుగులను తొలగించకపోతే బిల్లు ప్రధాన లక్ష్యమే దెబ్బతింటుందని స్పష్టీకరించారు.

సమగ్ర భూ సంస్కరణలకై పీడిత ప్రజానీకం అనేక పోరాటాలను జరిపింది. త్యాగాలు చేసింది. పాక్షిక విజయాలను సాధించింది.

ప్రభుత్వం భూ సంస్కరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టక తప్పలేదు. కాని బిల్లు కష్టజీవులు ఆశించినంత సమగ్రంగా లేదనేది స్పష్టం.

అందుచేత బిల్లులోని లొసుగులను తొలగించేందుకై పేద రైతాంగం, వ్యవసాయ కూలీలు ఈ తరుణంలో పెద్ద ఎత్తున కార్యరంగంలోకి దుమకాలి.

ప్రజల నిరంతర ఆందోళన, పోరాటాలు మాత్రమే ప్రగతిశీల సంస్కరణలను సాధించగలవు.

10 వ తేదీ నుండి జరిగే సత్యాగ్రహ పోరాటానికి సమాయత్తంకావాలి. 15 వ తేదీన జరిగే ప్రజా ప్రదర్శనలలో యావన్మంది పాల్గొనాలి.

వడ్డీ వ్యాపారం చేస్తున్న ఐఎన్‌టియుసి వారిఆగడం

—నిడదవోలు ఆర్.టి.సి. డిపోలో

(విశాలాంధ్ర విలేకరి)

నిడదవోలు, ఆగస్టు 6

పశ్చిమ గోదావరిజిల్లా నిడదవోలు ఆర్. టి. సి. డిపోలో ఐ ఎన్. టి యు. సి. యూనియన్ కార్యకర్తలు తమ యూనియన్ చందాలకోసం తాము నడిపే వడ్డీ వ్యాపారానికి సంబంధించిన డబ్బు దౌర్జన్యంగా వసూలు చేయటానికి వచ్చి ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలపై దాడికితలపడుతున్నారు. వీరికి డిపో సూపర్‌వైజరు మద్దతున్నట్లు తెలుస్తున్నది.

ఈ నెల 2 వ తేదీన ఐ. ఎన్. టి యు. సి. యూనియన్‌కుచెందిన శ్రీ జి. రామచంద్రరావు, శ్రీ కె హనుమంతరావు, అబుల్ సుబాన్. శ్రీ కాంతారావు అనేవారు డిపోలో వచ్చి దౌర్జన్యంగా వసూళ్ళు చేస్తుండగా ఆర్. టి. సి ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తలు శ్రీ వి. శ్రీరాములు, శ్రీ వి. రాజారావు ఆ విషయం మెకానికల్ ఛార్జిమన్‌కు వివరించుతున్న సమయంలో ఆయన ఎదురుగానే శ్రీ వి. రాజారావును జి. రామచంద్రరావు కొట్టనంటూ దౌర్జన్యం చేయబూనాడు.

ఈవిషయం డిపోమేనేజరుకు, డివిజనల్ కంట్రోలరుకు, జిల్లా యూనియన్‌కు ఫోను ద్వారా తెలియజేయబడింది.

గతంలో డివిజనల్ కంట్రోలరు వ్రాతపూర్వకంగానూ, స్వయంగానూ ఐ.ఎన్.టి.యు సి.వారు డిపోలోకివచ్చి ఇలా వసూలు చేయరాదని హెచ్చరించారు. కానీ వారు దానిని ఖాతరు చేయటంలేదు.

ఐ ఎన్. టి. యు. సి యూనియన్ వారి దౌర్జన్య చర్యలవల్ల డిపోలో శాంతియుత వాతావరణం దెబ్బతినే స్థితి ఏర్పడింది.

ఈ విషయమై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆర్. టి. సి. అధికారులను కార్మికులు కోరుతున్నారు.

ఈ వివరాలన్నీ శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణకు, ఉపనాయకులు శ్రీ రజబ్‌అలీ, శాసనసభ్యులు శ్రీ వంకా సత్యనారాయణ, శ్రీ అళ్ళ హనుమంతరావులకు తెలియజేశారు.

మొదటి ఇంటర్‌కు మరో రెండు సెక్షన్లు

నిడదవోలు జూనియర్ కళాశాలలో

నిడదవోలు, ఆగస్టు 6

నిడదవోలు జూనియర్ కళాశాలలో మొదటి ఇంటర్మీడియట్‌కు మరో రెండు సెక్షన్లు పెట్టేందుకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులొచ్చాయి.

ఫలితంగా విద్యార్థులందరికీ సీట్లు లభించే అవకాశం ఏర్పడింది.

స్థానిక శాసన సభ్యులు శ్రీ అళ్ళ హనుమంతరావు, కాలేజి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డా॥ బి. వి. ఎల్. ఎస్. రాజా, శ్రీ ఆర్. అమ్మిరాజు హైదరాబాద్‌వెళ్ళి కృషి చేసిన ఫలితంగా ఈ మంజూరు జరిగింది.

గత సంవత్సరం నుండి కొరతగావున్న టీచింగ్ స్టాఫ్‌ను వెంటనే ఏర్పాటు చేసి, విద్యార్థులకు న్యాయం కలుగజేయాలని పురజనులు కోరుతున్నారు. (వి.వి.)

తుంగభద్ర రిజర్వాయరునుండి కె. సి. కెనాల్‌కు నీరు తెప్పించాలి

నారుమళ్లు రక్షించాలని కడపజిల్లా కలెక్టరుకు కమ్యూనిస్టు, ప్రజాసంఘాల నాయకుల మెమొరాండం

(విశాలాంధ్ర విలేకరి)

కడప, ఆగస్టు 5

తుంగభద్ర రిజర్వాయరు నుండి తగినంత నీరు అందజేయుటకు ప్రభుత్వం వెంటనే తగుచర్యలు తీసుకోవాలని, యీ నీటిని కె. సి. కెనాల్ క్రింద నారుమళ్లు కాపాడుకొనుటకు యివ్వాలని కోరుతూ కమ్యూనిస్టుపార్టీ తదితర ప్రజాసంఘాల నాయకులు కడపజిల్లా కలెక్టరుకు మెమొరాండం యిచ్చారు.

జిల్లా కలెక్టరుకు మెమొరాండం యిచ్చిన వారిలో జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె. వెంకట్రామరెడ్డి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. సుబ్బన్న, కడప తాలూకా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ యన్. నాగిరెడ్డి, శ్రీ ఎన్. ఈశ్వరరెడ్డి వున్నారు. ఈ మెమొరాండాన్ని ఈ నెల 2 వ తేదీన సమర్పించబడింది.

పది దినాల క్రిందటనే కాల్వలో గేజీ తగ్గటం ప్రారంభించి నేడు పూర్తిగా తగ్గిపోయి తుదకు క్రింది తూముల క్రింది నారుమళ్ళకు కూడా నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రాయబార వర్గం వారు తెలియజేసినారు. క్రిందితూముల క్రిందకూడా మొదటి మడవ వున్నవారికి తప్ప మిగతా వారికి నీరందడం లేదు. కొంతమంది రైతులూ, వ్యవసాయకార్మికులుబావుల్లో, గుంటల్లోవిలువ వున్న నీటిని కడవలతో మోసి నారుమళ్ళను తడుపు కొంటున్నారనీ, వర్షం వచ్చేవరకు కనీసం నారుమళ్ళను తడుపుకొనేందుకు అవసరమైన నీరు పైనుండి అందించబడేటట్లు చూడాలనీ, యిప్పటికే ఆది నిమ్మాయపల్లి సెక్షన్ క్రింద ఖాజీపేట ఫిర్కాలోని కొండపేట, ఏలూరు కాలవల క్రింద ఎన్నో నారుమళ్ళు ఎండిపోయినవని తెలియజేసినారు.

కలెక్టరు సావధానంగా విని తానింతకు మునుపే కె. సి. కెనాలు క్రింది రైతాంగం నీటికొరతతో పడుతున్న అవస్థలనుగూర్చి ప్రభుత్వానికి తెలియజేసినాననీ, పది దినాలలో వర్షం రాకపోతే పరిస్థితులు తారుమారు అవుతుందని వచ్చిన నీరు సర్దుటకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేసినారు.

ప్రతినిధివర్గం కలెక్టరుకు సమర్పించిన మెమొరాండంలో యింకా యిలా వుంది.

ఈ ఏడు కె. సి. కెనాలుకు ఈ నెల మొదటి వారంలో పుష్కలంగా నీరు వచ్చినది కాలువక్రింద ఆయకట్టుదార్లందరూ సంతోషంతో అదను దాటిపోతుందని నారుమళ్ళు తయారుచేసి చల్లకం చేసినారు. నారుబాగా పెరుగుతున్న సమయంలో కాలువలో నీరు తగ్గిపోయినది. కెనాలు అధికార్లు తగ్గు తూములకు ఒక దినం, మెట్టు తూములకు ఒక దినమని షిఫ్టు పద్ధతిని ప్రవేశపెట్టినారు.

కాని తగ్గుతూములక్రింది నారుమళ్ళకు కూడ నీరందడంలేదు. మెట్టు తూముక్రింద నారుమళ్ళు బీటలువారి ఎండిపోతున్నవి. కొంతమంది గుంటల్లో, బావుల్లో వున్న నీటిని కూలీలతో కడవలతో మోయించి నారుమళ్ళను తడుపుకొంటున్నారు. యిక నాలుగు దినాలలో ఆది నిమ్మాయపల్లె సెక్షన్‌కు తగినంత నీరు అందించబడకపోతే అన్ని తూముల క్రింద నారుమళ్ళన్ని విలువునా ఎండిపొయ్యే పరిస్థితి వున్నది.

ఇదే పరిస్థితి ఖాజీపేట ఫిర్కాలోని కొండపేట, ఏలూరు, కాలువ క్రింద కూడా ఏర్పడినది. అక్కడ వంతులు పద్ధతిని ప్రవేశపెట్టినారు. అయినా ప్రయోజనం కనబడలేదు.

స్వల్పకాలంలో పండే ఐ.ఆర్. 8 వంటి వరివంగడాలు నాటుకు సిద్ధంగా వున్నవి.కాని బీటుదుక్కి దున్నుకొనుటకు కూడ అవకాశంలేదు. వెంటనే నాట్లు పడకపోతే అవన్నీ పనికి రాకుండాపొయ్యే ప్రమాదమున్నది.

దుక్కులు బొత్తిగా జరగనందున పేద రైతులు, వ్యవసాయ కార్మికులు పనులులేక దినగండం నూరేళ్ళాయుష్షుగా గడుపుతున్నారు.

ఇంతటి భయంకర పరిస్థితి కె సి. కెనాలు క్రింద ఎప్పుడూ ఏర్పడలేదని అనుభవజ్ఞులైన రైతులందరూ అంటున్నారు.

ఈ అత్యవసర పరిస్థితిలో తుంగభద్ర రిజర్వాయరునుండి తగినంతనీరు అందచేయుటకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొనవలెనని కోరుతున్నాము

వచ్చేనీటిని కర్నూలు, కడపజిల్లాలకు సక్రమంగా పంపకం చేయాలి.

తగినంత పోలీసు బందోబస్తును ఏర్పరచి వంతుల పద్ధతి సక్రమంగా అమలుజరిగేటట్లు చూడాలి.

విజయవాడలో కళోత్సవాలు

డా॥ రాజారావు వర్థంతి సందర్భంగా సెప్టెంబరులో

విజయవాడ, ఆగస్టు 6

డాక్టర్ గరికిపాటి రాజారావు వర్థంతి సందర్భంగా విజయవాడ నాటక సంఘాల కేంద్ర సమాఖ్య ఆధ్వర్యాన సెప్టెంబరు 8, 9 తారీఖులలో కళోత్సవాలు, రాష్ట్ర కళాకారుల సదస్సు నిర్వహించబడనున్నాయి.

కేంద్ర సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ కొరెపు అప్పలస్వామి ఒక ప్రకటనలో ఒక విషయాన్ని తెలియజేశారు.

రాష్ట్రంలోని నాటక రచయితలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, ప్రతినిధులు సదస్సులో పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతినిధుల రుసుం 5 రూపాయలు. ప్రతినిధులకు ఉచిత భోజనం వసతి ఏర్పాటు చేయబడుతుందని తెలియజేశారు. (వి.వి.)

కె. జాషువాకు సన్మానం

విజయవాడ, ఆగస్టు 6

శ్రీ కె. జాషువా అమెరికా వెళుతున్న సందర్భంగా "సామాజిక సమస్యల పరిశోధన సంస్థ" ఆయనకు ఇటీవల ఇక్కడ సన్మానం చేసింది.

సన్మాన సందర్భంగా శ్రీయుతులు ఎ. వెంకటేశ్వరరావు, శిఖామణి, యన్. ఆర్. రాయలు, సర్వసుదేవ్, జాన్ పీటర్‌లు ప్రసంగించారు.

(వి.వి.)

అరవింద విశ్వవిద్యాలయం

కేంద్రానికి విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 6

ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించదలచిన అరవింద విశ్వవిద్యాలయంపై కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15లోగా ఒక నిర్ణయాన్ని ప్రకటించాలని అరవింద విశ్వవిద్యాలయ అడహాక్ కమిటి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

అడహాక్ కమిటీ విజయవాడలో ఇటీవల సమావేశమయింది.

విశ్వవిద్యాలయ స్థాపనకు స్థలాన్ని ఇచ్చేందుకు డాక్టర్ సి. యల్. రాయుడు సిద్ధపడ్డారని, అస్థలంలో విశ్వవిద్యాలయాన్ని స్థాపించేందుకు అనుమతించాలని అడహాక్ కమిటి కోరింది. (వి. వి.)

వడ్డెర సంఘంవారి ప్రదర్శన

— మాచర్లలో

మాచర్ల, ఆగస్టు 6

పల్నాడుతాలూకా మాచర్ల వడ్డెరసంఘం వారు తమ కులాన్ని షెడ్యూల్ తెగలలో చేర్చాలని, తమ బిడ్డలకు ఉచిత విద్య హాస్టలు సౌకర్యం, స్కాలర్‌షిప్పులు, ఉద్యోగగ్యారంటీ కల్పించాలని కోరుతూ ప్రదర్శన చేశారు.

400 మంది ఆర్. కె. సి. వర్కర్సు యూనియన్ కార్యాలయంనుండి తహశీల్ ఆఫీసుకు ఊరేగింపుగా వెళ్ళి డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం యిచ్చారు.

ప్రదర్శనకు శ్రీయుతులు చల్లా గురవయ్యా, చల్లా శ్రీరాములు, చల్లా వెంకటేశ్వర్లు, బత్తుల కోటయ్యా, వి. రాంకోటి, కొమెర వీరాస్వామి, వి. గోపాళ్ళు, తమ్మిశెట్టి సుబ్బారావు నాయకత్వం వహించారు.

పట్టణ సంఘ కార్యదర్శి శ్రీ బత్తుల కోటయ్యా వినతిపత్రం సమర్పించగా, పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ టి. రామాంజనేయులు దానిలోని ముఖ్యాంశాలను వివరించారు.

వినతిపత్రంలోని డిమాండ్లను ప్రభుత్వానికి తెల్పుతామని డిప్యూటీ తహశీల్దారు అన్నారు.

నిడదవోలు విద్యుత్ పరిస్థితిపై సమావేశం

నిడదవోలు, ఆగస్టు 6

నిడదవోలు మున్సిపల్ చైర్మన్,సభ్యులు కమిషనర్, విద్యుత్ డివిజనల్ ఇంజనీరు తదితరులు మున్సిపల్ కౌన్సిలు హాలులో యీనెల2న సమావేశమై పట్టణంలో విద్యుత్ పరిస్థితిపై చర్చించారు.

ముఖ్యంగా వీధి దీపాల మరమ్మతుకు యిద్దరు పనివారు ఎప్పుడూ ఆ పనిలో వుండాలని నిర్ణయించారు.

చైర్మన్ శ్రీ కొత్తపల్లి శ్రీరాములు, కమిషనర్ శ్రీ వీరభద్రరావు, విద్యుత్ డివిజనల్‌ఇంజనీరు శ్రీ బి బసవరాజు, జూనియర్ ఇంజనీరు శ్రీ జి. రామమోహనరావు హాజరయ్యారు.

చర్చలలో కౌన్సిలర్లు శ్రీయుతులు టి. వి. రత్నం, వుద్దగిరి సత్యనారాయణ, ఇర్లపాటి వెంకన్న, రాజయోగి మరికొందరు అవసరమైన సూచనలిచ్చారు. (వి. వి.)

విశాఖ పోర్టుట్రస్టు నాటిక పోటీల ఫలితాలు

విశాఖపట్నం, ఆగస్టు 6

విశాఖపట్నం పోర్టు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జులై 27 నుండి 31 వ తేదీ వరకు నాటిక పోటీలు నిర్వహించబడ్డాయి.

ఉత్తమ ప్రదర్శనగా నాట్యభారతి, విశాఖపట్నం వారి "సారాంశం", ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా స్టోర్స్ కల్చరల్ అసోసియేషన్, విశాఖ పోర్టుట్రస్టు వారి "తెరచిరాజు", ఉత్తమ రచనగా ట్రాఫిక్ కల్చరల్ అండ్ స్టోర్సు అసోసియేషన్, విశాఖ పోర్టుట్రస్టు వారి "మృత్యుంజయుడు" ఎన్నికయ్యాయి.

ఉత్తమ నటుడుగా కె. మందోలు (మృత్యుంజయుడులో) ద్వితీయ ఉత్తమ నటుడుగా పి. జగన్నాధరావు (మృత్యుంజయుడులో) ఉత్తమ నటిగా కుమారి విజయలక్ష్మి (తెరచిరాజులో) ఉత్తమ హాస్యనటుడుగా శ్రీ కె. సీతారాములు (అంతా ఇంతేలో), ఉత్తమ దర్శకునిగా శ్రీ ఎ. కృష్ణారావు (సారాంశం) ఎన్నికయ్యారు. మరికొందరికి ప్రత్యేక బహుమతులుకూడా యివ్వబడ్డాయి.

బహుమతీ ప్రదానోత్సవ సభకు అధ్యక్షత వహించిన శ్రీ హెచ్. సాంబమూర్తి క్లబ్-కం- థియేటర్‌ను అక్టోబరు మాసంలో ప్రారంభించ మన్నట్లు ప్రకటించారు.

శ్రీ డి. శేషాద్రి ఈ పోటీలలో పాల్గొన్న సమాజాల వారిని అభినందించి న్యాయనిర్ణేతలను పరిచయం చేశారు.

శ్రీమతి లీలావతీదేవి సాంబమూర్తి విజేతలకు బహుమతులు యిచ్చారు.

శ్రీయుతులు వెంకటకృష్ణారావు, ఎం. రామకోటి, డా॥ పి. పి. శివరామన్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

నవ భారత్ పొగాకు కంపెనీ

మేదరమెట్ల బ్రాంచి కార్మిక సమావేశం

అద్దంకి, ఆగస్టు 6

ప్రకాశంజిల్లా అద్దంకి తాలూకా మేదరమెట్లలోని నవ భారత్ పొగాకు కంపెనీ బ్రాంచి మురా గ్రేడింగు కార్మికుల సమావేశం ఇటీవల జరిగింది. ఈ సమావేశానికి సుమారు 400 మంది కార్మికులు హాజరైనారు. శ్రీ మంగయ్యా సమావేశానికి అధ్యక్షత వహించారు.

అద్దంకి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పి. ఎల్లయ్యా సమావేశంలో ప్రసంగిస్తూ సంఘ ఆవశ్యకతను గురించి వివరించారు.

కార్మికులు తమ హక్కుల కొరకై పోరాటాలు చేయాలని, బలమైన వుద్యమం ద్వారానే అది సాధ్యమౌతుందని ఆయన కోరారు.

సమావేశంలో పాల్గొన్న కార్మికులందరూ సంఘంలో సభ్యత్వం పుచ్చుకొనుటకు అంగీకరించారు.

పెద్దాపురంమున్సిపల్ ఉపాధ్యాయ నాయకుని ఆకస్మిక మృతి

పెద్దాపురం, ఆగస్టు 6

పెద్దాపురం మున్సిపల్ ఉపాధ్యాయ సంఘాధ్యక్షులు శ్రీ ఎ. వి. శీతారామారావు జులై నెల 29 వ తేదీ ఆకస్మికంగా మృతి చెందారు.

వీరి మృతదేహాన్ని పట్టణ వీధులలో వూరేగింపు జరిపి అంత్యక్రియలు జరిపారు. వీరి మృతికి సంతాప సూచకంగా జులై 31 వ తేదీ మున్సిపల్ పాఠశాలలకు శెలవు యివ్వబడింది.

సాయంకాలం సంతాపసభ జరిగింది.

అత్తిలిలో నాటిక పోటీలు

అక్టోబరు 2 నుండి

అత్తిలి, ఆగస్టు 6

పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో అక్టోబరు 2 నుండి 6 వ తేదీవరకు నాటిక పోటీలు నిర్వహించాలని స్థానిక యువజన కళాసమితి నిర్ణయించింది.

ఉత్తమ ప్రదర్శనకు రజితషీల్డు, రు 150 నగదు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రజితషీల్డు, రు. 100 నగదు, ఇతర బహుమతులు యివ్వబడతాయి.

ఈ పోటీలలో రాష్ట్రంలోని అన్ని నాటక సమాజాలవారు పాల్గొనవచ్చును, దరఖాస్తులు ఆగస్టు 25 వ తేదీలోగా పంపవలెను. వివరాలకు కార్యదర్శికి వ్రాయవలెను.

ఈ కార్యక్రమ నిర్వహణకు శ్రీ పురెళ్ళ సూర్యారావు అధ్యక్షులుగా, శ్రీ గాది వెంకటరావు ఉపాధ్యక్షులుగా, శ్రీ పోతురాజు సూర్యనారాయణ కార్యదర్శిగా, శ్రీ యన్లపల్లి కోటేశ్వరరావు సహాయ కార్యదర్శిగా మరో 7 గురు కార్యవర్గ సభ్యులుగా కమిటీ ఎన్నికైంది.

మాచర్లలో విద్యార్థి ఫెడరేషన్ నిర్మాణం

మాచర్ల, ఆగస్టు 6

పల్నాడు తాలూకా మాచర్లలోని గవర్నమెంటు కాలేజి విద్యార్థులు గత నెల 31 వ తేదీ సమావేశమైనారు. శ్రీ టి. కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ కె. నారాయణ ప్రసంగిస్తూ విద్యార్థి ఫెడరేషన్ నిర్మాణం నేటి విద్యావిధానంపై వివరించారు.

శ్రీ డి. పి. యస్. ఆర్. అంజనేయులు, శ్రీ కె. పరమేశ్వరరావు, శ్రీ కె. కోటేశ్వరరావు, కె. వి. శర్మ, ప్రసంగిస్తూ కాలేజీలోని అనేక సమస్యల్ని వివరించారు.

శ్రీ యన్. రామిరెడ్డి కన్వీనర్‌గా తొమ్మిది మందితో తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు.

కాలేజీలో ఆగస్టు 20 వ తారీఖులోపు ఫెడరేషన్ సభ్యత్వం పూర్తిచేసి పట్టణ మహాసభ జరపాలనీ, కాలేజిలో విద్యార్థి యూనియన్‌కు చట్టబద్ధంగా ఎన్నికలు జరపాలని ప్రిన్సిపాలును కోరుతూ తీర్మానించారు.

విజయనగరంలో కలరా నిరోధకచర్యలు

విజయనగరం, ఆగస్టు 6

విజయనగరంలో కలరా నిరోధకచర్యలు తీసుకొంటున్నట్లు జిల్లా ఆరోగ్య వైద్య శాఖాధికారి డాక్టర్ సూర్యనారాయణ విశాలాంధ్ర విలేకరికి యిచ్చట తెలియజేశారు.

జులై నెలలోనే ఆరువేల మందికి కలరా నిరోధక ఇంజక్షన్లు యివ్వబడ్డాయని, ఇంకా 15 వందల మందికి సరిపోయే వాక్సిన్ వుందని ఆయన తెలియజేశారు.

ఇప్పటికి కలరా కేసులు 7 వచ్చాయని వాటిని తనిఖీ చేయగా ఒక్క కేసు కూడా నిర్ధారణ కాలేదని మున్సిపల్ హెల్త్ ఆఫీసరు శ్రీ పార్వతీశం అన్నారు.

విశాఖ జిల్లాలో నర్సీపట్నం, కె డి. పేట. పాయకరావుపేట, ఎలమంచిలిలో కలరా వున్నదని అక్కడకూడా చాలా చురుకుగా వ్యాధి నిరోధక చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ సూర్యనారాయణ తెలియజేశారు.

మరో ప్రశ్నకు జవాబు చెబుతూ జిల్లాలో కావలసినంత కలరా నిరోధకమందుసిద్ధంగా వున్నదని తెలియజేశారు.

ఎక్కువ కూలి కొరకు వ్యవసాయ కార్మికుల ఆందోళన

పెదశంకర్లపూడి గ్రామంలో

పెద్దాపురం, ఆగస్టు 6

తూర్పు గోదావరిజిల్లా పత్తిపాడు తాలూకా పెదశంకర్లపూడి గ్రామంలో వ్యవసాయ కార్మికులు శ్రీపోతుల సూరయ్యా నాయకత్వాన అదనపు కూలికై ఆందోళన జరిపారు.

అందుపై కాంగ్రెసు శాసన సభ్యుడు శ్రీ వరుపుల జోగిరాజు కలుగజేసుకొని రైతులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు. కాని అదనపు కూలికై సమ్మెచేస్తున్న కార్మికులపై దౌర్జన్యం చేసిన వారి తరపున యీ శాసనసభ్యుడు పని చేస్తున్నాడు.

నరసన్నపేట తాలూకా

కోమర్తిలో భూస్వాముల కుట్రకు తహసిల్‌దార్ మద్దతు

ఆర్. డి. వో. విచారణలో సాగుదార్లకు న్యాయంకలుగజేస్తానని హామీ

నర్సన్నపేట, ఆగస్టు 6

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా కోమర్తి గ్రామ నిరుపేద బంజరు సాగుదార్లు సర్వే నెంబరు 501 బంజరు భూమిని సాగు చేస్తుండగా, గ్రామ భూస్వాములు వారిని ఆ భూమినుండి తొలగించుటకు కుట్ర పన్నారు. నరసన్నపేట తాలూకా తహశీల్దారును కలుసుకొని ఈ సాగుదార్లు బంజరుభూమిలోనికి వెళ్ళకుండా నిషేధాజ్ఞలు జారీ చేయించారు.

ముందుగానే బంజరు సాగుదార్లు తహశీల్దారును కలుసుకొని. ఆ బంజరును పరిశీలించి పట్టాలివ్వాల్సిందిగా కోరారు. అయినప్పటికీ తహశీల్దారు కనీసం పరిశీలించకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు.

ఆందోళన చెందిన పేదసాగుదార్లు శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ ఆఫీసరుకు దరఖాస్తుపెట్టి పరిస్థితిని వివరంగా తెలియజేశారు.

దానిపై జిల్లాకలెక్టరు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు కోమర్తి గ్రామంవచ్చి ఆ బంజరును పరిశీలించి పేదసాగుదార్లకు పట్టాలు మంజూరు చేస్తామని హామీ యిచ్చారు.

పేదహరిజనులకు అప్పులు మంజూరు చేస్తామని కూడా వాగ్దానం చేశారు.

జిల్లా కలెక్టరు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు యిచ్చిన హామీ ఎప్పుడు అమలు జరుగుతుందా అని పేద సాగుదార్లు ఎదురు చూస్తున్నారు.

తిరువూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం

తిరువూరు, ఆగస్టు 6

తిరువూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈనెల 1 వ తేదీ తిరువూరులో జరిగింది. శ్రీ రామిశెట్టి కృష్ణయ్యా సమావేశానికి అధ్యక్షత వహించారు.

భవానీసేన్, చారుముజుందార్, ఇందూలాల్ యాజ్ఞిక్ మృతికి సమావేశం గాఢ సంతాపాన్ని ప్రకటించింది.

ఆగస్టు 17 వ తేదీ తిరువూరులో భూసంస్కరణల దినం జరుపాలనీ పెంచిన విద్యుత్ రేట్లకు వ్యతిరేకంగా గ్రామాలలో మోటారు సెట్లుగల రైతుల వద్ద సంతకాలు సేకరించాలనీ ఆహార సమస్యపై ఆందోళన చేయాలనీ తీర్మానాలు చేశారు.

ఈ సమావేశానికి జిల్లా సమితి కార్యదర్శి శ్రీ మాలెంపాటి బాలభాస్కరరావు హాజరైనారు.

లేఖలు

స్వాతంత్ర్యయోధులుగా అందర్నీ గుర్తించాలి

మహాశయా !

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేలకొలది భారతీయులు అనేక విధాలుగా చేసిన త్యాగ ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చి 25 సంవత్సరాలు అయినా అధికారంలో వున్నవారికి యింతవరకు వీరి విషయం గుర్తుకు రాలేదు. ఈ నాటికైనా వారి త్యాగాలను గుర్తించి కనీసం ఆరునెలలు జైలు శిక్షను అనుభవించిన వారిని, వారి కుటుంబాలను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం పెన్షన్ స్కీమును పెట్టుట ముదావహం.

కేంద్ర మంత్రి శ్రీ పంత్ యీ మధ్యన చేసిన ప్రకటనలో అజ్ఞాతవాసంలో వున్నవారిని ఐ ఎన్. ఎ. లో పాల్గొనువారిని, సంస్థానాలకు వ్యతిరేకంగా పోరాడినవారిని కూడా స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించడం సముచితమైన నిర్ణయమే. కాని గాంధీజీ పిలుపు ననుసరించి తమ జీవనాధారాలైన ఉద్యోగాలకు రాజీనామా యిచ్చి ఉద్యమంలో పాల్గొన్నవారి త్యాగం తక్కువేమీకాదు.

ఈ రోజున అటువంటి వారి కుటుంబాలు బాధపడుచున్నాయి. అందుచేత వారినికూడా స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకొనవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఇట్లు,
జీడిగుంట్ల బుచ్చేశ్వరరావు-తణుకు.

సభలు-సమావేశాలు

నూజివీడు తాలూకా కమ్యూనిస్టు సమితి సభ్యులు, శాఖా కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశం(ఆగస్టు 15 న ప్రదర్శన ఏర్పాట్లు చర్చించుటకు) నూజివీడులో 8 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది. జిల్లా సమితి కార్యదర్శి శ్రీ మాలెంపాటి బాలభాస్కరరావు హాజరవుతారు.

* * *

గుంటూరు జిల్లా యువజన సమాఖ్య కార్యకర్తల సమావేశం అగస్టు 13 తేదీ మధ్యాహ్నం 12 గంటలకు, గుంటూరు కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

సమావేశంలో రాష్ట్ర యువజన సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు శ్రీ నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ ప్రతాపరెడ్డి పాల్గొంటారు.

* * *

వరంగల్ జిల్లా మానుకోట తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఆగస్టు నెల 10 వ తేదీ ఉదయం 9 గంటలకు మానుకోటలో జరుగుతుంది.

* * *

ఆంధ్రప్రదేశ్ క్షౌరవృత్తిదార్ల సంఘ కార్యవర్గ సమావేశం ఈ నెల 8 వ తేదీ ఉదయం 9 గంటలకు రాజమండ్రి తాలూకా సీతానగరం గ్రామంలో జరుగుతుంది.

సవరణ

జులై 15 వ తేదీ విశాలాంధ్రపత్రిక మూడవ పేజీలో "విజయనగరం వాణిజ్యమండలి ఆఫీసులో చోరీ" అన్న శీర్షిక క్రింద ఆ కార్యాలయంలో జరిగిన దొంగతనంలో "అవర్జాలు. చిరాలు" పోయినట్లు ఆ మండలి పాలకవర్గంలో ముఠా తగాదాలు వున్నట్లు ప్రచురించిన వార్త యధార్థం కాదని పరిశీలన మీదట తేలింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం. (సం॥)

విజయనగరం జూనియర్ కాలేజీ విద్యార్థుల ఇక్కట్లు

(విశాలాంధ్ర విలేకరి)

విజయనగరం, ఆగస్టు 6

విజయనగరం కాలేజీలో సీట్ల కొరత చాలా హెచ్చుగా వున్నందున విద్యార్థులు, వారి తలిదండ్రులు చాలా ఆందోళన చెందుతున్నారు.

ఈ పరిస్థితులలో తక్షణం కంటోన్మెంట్ లోని మున్సిపల్ హైస్కూలును జూనియర్ కాలేజీగా మార్పుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ డి. వి. సత్యనారాయణ ప్రవేశపెట్టిన యిందుకు చెందిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడిన విషయం పాఠకులకు విదితమే.

యం. పి. సి. లో 80 సీట్లువుండగా రెండు వందల అప్లికేషన్లు వచ్చాయి. బై.పి.సి.లో 32 సీట్లకుగాను 4 వందలు, సి. యు ఇ లో 32 సీట్లకుగాను 2 వందలు అప్లికేషన్లు వచ్చాయి మిగిలిన యం. ఇ సి, హెచ్. యు సి. హెచ్. ఇ టి. మున్నగు సెక్షన్లలో 10 నుండి 25 సీట్లు మాత్రమే వుండగా వాటికి సుమారు 150 అప్లికేషన్లు వచ్చాయని తెలుస్తున్నది.

నగరంలో ప్రైవేట్ పబ్లిక్ సంస్థలకు చెందిన ఆరు హైస్కూళ్ళు వున్నవి.

ఈ హైస్కూళ్ళలో ప్యాసైన వారికి ఈ సీట్లు చాలనిస్థితి ఏర్పడింది అంతేకాదు, 10, 15 మైళ్ళ దూరంనుండి విద్యార్థులు ఈ కాలేజీకి వస్తున్నారు. అందువలన ఈ పరిస్థితులలో మరి రెండు జూనియర్ కాలేజీలకు సరిపోయేటంతగా విద్యార్థుల వత్తిడి వున్నది.

కనుక ప్రస్తుతం కంటోన్మెంట్‌లో వున్న మున్సిపల్ హైస్కూలును జూనియర్ కాలేజీగా మార్పు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విజయవాడలో ఆర్.టి.సి. కార్మికుల సమావేశాలు

శ్రీ వై. వి. రావు ప్రసంగం

విజయవాడ, ఆగస్టు 6

ఆర్. టి. సి. మేనేజ్‌మెంట్‌తో ఎంప్లాయీస్ యూనియన్ చేసుకున్న చరిత్రాత్మకమైన ఒప్పందంలోని ప్రధాన అంశాలను వివరిస్తూ కేంద్ర యూనియన్ కార్యదర్శి శ్రీ వై. వి. రావు ఇచ్చట కార్మికుల సమావేశాలలో ప్రసంగించారు.

విజయవాడ రీజనల్ వర్క్‌షాపు.సబ్-స్టోర్సు, ట్రాఫిక్, మైంటెనెన్స్ యూనిట్లకు చెందిన కార్మికుల సమావేశాలు ఈ నెల 3 తేదీ ఇచ్చట జరిగాయి కృష్ణా బ్రాంచి ఉపాధ్యక్షులు శ్రీ కె. జి. కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు.

శ్రీ వై. వి. రావు ప్రసంగిస్తూ యింకా యిలా అన్నారు:

వేతనాల ప్రతిపాదనలో యూనియన్ యొక్క లక్ష్యం జీవితావసర వేతనాన్ని డిమాండ్‌చేస్తూ వాస్తవమైన వేతనాన్ని పొందడం మాత్రమే. ఒకప్పుడు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకంటే ఎక్కువ వేతనాలు పొందేవారం ఇప్పటివరకు వేతనాల సవరణ లేక వాళ్ళకంటే తక్కువపొందుతున్నాము. 20 సంవత్సరాల తర్వాత ఈ వాళ నిజమైన వేతనాలు సవరణ సాధించాం. వీటితో పాటు ఇంటి అద్దె — అలవెన్సు - గ్రాట్యూటీ సాధించాం! డైరెక్టు రిక్రూట్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టి కార్మికులకు ప్రమోషన్ అవకాశాలను దెబ్బతీయాలని మేనేజ్‌మెంటు చూసింది. యూనియన్ దాన్ని ఎదుర్కొని ఆ ప్రమాదాన్ని నివారించింది.

కాని పోటీ యూనియన్ల ప్రచారం చాలా వింతగావుంది. ఏదో మేనేజ్‌మెంటు యిస్తానంది - వీళ్ళు తెచ్చారు అని. ఇది చాలా సిగ్గుచేటయిన విషయం.

శ్రీ వై. వి. రావు తన ప్రసంగాన్ని ముగిస్తూ విచ్ఛిన్నకర శక్తుల సిగ్గుమాలిన ప్రచారాన్ని ఖండిస్తూ వాస్తవంగా మనం సాధించిన విజయాలను కార్మికులలో ప్రచారం చేయాలని కోరారు.

ఈ సమావేశానికి బ్రాంచి కార్యవర్గ సభ్యులు శ్రీ పి. వెంకయ్యా, శ్రీ ప్రసాదరావు హాజరయ్యారు.

కరువులు, వరదలు

సహాయ కార్యక్రమాల పెంపుదలకై ఆందోళన

ప॥బెంగాల్ కమ్యూనిస్టు సమితి పిలుపు

కలకత్తా, ఆగస్టు 5

కరువు, వరదలకు గురైన ప్రాంతాలలో యిచ్చేసహాయాన్ని పెంపు చేయవలెనిందిగా డిమాండ్ చేస్తూ మూకుమ్మడినిరాహారదీక్షలు, ఘెరావోలు, ప్రదర్శనలు జరుపవలెనిందిగా పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు సమితి నేడు తన శాఖలకు పిలుపిచ్చింది.

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తరప్రాంతంలో ఏర్పడిన తీవ్ర పరిస్థితిని సమితి సమావేశం చర్చించింది.

పేదప్రజలు పస్తులతో తమ జీవితాలను గడుపుతున్నారని, దాదాపు కరువు పరిస్థితి ఏర్పడివున్నదని సమితి నేడొక ప్రకటనలో తెలిపింది.

అవినీతి, నిరంకుశ అధికారులు ప్రజలకు సహాయాన్ని అందించటంలేదని ఆ ప్రకటనలో పేర్కొంది.

పరిస్థితి తీవ్రతను గమనించి, తక్షణమే సహాయాన్ని పెంచవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

బీహార్‌లో ఆకలి చావులు; జగన్నాథ్‌సర్కార్ వివరణ

పాట్నా, ఆగస్టు 5

బీహార్‌లోని భగల్‌పూర్, సంతాల్‌పరగణాలు, దర్భంగాజిల్లాలలో 13 ఆకలిచావులు సంభవించాయని బీహారు కమ్యూనిస్టుసమితి కార్యదర్శి జగన్నాథ సర్కార్ నేడిక్కడ ఒక పత్రికా గోష్టిలో తెలియచేశారు.

మరణించినవారి పేర్లను, అడ్రస్‌లను కూడా ఆయన తెలిపారు.

ఆగస్టు ఒకటవ తేదీ వరకు రాష్ట్రంలో ఆకలి చావులు సంభవించలేదని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే సంతల్ పరగణాల జిల్లాలోని "కుమారుద్" ప్రభుత్వ ఆస్పత్రి డాక్టరు రెండు ఆకలి మరణాలు సంభవించినవని తెలిపారని శ్రీ సర్కార్ వివరించారు.

ధరల పెరుగుదలను అరికట్టేందుకు చర్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ధరల పెరుగుదలను అరికట్టటానికి, అనావృష్టికి గురైన వివిధ రాష్ట్రాలలో ఖరీఫ్ పంటకు కలిగే నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించటానికి చేపట్టవలసిన అత్యవసర చర్యలను గురించి ప్రణాళికా సంఘం తన చర్చలను నేడు ముగించింది. గత మూడు రోజులుగా యీ చర్చలు జరుగుతున్నాయి.

పంపిణీ విధానాన్ని విస్తరించడంతో పాటు పటిష్టంచేయాలని ప్రణాళికా సంఘం నిర్ణయించింది. అంతేకాకుండా ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పెంచటానికి చర్యలు తీసుకోవాలని సూచించింది.

ధరల పెరుగుదలను అరికట్టటానికి చేపట్టవలసిన స్వల్పకాలిక చర్యలను గురించి ప్రణాళికా సంఘం రూపొందించిన నివేదిక, ఖరీఫ్ పంటను రక్షించటానికి వ్యవసాయ శాఖ రూపొందించబడిన నివేదిక, వచ్చే వారం కేంద్రమంత్రివర్గం పరిశీలనకు పంపబడుతాయి. వ్యవసాయశాఖ రూపొందించిన నివేదికను ప్రణాళికా సంఘం ఆమోదించింది.

వెనిస్ చిత్రోత్సవానికి "అనుభవ్"

బొంబాయి, ఆగస్టు 6

వెనిస్‌లో జరిగే 33వ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించడానికై బద్నాముబస్తీ, అనుభవ్ అనే రెండు హిందీచిత్రాలు ఎన్నికైనాయి.

ఈ చలన చిత్రోత్సవాలు ఆగస్టు 21 తేదీ నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు జరుగుతాయి,

ఫిలిమ్ ఫైనాన్సు కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో ఈ రెండు చిత్రాలు నిర్మించబడ్డాయి.

బుధవారం వాల్‌థీమ్ చైనా పయనం

ఐరాస, ఆగస్టు 6

ఐరాస ప్రధాన కార్యదర్శి కర్ట్ వాల్‌థీమ్ తన భార్య, నలుగురు సెక్రటేరియట్ సభ్యులతో బుధవారంనాడు చైనా పయనమై వెళ్తున్నారు. ఆయన చైనాలో 5 రోజులుంటారు.

2 విమానాల కూల్చివేత

హనోయ్, ఆగస్టు 6

ఉత్తరవియత్నాంలో ఎన్‌ఘేయాన్ రాష్ట్రంపై 2 అమెరికా యుద్ధ విమానాలు కూల్చివేయడంతో ఉత్తర వియత్నాంపై కూలిపోయిన విమానాల సంఖ్య 3,797 కు పెరిగిందని టాస్ వార్తా సంస్థ తెలిపింది.

అంటే ఈ సంఖ్య 3800 కు చేరుకోవటానికి-ఇంకా ఎంతో కాలం పట్టదన్నమాట.

29 వ రాజ్యాంగ సవరణ బిల్లు

కేంద్రప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

రాజ్యాంగంలోని 31(ఎ) ఆర్టికల్‌లోని 2వ నిబంధనకు తీవ్రమైన మార్పులనుతీసుకరావటానికి సంబంధించిన 29వ రాజ్యాంగ సవరణబిల్లును శాసనం చేయనవసరం లేదని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నిబంధనప్రకారం, నిర్ణయించిన పరిమితికి లోబడివున్న భూకమతాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లయితే, నష్టపరిహారంగామార్కెట్ విలువను చెల్లించవలసివుంది. సవరణబిల్లు ప్రకారం ప్రభుత్వం మార్కెట్ విలువను చెల్లించనవసరంలేదు.

కేరళ భూసంస్కరణల చట్టంపై సుప్రీమ్ కోర్టు యిచ్చిన తీర్పు, తీసుకరాదలచిన బిల్లుకు అనుగుణంగా వుండటంచే కేంద్రం పై విధంగా నిర్ణయించింది.

29వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం పార్లమెంటు గత సమావేశంలో ప్రవేశపెట్టింది.

హైదరాబాద్ జిల్లాలో అనావృష్టి పరిస్థితి

హైదరాబాద్, ఆగస్టు 6

వచ్చే 15రోజులలో వర్షాలుపడక పోయినట్లయితే హైదరాబాద్‌జిల్లా అంతటా అనావృష్టి పరిస్థితిఏర్పడ గలదని జిల్లాకలెక్టర్ శ్రీ టి లక్ష్మారెడ్డి నేడిక్కడ పత్రికావిలేకరులకు తెలియజేశారు.

గత జులై 10 వతేదీనుంచి వర్షాలు లేని కారణంగా జిల్లాలో ఇప్పటికే అనావృష్టి పరిస్థితి ఏర్పడింది. వచ్చే 15 రోజులలో వర్షాలు పడకపోయినట్లయితే వరి, జొన్న పంటలు ఎండిపోగలవని ఆయన అన్నారు. మంచినీటికి కూడా కొరత ఏర్పడగలదని ఆయన అన్నారు.

గత 11 నెలలలో జిల్లాలో సహాయక చర్యలకు రు. 1.35 కోట్లు ఖర్చుచేయటం జరిగిందని, ఇంత పెద్దమొత్తాన్ని రాష్ట్రంలోని ఏ జిల్లాలో కూడా ఖర్చుచేయటం జరగలేదని అన్నారు.

లోక్‌సభలో కమ్యూనిస్టు సభ్యుని అనధికార బిల్లు

కేరళ ప్రయివేట్ అడవుల స్వాధీనం చట్టం రక్షణకై

న్యూఢిల్లీ, ఆగస్టు 4

కేరళ ప్రయివేట్ అడవుల స్వాధీనం చట్టం (1971) కి రాజ్యాంగ రక్షణకల్పించే అనధికార బిల్లును కమ్యూనిస్టు సభ్యులు శ్రీ సి. కె. చంద్రప్పన్ నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

ఈ చట్టం చెల్లనేరదని కేరళ హైకోర్టు తీర్పు యిచ్చిన విషయం పాఠకులకు తెలిసినదే.

"ఈ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి ఎందుచేతనంటే కేరళలో భూసంస్కరణల అమలుకు హైకోర్టు తీర్పువల్ల విఘాతం ఏర్పడింది" అని శ్రీ చంద్రప్పన్ అన్నారు.

శ్రీ రామావతారశాస్త్రి అనధికారబిల్లు

బీహార్‌లో అణుసంస్థ ఏర్పాటుకు సంబంధించిన మరో అనధికార బిల్లును కమ్యూనిస్టు సభ్యులు శ్రీ రామావతారశాస్త్రి నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

ఐ.రా.స. సభ్యత్వానికి బంగ్లా దరఖాస్తు వచ్చేవారంలో

ఢాకా, ఆగస్టు 5

ఐ.రా.స.సభ్యత్వానికి బంగ్లాదేశ్ వచ్చే వారం దరఖాస్తు పంపుతుందని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ మంత్రి అబ్దుస్ సమద్ నేడిక్కడ తెలియజేశారు.

ఐ.రా.స.లో బంగ్లాదేశ్‌కు సభ్యత్వం లభించగలదన్న ఆశాభావాన్ని ఆయన వెల్లడించారు.

"విశ్వకరుణ" నౌక అగ్నిప్రమాదంపై దర్యాప్తుకు కమిటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5.

విశాఖపట్నం హిందూస్థాన్‌షిప్‌యార్డులో ఆగస్టు ఒకటవతేదీన "విశ్వకరుణ" నౌకలో జరిగిన అగ్నిప్రమాదానికి గల కారణాలను గురించి విచారణ జరిపే నిమిత్తం 6 గురు సభ్యులు గల నిపుణుల కమిటీని నియమించటం జరిగింది.

కమిటీసభ్యులలో ముగ్గురు హిందూస్థాన్ షిప్ యార్డుకు చెందినవారు. వారం రోజుల లోగా నివేదికను అందచేయవలసిందిగా కమిటీని కోరటం జరిగింది,

మొత్తం నష్టం రు. 35 లక్షలని [illegible] అంచనా వేయటం జరిగింది. నౌక ఖరీదు రు. 4 కోట్లు.

ప్రతి రోజూ ఒక హరిజన వాడకు విద్యుత్ సరఫరా

కె. యల్. రావు సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

స్వాతంత్ర్య రజతోత్సవాలను జరుపుకుంటున్న ప్రస్తుత సంవత్సరంలో ప్రతి రోజు ఒక హరిజనవాడను విద్యుదీకరణ చేయుటానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని కేంద్ర జలవిద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ కె. యల్. రావు నేడు సూచించారు.

కేంద్ర విద్యుత్ సంప్రదింపుల మండలి తృతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సాధించిన అభివృద్ధి ఫలితాలు సమాజంలోని బలహీన వర్గాలకు ఇప్పటికంటె అధికంగా లభించే విధంగా స్వాతంత్ర్య రజతోత్సవాల సంవత్సరంలో ప్రత్యేక కృషి చేయటం అవసరమని ఆయన అన్నారు.

కొన్ని రాష్ట్రాలలో మినహా తక్కిన రాష్ట్రాలలో గ్రామాలలో వీధి దీపాలు ఏర్పాటుచేసి, ఆ ప్రక్కనేవున్న హరిజన వాడలలో వీధి దీపాలను ఏర్పాటుచేయని పరిస్థితి వుందని, దీన్ని సరిదిద్దడం అవసరమని అన్నారు.

గ్రామీణ విద్యుద్దీకరణకు సంబంధించిన దశ వర్ష ప్రణాళిక ప్రకారం (1971-81) దేశంలో 3 లక్షల 40 వేల గ్రామాలను 1981 నాటికి విద్యుదీకరణ చేయటం జరుగుతుందని అన్నారు. 65 లక్షల పంపు సెట్లకు విద్యుత్‌ను సరఫరా చేయటం జరుగుతుందని అన్నారు వెనుకబడిన రాష్ట్రాలకుప్రాధాన్యత యివ్వటం జరిగిందని అన్నారు.

1972 మార్చినాటికి లక్ష 20 వేల గ్రామాలను విద్యుద్దీకరణ చేయటం జరిగిందని, 18 లక్షల 84 వేల పంపుసెట్లకు విద్యుత్‌ను సరఫరా చేయటం జరిగిందని అన్నారు.

కేంద్ర సెక్రటేరియట్‌లో ఐ. సి. ఎస్. వాలాల దర్బారు

న్యూఢిల్లీ, ఆగస్టు 3

"కేంద్ర ప్రభుత్వంలో ఐ. సి. ఎస్. ఉద్యోగులు తిష్టవేసుక్కూచున్నారు. పెద్ద పెద్ద పదవులపైన వారు గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్నారు.

ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వంలో 58 కార్యదర్శి పదవుల్లోనూ 32 పదవులను ఐ.సి.ఎస్. వాలాలే ఆక్రమించుకు కూర్చున్నారు, అని నేడు రాజ్యసభలో కమ్యూనిస్టుసభ్యులు శ్రీ కల్యాణరాయ్ ఐ సి. ఎస్. నిరంకుశాధికారుల ప్రాబల్యాన్ని నిశితంగా విమర్శించారు.

హోంశాఖ స్టేట్‌మంత్రి శ్రీ రామ్‌నివాస్ మిర్ధా ఈ ఆరోపణను తిరస్కరించారు.

అయితే, శ్రీ కల్యాణరాయ్ ఇచ్చిన వివరాలు ఐ. సి. ఎస్. ఆఫీసర్ల ఆధిక్యతను బుజువు చేస్తున్నాయి. 49 మంది అదనపు కార్యదర్శులలోనూ, 35 మంది ఐ సి. ఎస్ లేదా ఐ. ఏ ఎస్. ఆఫీసర్లే ఉన్నారు. 14 మంది మాత్రమే ఇతరులు ఉన్నారు. 224 జాయింట్ సెక్రెటరీ పదవులలో 94 మంది ఐ. సి. ఎస్. ఐ. ఏ ఎస్. వాలాలే ఉన్నారు. మిగిలిన 94 పదవుల్లో మాత్రమే ఇతరులు ఉన్నారు. 565 డైరెక్టర్లు, ఉప కార్యదర్శి పదవుల్లో 252 మంది ఐ సి. ఎస్, ఐ ఏ ఎస్. వాలాలే తిష్టవేసుక్కూర్చుని ఉన్నారు. 313 మంది ఇతరులు ఉన్నారు. పై వారిలో 32 మంది కార్యదర్శులు, 18 అడిషనల్ సెక్రెటరీలు, 3 గ్గురు జాయింట్ సెక్రెటరీలు ప్రత్యక్షమైన ఐ. సి. ఎస్.వాలాలే.

డిప్యూటీ సెక్రెటరీలు, దానికిసమానమైన యితర పదవుల్లో సెక్రెటేరియట్‌లో ఉన్న మొత్తం 834 మందికి గాను 443 మంది ఐ. ఏ. ఎస్. వాలాలే పీఠం వేసుక్కూచున్నారు.

మంత్రి మిర్ధా వీటన్నిటినీ నిరాకరించారు. పైగా రాష్ట్రాలనుండి కేంద్రానికి ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లను ప్రమోట్ చేయటాన్ని నిలుపుదల చేసేందుకు నిరాకరించారు. అంతేకాదు. అలా ప్రమోషన్లపై వచ్చే వారు 25 శాతం మాత్రమే ఉన్నారనీ, వారి సంఖ్య పెంచాలన్న డిమాండ్ కూడా వుందని అన్నారు.

శాస్త్రవేత్తలను, సాంకేతిక నిపుణులను, ఈ ఐ.సి. యస్; ఐ. ఎ. యస్‌వాలాలుచిన్నచూపు చూస్తున్నందువల్ల వారిలో అపరిమితమైన అసంతృప్తి పేరుకుపోయిందని రాజ్యసభలో కమ్యూనిస్టుపక్షనాయకులు శ్రీభూపేష్ గుప్తా అన్నారు.

"మూడు ముఖ్యమైన మంత్రిత్వశాఖలూ, అంటే, ప్రధాని సెక్రెటేరియట్, క్యాబినెట్ సెక్రెటేరియట్, హోం మంత్రిత్వశాఖ అన్నీ ఐ. సి. ఎస్ వాలాలకు ప్రేమ ప్రాతులైన వారితో క్రిక్కిరిసి ఉన్నాయి. ఈ మంత్రిత్వ శాఖలపైన కూలంకష విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాను. చివరికి ప్రధాని ప్రధాన ప్రైవేట్ కార్యదర్శి పదవి కూడా ఉత్తర, దక్షిణ ప్రాంతాల వర్గాల కీచులాటలకు సాధనమైపోయింది," అని భూపేష్‌గుప్తా మంత్రిత్వశాఖల్లోవున్న దారుణ పరిస్థితిని నిశితంగా విమర్శించారు.

మంత్రి సమాధానం చెప్పే లోపలే ప్రశ్నోత్తరాల సమయముపై పోయింది, ప్రభుత్వ నిర్వహణ, ఉన్నతాధికార స్థాయిలో జరుగుతున్న కుంభకోణాలూ, అవకతవకలపైన స్వల్పకాలిక చర్చకోసం తానొక [illegible] కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్ ప్రకటించారు.

దానాంగ్‌పై రాకెట్ దాడి

క్వాంగ్‌ట్రీవద్ద విముక్తిసేన శతఘ్నికాల్పుల వర్షంలో కీలుబొమ్మ మెరైన్లు ఉక్కిరిబిక్కిరి

సైగాన్, ఆగస్టు 3

దక్షిణ వియత్నాం ఉత్తరప్రాంతంలోని అతి ప్రధానమైన సైనిక, నౌకా కేంద్రమైన దానాంగ్‌పై నేటి తెల్లవారుఝామున విముక్తిదళాలు 1500 రాకెట్లు పేల్చారు.

దాడిలో ఇద్దరు అమెరికన్ సైనికులు హతమయ్యారు, 10 మంది గాయపడ్డారని అమెరికా సైనికాధికార్లు చెప్పారు. ఉత్తరాన హ్యూ నగరంపై కూడా దాడి జరిగింది.

క్వాంగ్‌ట్రీ నగరంవద్ద వందలాది అమెరికా విమానాల దాడులు కూడా విముక్తి సేన శతఘ్నుల గర్జనను అపలేకపోయాయని ఎ. పి. విలేకరి వార్త తెలుపుతోంది. గత రాత్రి, నేటి ఉదయం అమెరికా విమానాలు 14 సార్లు దాడులు జరిపి నగరంపై 18000 టన్నుల బాంబులు కురిపించాయి. అయినప్పటికీ కీలుబొమ్మ సేన మెరైన్ దళాలపై దాదాపు 2000 రౌండ్ల శతఘ్నికాల్పులు జరిపి విముక్తిసేన వారిని తిప్పికొట్టింది.

రెండువారాల నుండి 20వేలమంది కీలుబొమ్మ సైనికులతో "ఎదురు దాడి" ప్రారంభించినప్పటినుండి ఇంత పెద్ద ఎత్తున విముక్తి సేన శతఘ్నులతో ప్రతిఘటించడం ఇదే ప్రథమం. విముక్తి సేన దాడిలో మెరైన్ దళాల స్థావరాలు నజ్జునజ్జయి పోయాయని రాయిటర్ వార్త తెలుపుతుంది

దానాంగ్‌కు దక్షిణాన ఉన్న క్వేసాన్ పైకూడా విముక్తిసేన దాడి జరిపింది.

దక్షిణ వియత్నాం జనాభాలో సగంమంది శరణార్థులు - 35000 మంది దుర్మరణం

వాషింగ్టన్, ఆగస్టు 5

గత ఏప్రిల్ 1 నుండి ప్రారంభమైన యుద్ధంలో 35000 మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షమంది యున్న బీభత్సానికి గురి అయ్యారు అని సెనెట్‌కు ఇచ్చిన నివేదికలో గురువారంనాడు కెన్నెడీ తెలిపారు.

సగటున రోజుకు 200 మంది పురుషులు, స్త్రీలు, పిల్లలు, శరణార్థులవుతున్నారు.

జూన్ మాసాంతానికి కొత్తశరణార్థుల సంఖ్య 814 వేలనుండి 868 వేలకు అంటే 50 వేలకు పైగా పెరిగింది,

వియత్నాంలో అమెరికా యుద్ధానికి 1965 నుండి 10 లక్షల 3 వేలమంది గురి అయ్యారు, వీరిలో 4 లక్షలమంది ప్రాణాలు కోల్పోయారు,

1965 నుండి మొత్తం లెక్కచూస్తే శరణార్థులసంఖ్య దాదాపు 80 లక్షలకు చేరుకుంటోంది అంటే దక్షిణవియత్నాం జనాభాలో దాదాపు సగంమంది శరణార్థులయ్యారన్న మాట.

ఇంతజరిగిన తర్వాత "ఉత్తర వియత్నాం మనబాంబుదాడి కాల్పులు పౌరులపై చాలతక్కువ ప్రభావంకలిగిస్తున్నవని చెబితే అది బుద్ధిఉన్న వాడెవడికి అర్థంకాదు"ని కెన్నెడీ అన్నారు.

"వైమానిక యుద్ధకబంద హస్తాల్లో పౌరులు చిక్కుకున్నారనడంలో ఎట్టి సందేహమూలేదు" అనికెన్నెడీ అన్నారు

జపాన్‌లో అమెరికా స్థావరం దగ్గర శాంతియోధుల బైఠాయింపు

టోక్యో, ఆగస్టు 6

వియత్నాంకు అమెరికా సైనిక పరికరాల రవాణాను నిరోధించేందుకు జపాన్ శాంతియోధుల బృందం నిన్న యోకహామా రేవు వద్ద బైఠాయింపు జరిపిందని టాస్ వార్తాసంస్థ తెలిపింది.

ఆ బృందంలో జపాన్ సోషలిస్టు పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు కూడా ఉన్నారు.

నాలుగు టాంకులు, సాయుధ సైనిక శకటాన్ని తరలిస్తున్న వాహనాలను శాంతియోధులు అడ్డగించారు. జపాన్‌లో అమెరికాకున్న సగామిహారా సైనిక స్థావరంలో మరమ్మత్తు అయిన తర్వాత ఈ శకటాలు తిరిగి వస్తున్నాయి. వియత్నాంలో దెబ్బతిన్న ఆ సైనిక పరికరాలు, వాహనాలను ఈ స్థావరంలో మరమ్మతుచేసి తిరిగి వియత్నాంపంపుతూ ఉంటారు.

ఉగాండా నుండి ఆసియా దేశస్థుల బహిష్కరణ

కంపాలా, ఆగస్టు 5

బ్రిటిష్ పాస్‌పోర్టులతో ఉగాండాలో నివసిస్తున్న 80 వేల మంది ఆసియా దేశస్థులు 3 నెలల్లోగా దేశం విడిచి వెళ్ళాలని ఉగాండా అధ్యక్షులు అమీన్ నేడు ప్రకటించారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగిస్తూ అమీన్ పై విధంగా ప్రకటించారు.

వీరంతా ఉగాండాను విడిచివెళ్ళటానికి ఏర్పాటుచేయవలసిందిగా బ్రిటిష్ హైకమిషనర్‌ను కోరగలనని ఆయన తెలిపారు.

బ్రిటిష్ పాస్‌పోర్టులుగల ఆసియా దేశస్థులు ఉగాండా ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని, ఉగాండా ప్రజల సంక్షేమాన్ని వారు కోరటంలేదని అన్నారు

దేశంలోని ప్రతి వాణిజ్యసంస్థపై వీరే పూర్తి ఆధిపత్యాన్ని వహిస్తున్నారని ఆయన అన్నారు. అలాంటి వాణిజ్య సంస్థలను ఉగాండా ప్రజలే ఎందుకు నిర్వహించరాదని ఆయన ప్రశ్నించారు.

బ్రిటిష్, అమెరికన్ టుబాకో కంపెనీకి చెందిన పొగాకు శుద్ధి కర్మాగారాన్ని, సిగరెట్ ఫ్యాక్టరీని స్వాధీనంచేసుకోనున్నట్లు అమీన్ ప్రకటించారు.

ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ ఢిల్లీరాక రాష్ట్రపతి ప్రధానులతో భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ సర్ పాల్ హాస్‌లక్ భారత్‌లో రెండు రోజుల పర్యటనకై నేడిక్కడికివచ్చారు. ఆయన రాష్ట్రపతి శ్రీ గిరిని, సాయంత్రం ప్రధాని శ్రీమతి గాంధీని కలుసుకున్నారు. ఆయన గౌరవార్థం రాష్ట్రపతి విందుచేశారు.

మార్క్సిస్టుల ప్రదర్శనలు కేరళలో

తిరువనంతపురం, ఆగస్టు 5

మార్క్సిస్టుపార్టీ నాయకత్వాన రాష్ట్రంలో సాగించిన ప్రచారం ముగింపు సందర్భంగా కేరళలో తిరువనంతపురం, త్రిచూర్ కొచ్చిన్‌లలోను యితర జిల్లా పట్టణాలలోను నేడు పెద్ద ప్రదర్శనలు, సభలు జరిగాయి.

ఇప్పటికి 73 రోజులుగా జరుపుతున్న తమ "భూఆక్రమణలను" ఆగస్టు 17 నుండి మరింత తీవ్రం చేస్తామని తిరువనంతపురంలో ఎ. కె. గోపాలన్ చెప్పారు. ఆగస్టు 17 నుండి రాష్ట్రంలో భూములు సాగుచేయడం, పంటల కోతలు కూడా ప్రారంభిస్తామని ఆయన బెదిరించారు.

సైనికుల ఉపసంహరణ తేదీ నిర్ణయం కాలేదు

శ్రీ జగ్‌జీవన్‌రామ్

బొంబాయి, ఆగస్టు 5

డిసెంబర్ యుద్ధం సందర్భంగా స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలనుండి సైన్యాల పునసంహరణకు ఇంకా తేదీని నిర్ణయించలేదని రక్షణశాఖామంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ నేడిక్కడ తెలియజేశారు

పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధృవీకరణ పత్రాలమార్పిడి అనంతరం సిమ్లా ఒప్పందం అమలులోకి వచ్చిందని ప్రస్తుతం సెక్టార్ కమాండర్లు సమావేశమై సైన్యాల ఉపసంహరణకు సంబంధించిన వివరాలను రూపొందించవలసి వుందన్నారు. అందుచేత సైన్యాల పునసంహరణకు సంబంధించి నిర్దిష్టమైన తేదీని చెప్పటం సాధ్యం కాదని అన్నారు.

సిమ్లా ఒప్పందం అనంతరం పాక్ సైనికులు కాల్పుల విరమణను ఉల్లంఘించలేదని ఆయన అన్నారు.

జెనీవా ఒప్పందం ప్రకారం పాక్ యుద్ధఖైదీలకు పెట్టిన ఖర్చును భారత దేశం పాకిస్తాన్‌నుండిరాబట్టుకొనవచ్చునని అన్నారు

పాకిస్తాన్‌తో సంబంధాలను మెరుగుపరచుకొనేందుకు భారతదేశం ప్రయత్నిస్తున్నదని, ఈ ప్రయత్నాలు ఫలప్రదం కాగలవని ఆశిస్తున్నామని అన్నారు.

ఎలాంటి అవాంతరాలనైనా ఎదుర్కొనేందుకు దేశం సంసిద్ధంగా వుండాలని, అయితే ఉపఖండంలో పరిస్థితి మెరుగుపడిన అనంతరం రక్షణ విధానాన్ని పునఃపరిశీలించుకోవచ్చునని అన్నారు.

పాకిస్తాన్ నుండి గుజరాత్‌కు వస్తున్న శరణార్థులను గురించి విలేకరులు ప్రశ్నించగా వారు పాక్ పౌరులేనని శ్రీ జగ్‌జీవన్‌రామ్ అన్నారు వీరంతా తమ స్వగృహాలకు వెళ్ళటానికి వీలుగా తగిన పరిస్థితులను పాక్‌లో కల్పించటం పాకిస్తాన్ ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. యితర దేశాలతో పోల్చినట్లయితే భారత రక్షణ వ్యయం తక్కువగా వుందని అన్నారు.

ఖాడిల్కర్ చర్చలు బంగ్లా ఆహార మంత్రితో

ఢాకా, ఆగస్టు 5.

బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న భారతపునరావాస కార్మిక మంత్రి శ్రీ ఖాడిల్కర్ నేడు బంగ్లాదేశ్ ఆహారం, సరఫరాల మంత్రి ఫణిభూషణ్‌మజుందార్‌తో చర్చ జరిపారు. ఖాడిల్కర్‌తోబాటు భారత పునరావాస డిప్యూటీ హైకమిషనర్ దీక్షిత్, అడిషనల్ కార్యదర్శి [illegible] కూడ వున్నారు.

కీలకాయుధాల పరిమితి ఒప్పందం ధృవీకరణ

అమెరికా సెనేట్ చే

వాషింగ్టన్, ఆగస్టు 4

సోవియట్ యూనియన్‌తో ఇటీవల కుదుర్చుకున్న కీలకాయుధాల పరిమితి ఒప్పందాన్ని నిన్న అమెరికా సెనెట్ ధృవీకరించింది.

ఒప్పందాన్ని ధృవీకరించేందుకు ప్రవేశపెట్టిన ప్రతిపాదనకు అనుకూలంగా 88 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 2 ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఒకే ఒక సభ్యుడు మాత్రమే మాట్లాడాడు.

అణ్వాయుధ పోటీ ఉన్మాదానికి స్వస్తి చెప్పే దిశలో తీసుకున్న చారిత్రాత్మక ప్రథమచర్య ఈ ఒప్పందం అని పలువురు సెనేటర్లు ప్రశంసించారు.

రిపబ్లికన్ సభ్యుడు జేమ్స్‌బక్లీ ఒక్కరు మాత్రమే ఒప్పందాన్ని వ్యతిరేకించారు.

ఒక్క సోవియట్ యూనియన్ నుంచే కాక, ఇతరదేశాలఅణ్వాయుధాల"ప్రమాదం" నుంచి కూడా అమెరికా ప్రజలను రక్షించవలసిన అవసరం వున్నదని ఆయన అన్నాడు.

గత కొద్ది సంవత్సరాలుగా ఇంత ప్రాముఖ్యంగల ఒప్పందాన్ని సెనేటులో ప్రవేశపెట్టలేదని డెమోక్రటిక్ నాయకుడు మైక్ మాన్స్‌ఫీల్డ్ అన్నారు

సెనేట్ సవరణ తీర్మానానికి ఆమోదం

అమెరికా విదేశీ వ్యవహారాల కమిటీ చే

వాషింగ్టన్, ఆగస్టు 3

ఇండో చైనా నుంచి వచ్చే అక్టోబర్ 1 లోగా మొత్తం అమెరికా సైన్యాలను ఉపసంహరించు కోవాలంటూ సెనెట్ ఆమోదించిన సవరణ తీర్మానాన్ని ప్రజా ప్రతినిధుల విదేశీ వ్యవహారాల కమిటీ ఆమోదించింది.

అమెరికా యుద్ధ ఖైదీలను ఉత్తర వియత్నాం విడుదలచేసే పక్షంలో ఇండో చైనానుంచి మొత్తం సైన్యాలను ఉపసంహరించుకోవాలన్న సవరణ ప్రతిపాదనను సెనెట్ ఇటీవల ఆమోదించింది.

ఇండోచైనాలో భవిష్యత్తులో సాగించే సైనిక చర్యలకు నిధులు కేటాయించకూడదన్న సవరణ తీర్మానంలోని అంశంతో మాత్రం విదేశ వ్యవహారాల కమిటీ విభేదించింది.

కలరా వల్ల 600 మంది మృతి

యు. పి. లో గత 4 నెలల్లో

లక్నో, ఆగస్టు 5

ఉత్తర ప్రదేశ్‌లోని బల్లియా, ఝాన్సీ, సుల్తాన్‌పూర్ జిల్లాలలో గత ఏప్రియల్ నుంచి ఇప్పటివరకు కలరా, గ్యాస్ట్రో-ఎంటరైటిస్‌వల్ల 600 మందికిపైగా మరణించినట్లు ఇక్కడ అందిన సమాచారం తెలిపింది.

శేషాచలం మృతి

ప్రముఖ ప్రచురణకర్త

విజయవాడ, ఆగస్టు 5

ప్రముఖప్రచురణకర్త, ఎమెస్కోసంస్థాపకులు, శ్రీ మదూరి శేషాచలం నిన్నసాయంత్రం మచిలీపట్నంలో మరణించారు.

ఆయనస్మృతికి సంతాపంగా విజయవాడలోని ప్రచురణసంస్థలన్నీ నేడు మూసివేశారు మచిలీపట్నంలో ప్రెస్‌క్లబ్ సమావేశం జరిపి, జర్నలిస్టుల సంఘ [illegible] శ్రీ శేషాచలంస్మృతికి సంతాపంప్రకటించారు.

మచిలీపట్నంలో హిందూకాలేజి, దాని అనుబంధ హైస్కూల్సు, జైహింద్ హైస్కూలు తదితర స్థానిక విద్యాసంస్థలు శేషాచలం స్మృతికి సంతాపంగా నేడు మూసివేశారు.

శ్రీ శేషాచలం వయస్సు 74 సంవత్సరాలు

నిరుద్యోగులకి కేరళ ప్రభుత్వ సౌకర్యం

తిరువనంతపురం, ఆగస్టు 5

కేరళలో ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజీలలో తమపేర్లను నమోదుచేసుకున్నవారుమూడు నెల్లకోమారు, సంవత్సరాంతంలోనూ రెన్యూవల్‌కై ఎక్ఛేంజి కార్యాలయాలకు హాజరు గానక్కరలేకుండా కేరళ ప్రభుత్వం "రిప్లై పెయిడ్ పోస్టుకార్డు" విధానాన్ని ప్రవేశపెట్టింది.

రిజిస్ట్రేషన్‌లను రెన్యూ చేయించేందుకు ఇతర రాష్ట్రాలలో అయితే నిరుద్యోగులు ఎక్ఛేంజి కార్యాలయాలకు హాజరవ్వాల్సి ఉంది అసలే నిరుద్యోగంతో బాధపడుతున్న వారిపై దీనివల్ల మరికొంత ఆర్థిక భారం పడుతున్నది. ఈ విధానంవల్ల అది తప్పుతుంది ఆగస్టు 16 నుండి కొత్త పద్ధతి అమలులోకి వస్తుందని ప్రభుత్వ అధికార ప్రకటన తెలిపింది.

తూర్పు గోదావరిజిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

రాజమండ్రి, ఆగస్టు 5

రాజమండ్రిలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా బాడీబిల్డింగ్ పోటీలలో గౌతమశ్రీగా శ్రీ కె. అప్పాలమూర్తి, ఉత్తమ వెయిట్ లిఫ్టర్‌గా కె. వెంకట్రాజులు ఎన్నికయ్యారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్ పోటీలు జూలై 30వ తేదీన జరిగాయి. పోటీలను లైన్సుక్లబ్ అధ్యక్షులు డాక్టర్ వాశిరెడ్డి ప్రభాకరరావు ప్రారంభించారు. పోటీల అనంతరం సాయంత్రం మున్సిపల్ ఛైర్మన్ పోతుల వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సభలో విజేతలకు డాక్టర్ పన్నాసి రావు బహుమతులనిచ్చారు

పోటీలు నిర్వహించిన గౌతమివ్యాయామ కళాశాల కార్యదర్శి శ్రీ అడ్డూరి నారాయణ రావు నివేదికను యిచ్చారు.

విజేతల వివరాలు

ఫేపర్ వెయిట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ఎ. వీరభద్రరావు, యస్. రామారావు, పి. అంజనేయులుకు లభించాయి.

ఫ్లైవెయిట్‌లో యస్. సూర్యారావు పి వెంకటేశ్వర్లు, యం. శంకర్‌లు గెలుపొందారు.

బాంటమ్ వెయిట్‌లో కె వెంకటరావు. జి. సుబ్బారావు, టి భాస్కరరెడ్డి, ఫెదర్ వెయిట్‌లో కె వెంకటరావు, యం. సత్యనారాయణ, కె. అప్పలమూర్తిలు బహుమతులను పొందారు

లైట్ వెయిట్ పోటీలో ఎ. కృష్ణ, వి. వెంకట్రావు, మిడిల్ వెయిట్‌లో ఓ. వి. దయాకర్, కె. దైవప్రసాద్, లైట్ హెవీ వెయిట్‌లో వి. హెచ్. లక్ష్మీనారాయణ, యం. ఖాజీఖాన్‌లు గెలిచారు.

బాడీ బిల్డింగ్

బాడీబిల్డింగ్ షార్టు మెన్ గ్రూప్‌లో కె. కోటిలింగాలు. బి. రామకృష్ణ, జె షాలు, మిడిల్‌మెన్ గ్రూప్‌లో యం. సత్యనారాయణ. కె సత్యనారాయణరెడ్డి, కె. రంగ నాయకులు, టాల్ మెన్ గ్రూప్‌లో కె. అప్పాలమూర్తి, పి అప్పారావు, టి. సతీష్‌బాబులు గెలుపొందారు.

బాడీ బిల్డింగ్ మూడుగ్రూపులలో ప్రథములుగా వచ్చిన వారిమధ్య జరిగిన గౌతమిశ్రీ పోటీలో శ్రీ కె. అప్పాలమూర్తి ఎన్నికయ్యారు. ఉత్తమ వెయిట్ లిఫ్టర్‌గా శ్రీ కె. వెంకట్రాజు గెలుపొందారు.

డిస్కస్‌త్రోలో రికార్డు స్థాపన

మాస్కోలో జరిగిన డిస్కస్ త్రో పోటీలలో 66.76 మీటర్ల దూరం డిస్కస్ విసిరి కుమారి ఫైనా మెల్నిక్ ప్రపంచ రికార్డును స్థాపించారు

మ్యూనిచ్‌లోజరిగే ఒలింపిక్ పోటీలలో ఖచ్చితంగా స్వర్ణ పతకాన్నిపొందే కుమారి మెల్నిక్ యీ సంవత్సరం తనే స్థాపించిన ప్రపంచ రికార్డును 1.28 మీటర్ల వరకు అధిగమించారు.

భారతీయ హాకీజట్టు కైరో ఆగమనం

మ్యూనిచ్ ఒలింపిక్ పోటీలలో పాల్గొనే భారత్ హాకీజట్టు యీ రోజు కైరో చేరుకున్నది.

ఈజిప్టు-భారత్ జట్ల పోటీ ఈ రోజు జరుగుతుంది మరో రెండు పోటీలు కూడ జరుగుతాయి.

భారత్ జట్టు ఆగస్టు 10వ తేదీన బెర్లిన్ బయలుదేరి వెళుతుంది.

టెన్నిస్ పోటీలు

ఆసియా అంతర్జాతీయ లాన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు యీ సంవత్సరం డిసెంబర్ 11 - 17 తేదీల మధ్య ఢిల్లీలో జరుగుతాయి

గ్రాండ్‌ప్రిక్స్ పోటీలలో భాగంగా యీ పోటీలు జరుగుతాయి. పోటీలలో ఎవరైనా పాల్గొనవచ్చును. గెలుపొందిన వారికి 25 వేల డాలర్ల బహుమతినిస్తారు.

జాతీయ లాన్ టెన్నిస్ పోటీలు ఢిల్లీ పోటీల అనంతరం కలకత్తాలో 18.24 తేదీలలో జరుగుతాయి

జూనియర్ జట్టు రద్దు

టోక్యోలో ఆగస్టు 28 తేదీన జరిగే ఆసియా జూనియర్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలలో భారతదేశం పాల్గొనదు

ప్రభుత్వం అవసరమయిన నిధులు కేటాయించనందువల్ల యీ నిర్ణయాన్ని అఖిల భారత లాన్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గం తీసుకున్నది.

'ప్రమాదంలో ఇస్లాం!'

ఢాకా, ఆగస్టు 5

"ఇస్లామును రక్షించే" విషయం చర్చించేందుకు సంతోష్‌లో నేడు సమావేశం కావలసిందిగా మౌలానా భసానీ ముస్లిం మత ప్రచారకులకు పిలుపిచ్చారు

ఇస్లాం తీవ్ర ప్రమాదంలో పడిందనీ దానిని రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలనీ భసానీ పిలుపిస్తున్న పోస్టర్లు మసీదులపైనా, భవనాలపైనా కనిపించాయి.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల స్వాధీనానికై డిమాండు

హైదరాబాద్, ఆగస్టు 3

రాష్ట్రంలో ప్రైవేటు మేనేజిమెంటు క్రిందవున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నిన్న శాసనమండలిలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు.

అంతకు ముందు జనసంఘ్ సభ్యులు శ్రీ వై. సి రంగారెడ్డి చర్చను ప్రారంభించారు శ్రీ జి అచ్యుత రామరాజు చర్చను ముగింపు చేశారు

చర్చలో శ్రీయుతులు కె రోశయ్య, యం. వి యస్ సుబ్బరాజు, ఎస్. రామకృష్ణయ్య, ఎల్. ఎస్. రాజు, జి అచ్చన్న, ఎస్. టి పి. వి కూర్మాచార్యులు, పి. రామబ్రహ్మం, ఎ. కోటయ్య, యం. గిరిధర రావు, జియ్యర్‌దాస్, వి. వి. రాఘవాచారి, బి. బాపనయ్య ప్రభృతులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణ అనే అంశంపై జరిగిన చర్చకు సాంఘిక సంక్షేమశాఖామంత్రి శ్రీ యం. వి. కృష్ణారావు జవాబు చెపుతూ ఇంతకుముందు హాస్టళ్ళకు ఇస్తున్న అదనపు గ్రాంటు ప్రభుత్వం నిలుపుచేసిందని తెలిపారు.

శ్రీ చెంగల్‌రెడ్డి నాయకత్వాన శాసన మండలి కమిటీ చేసిన అన్ని సిఫార్సులను ప్రభుత్వం అమలుచేస్తుందని చెప్పారు.

నిధుల కొరతవల్ల అన్ని హాస్టళ్ళను ఒకేసారి స్వాధీనం చేసుకోవడం సాధ్యపడదన్నారు. త్వరలో సాంఘిక సంక్షేమ శాఖను పునర్ వ్యవస్థీకరించటం జరుగుతుందని అన్నారు.

సాంఘికసంక్షేమ హాస్టళ్ళను తాసిల్దార్లు, బి. డి వో లు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లు ఆకస్మిక తనిఖీలు జరుపాల్సిందిగా ఆదేశాలు యిచ్చినట్లు తెలిపారు.

ఆదాయ పరిమితి పెంపుపై ప్రభుత్వ పరిశీలన

స్కాలర్‌షిప్‌ల మంజూరుకు

హైదరాబాదు, ఆగస్టు 2

షెడ్యూలు కులాలు, జాతులకు చెందిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందేందుకు ప్రస్తుతమున్న ఆదాయ పరిమితి రు 3600 లను రు. 5 వేలకు పెంచేవిషయం ప్రభుత్వ పరిశీలనలో వుందని నేడు శాసన సభలో సాంఘిక సంక్షేమశాఖమంత్రి శ్రీ యం వి. కృష్ణారావు తెలియజేశారు

ఈ పరిమితిని రూ. 3 600 నుండి రూ. 6 వేలకు పెంచవలసిందిగా శ్రీమతి ఈశ్వరీబాయి ప్రవేశపెట్టిన సావధాన తీర్మానానికి సమాధానంగామంత్రి పైవిషయాన్ని తెలియజేశారు.

ఈ పరిమితిని పెంచాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరమని ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయని మంత్రి తెలియజేశారు.

పరిమితిని పెంచినందువల్ల ప్రభుత్వానికి రు. 54.52 లక్షలు అదనంగా ఖర్చు అవుతుందని అన్నారు

మంగళగిరిలో గోనెపట్టాలో స్త్రీశవం

మంగళగిరి, ఆగస్టు 5

మంగళగిరిలో గ్యాస్ ఫ్యాక్టరీ వద్ద [illegible] రోడ్డు ప్రక్కనే మూడు రోజుల నుండి ఒక స్త్రీ శవం పడి ఉంది

మూడు రోజులుగా ఈ శవం ఒక గోనె పట్టాలో చుట్టబడి ఉంది శవాన్ని కుక్కలు పీక్కు తింటున్నాయి. నేడు శవం బయటపడటంవల్ల ప్రజల దృష్టిలోకి వచ్చింది. ఆ స్త్రీ వయస్సు 40 సంవత్సరాలుంటుంది. తొడలవరకు కుక్కలు తినేశాయి. మొహం కాలుపూసినట్లు నల్లగా జిడ్డుతో ఉంది. [illegible] మాత్రం లేదు ఇది బహుశ హత్య కావచ్చునని ప్రజలు అనుకుంటున్నారు

పోలీసులు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు స్థానిక ఇన్‌స్పెక్టర్ దృష్టికి ఈ విషయం తీసుకరాగా తనకు ఈ సమాచారమే తెలియదని అన్నారు. (వి. వి.)

విజయవాడ పట్టణ కమ్యూనిస్టు సమితి విస్తృత సమావేశం

ఆగస్టు 7వ తేదీ సాయంకాలం 7 గంటలకు లెనిన్ భవన్‌లో పట్టణ కమ్యూనిస్టు సమితి విస్తృత సమావేశం జరుగుతుంది. సమితి సభ్యులతోపాటు, వివిధ శాఖా కమిటీల సభ్యులుకూడ యీ సమావేశానికి హాజరు కావలసిందిగా కార్యదర్శి శ్రీ దాసరి నాగభూషణరావు ప్రకటిస్తున్నారు

అపరిశుభ్రతకు ఆలవాలమైన కాళేశ్వరరావు మార్కెట్

ప్రజల, రైతుల, వర్తకుల, కమిషన్‌ఏజెంట్ల ఇబ్బందులు

(విశాలాంధ్ర విలేకరి)

ఆంధ్రలో అతిపెద్ద మార్కెట్ అయి, నిత్యం కొన్నివేల రూపాయల వ్యాపారం జరుగుతూ, అపరిశుభ్రతకు ఆలవాలంగా తయారయిన విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్‌వద్ద పట్టణ ప్రజలు, చుట్టు ప్రక్క గ్రామాల రైతులు కమిషన్ ఏజెంట్లు, రిటైల్ వర్తకులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

మార్కెట్‌లోపల, చుట్టుప్రక్కల పరిశుభ్రంగా వున్న ప్రదేశం ఒక అడుగు కూడా కన్పించదంటే అతిశయోక్తి కాదేమో. మార్కెట్ లోపల ప్రవేశించినవారు కూరగాయలు కొనుక్కొనేందుకు ముందుకు వెళుతుంటే క్రిందపేరుకుపోయిన చెత్తా, చెదారం కాళ్ళకు అడ్డుపడుతూ వుంటాయి. మార్కెట్‌లోని రిటైల్ కొట్ల చుట్టు ప్రక్కల యిదే పరిస్థితి వుంది. తూర్పు భాగంలో రిటైల్ కొట్లలోగాక కొందరు క్రింద కుప్పలుగా పోసుకుని కూరగాయలు అమ్ముకొనేచోట పారిశుద్ధ్య పరిస్థితి యింకా అధ్వాన్నంగా వుంది.

మనుషులు స్వేచ్ఛగా మసలటానికి వీలుండదు. ఏ మాత్రం అప్రమత్తతగా వున్నా ఒకళ్ళు నొకళ్ళు ఢీకొనకతప్పదు.

మార్కెట్ చుట్టు ప్రక్కల ప్రదేశం పేరుకుపోయిన ఆకులు, గడ్డితో చూచుటకే అసహ్యంగా వుంటుంది, వర్షాకాలంలో యీ చెత్తా చెదారం నుండి వ్యాపించే దుర్వాసన ఆ ప్రాంతంగుండా వెళ్ళే ప్రజలకు ఇబ్బంది కలుగజేస్తూ వుంటుంది.

మార్కెట్, వస్త్రలత మధ్యగల రోడ్డు దాదాపుగా సగభాగం వివిధ రకాల తినుబండారాలు అమ్మే బళ్ళతో నిండివుంటుంది, రోడ్డుపైనే వివిధ రకాల పండ్ల వ్యాపారం యధేచ్ఛంగా సాగుతూ వుంటుంది. మార్కెట్‌కు వంద గజాల అవరణలో వ్యాపారం చేసేవారి వద్దనుండి పన్ను వసూలు చేసే అధికారం మున్సిపాల్టీకి వుండటంతో, యీ విధమైన ఆక్రమణలను మున్సిపాలిటీయే అనుమతించినట్లు యుంది.

రోడ్డుకు ఒకవైపున యీ ఆక్రమణలు వుండగా, వస్త్రలత ప్రక్కన రిక్షాలు వుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి. కనీసం 60 సిటీ బస్సులు, పెక్కు యితర వాహనాలు నిత్యం యీ మార్గంగుండా ప్రయాణించవలసి వుంటుంది. గోతులతో, వర్షం కురిస్తే చీలమండలవరకు నీరు నిలిచే యీ రోడ్డుపై రెండు వందల గజాలు దాదాపుగా పద్మవ్యూహంలా వుంటుంది.

ఈ ప్రాంతంలో యింత దారుణంగా వున్న పారిశుద్ధ్య పరిస్థితి, ట్రాఫిక్ ఇబ్బందులు మున్సిపాలిటీకిగాని, పోలీసుయంత్రాంగానికిగాని ఏమీ పట్టనట్లు వుంది

రైతుల యిక్కట్లు

మార్కెట్‌కు కూరగాయలను సరఫరా చేసే రైతులు తాము అనేక యిబ్బందులకు గురవుతున్నట్లు తెలియజేశారు.

మున్సిపాలిటీయే ఫీజులను వసూలుచేస్తున్నప్పటి నుండి తాము బస్తాకు 45 పైసలు ఫీజును చెల్లించవలసివస్తుందన్నారు. మార్కెట్‌లోకి తెచ్చినందుకు ఒక ఫీజు, మార్కెట్‌లో అమ్ముతున్నందుకు మరో ఫీజు చెల్లించవలసివస్తుందన్నారు. అంతకుపూర్వం తాము బస్తాకు మొత్తం 20 పైసలు మాత్రమే చెల్లించేవారమన్నారు. పూర్వపురేట్ల ప్రకారమే ఫీజులను వసూలుచేయాలని కోరుతూ, రైతులు కోర్టుకు వెళ్ళారు. ప్రస్తుతం విచారణ జరుగుతున్నది.

మార్కెట్ ఫీజు చెల్లించుతున్నందుకు మున్సిపాలిటీ తమకు కలుగజేయవలసిన కనీస సౌకర్యాలలో ఒక్కదానిని కూడ కలుగజేయటం లేదన్నారు.

కూరగాయలను తీసుకు వచ్చే రైతులలో పెక్కుమంది భూమిని కౌలుకు తీసుకొని పండించేవారే. ఎకరం కౌలు దాదాపుగా రు. 800 నుండి వేయి వరకు వుంటుంది. విద్యుత్ ఖర్చులు సంవత్సరానికి రు 500 అవుతుంది. ఈ ఖర్చు తమను పెద్ద దెబ్బ గొడుతుందని పెనుమాకకు చెందిన ఒక యువక రైతు అన్నారు.

"ఆరుకాలం కష్టపడితే మాకు మిగులుతుంది. కష్టం మాత్రమే బాబూ ఒకోసారి అదికూడా మిగలదు చేతిదే వేయాల్సొస్తుంది" అని ఒక రైతు అన్నారు.

గుంటూరు జిల్లానుండి వచ్చే సిటీ బస్సులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆగిపోవటం తమకు చాలా అసౌకర్యంగా వున్నదని రైతులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంనుండి మార్కెట్‌కు తీసుకువెళ్ళటానికి కూలి ఖర్చులు ఎక్కువవుతున్నాయన్నారు. ఆ సిటీ బస్సులు రాత్రి 9 గంటల తర్వాత మార్కెట్‌వరకు రావటానికి అనుమతించాలని రైతులు కోరుతున్నారు.

రిటైల్ వర్తకులు

మార్కెట్ ఇరుకుగా తయారవటంతో తమ వ్యాపారానికి దెబ్బ తగులుతున్నదని ఒక రిటైల్ వ్యాపారస్తుడన్నారు.

మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు మార్కెట్‌ను వూడ్చవలసిన అవసరం వున్నదని ఒక వ్యాపారస్తున్నారు.

కమిషన్ ఏజెంట్లు

తాము తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నామని కమిషన్ ఏజెంట్లు తెలియజేసారు.

మార్కెట్‌లోపలి స్థలంచాలక హైద్రాబాద్ రోడ్డుపై వీరు కొట్లు నిర్మించారు. తాము చెల్లిస్తున్న అద్దెను మున్సిపాలటీ గత రెండు నెలలుగా తిరస్కరిస్తున్నదని వారు చెప్పారు.

హైద్రాబాద్ రోడ్డుపై మార్కెట్ ముఖ్య ద్వారం వద్ద, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్దగేటులనుఏర్పాటు చేసి మార్కెట్‌లో ప్రవేశించే కూరగాయలపై ఫీజు వసూలు చేస్తే పెద్ద మొత్తంలో ఆదాయం రాగలదన్నారు.

తమను యీ ప్రదేశం నుండి ఖాళీ చేయమనటం అన్యాయమన్నారు, ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూపే వరకు ఇచటనే వుండనివ్వవలసిందని పూర్వపు మున్సిపల్ శాఖా మంత్రి శ్రీ చెంచు రామానాయుడు అప్పటి స్పెషల్ ఆఫీసర్ శ్రీ మాధవరావును ఆదేశించారని చెప్పారు

ఫీజు అధికంగావటంతో రైతులు విజయవాడ మార్కెట్‌కు రావటం తగ్గిస్తున్నారని, ఏలూరు, గుంటూరు, గుడివాడ మార్కెట్లకు వెళుతున్నారని దీనివలన తమ వ్యాపారం దెబ్బ తింటున్నదని అన్నారు.

స్పెషల్ ఆఫీసర్ వాదన

కమీషన్ ఏజంట్ల కొట్లు మార్కెట్ వెలుపల వుంటున్నందున రైతులు కూరగాయలు పూర్తిగా మార్కెట్ లోపలికి రావటంలేదని, దీనివలన మున్సిపాలిటీ ఆదాయం దెబ్బతింటున్నదని స్పెషల్ ఆఫీసర్ తెలియజేశారు

హైదరాబాద్ రోడ్డుపై గేట్ వేయటం సాధ్యం కాదని, అది తమ అధికార పరిమితులలో లేదని అన్నారు ఆ రోడ్డును మూసివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు.

హోల్ సేల్ మార్కెట్ స్థలం

మార్కెట్ లోపల కూరగాయలు వేలం జరిగే స్థలం ప్రస్తుత అవసరాలకు ఏ మాత్రం చాలని విధంగా వుంది.

1939లో స్థాపించబడిన యీ మార్కెట్ ఆంధ్ర ప్రదేశ్‌లో రెండవ పెద్ద పట్టణమైన విజయవాడ అవసరాలను ఏ మాత్రం తీర్చే విధంగా లేదు.

హోల్‌సేల్ వ్యాపారం పెరగటంతో వేలం వేసే ప్రదేశం చాలటం లేదు.

మార్కెట్‌లోకి తాముకూడ ప్రవేశిస్తే తమకు స్థలం ఏ మాత్రం చాలదని, మార్కెట్ మరీ ఇరుకుగా తయారుకాగలదని కమీషన్ వర్తకులు అంటున్నారు.

మున్సిపాలిటీ ఆదాయం తగ్గుతున్న స్థితి

మార్కెట్ల నుండి మున్సిపాలిటీ ఆదాయం క్రమేణా తగ్గుతున్నది.

1971-72లో రు. 3 లక్షలపైగా ఆదాయం లభించింది. 1972-'73 కు సంబంధించి కంట్రాక్టర్లు రు 270 వేలకు పాట పాడగా రద్దుకాబడిన మున్సిపల్ కౌన్సిల్ ఆ పాటను తిరస్కరించి మున్సిపల్ సిబ్బందే ఫీజులను వసూలు చేయాలని తీర్మానించింది.

మున్సిపాలిటీకి ప్రస్తుతం రోజుకు షుమారు రు. 700 ఫీజు వసూలు అవుతున్నట్లు తెలిసింది. సిబ్బందికై నెలకు వేయి రూపాయల వ్యయం కాగలదు. ఈ లెక్కన మున్సిపాలిటికి పాట రూపేణా పెద్దనష్టం వచ్చే ప్రమాదం కన్పడుతున్నది.

మున్సిపల్ సిబ్బంది సవ్యంగా ఫీజులను వసూలు చేస్తే దాదాపు మూడున్నర లక్షల ఆదాయం లభించగలదని తెలుస్తున్నది.

బీసెంట్ రోడ్‌లోని మహంతిమార్కెట్, ఈశ్వర్‌మహల్ దగ్గరగల రాజగోపాలాచారి మార్కెట్, పాతబస్తీలోని చేపల మార్కెట్ల నుండి వసూలుచేసే ఫీజులుకూడ పై మొత్తంలోనే చేరుతాయి.

మార్కెట్ల ఫీజు వసూలు చేసుకొనే హక్కు తిరిగి తమకు లభించే సమయం కొరకు కొందరు కంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తున్నది.

ప్రస్తుతం తక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేసుకోవడం ఒక పథకం ప్రకారం జరుగుతున్నదని, ఇందుకు సంబంధించి కంట్రాక్టర్లకు, కొందరు మున్సిపల్ ఉన్నతాధికారులకు లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

ప్రత్యామ్నాయ హోల్‌సేల్ మార్కెట్

వివిధ సమస్యల పరిష్కారానికి హోల్‌సేల్ మార్కెట్‌ను మరొచోట ఏర్పాటు చేయటం అవసరం.

హోల్‌సేల్ మార్కెట్‌ను వేరేచోట ఏర్పాటుచేస్తే మున్సిపాలిటీ ఆదాయంకూడ పెరిగే అవకాశం వున్నది.

ప్రస్తుతం వేలకొలది అరటి గెలలు గాంధీజీ మున్సిపల్ హైస్కూలు ప్రక్కన గల బజారులో వేలం వేయబడుతున్నాయి. ఇందువలన మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం శూన్యం. హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుచేస్తే అరటికాయల వేలంకూడ యిక్కడే జరగగలదు. దీనివలన మున్సిపాలిటీ ఆదాయం విశేషంగా పెరగగలదు.

మున్సిపాలిటీ కార్యాలయం ప్రక్కనేగల స్థలాన్ని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తమకు కేటాయించవలసిందిగా విద్యుత్‌శాఖను కోరామని మున్సిపల్ స్పెషల్ ఆఫీసరు తెలియజేశారు,

కొత్త హోల్‌సెల్ మార్కెట్ ఏర్పాటుకై చర్యలు తీసుకొంటూనే, ప్రస్తుత కాళేశ్వరరావు మార్కెట్‌ను అభివృద్ధి చేయవలసిన అవసరం వున్నది.

మార్కెటు లోపల, వెలుపల పారిశుద్ధ్య విషయమై అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించవలసి వుంది.

ప్రతి దినం రెండు మూడు సార్లు మార్కెట్‌లో వూడ్పించటం చాల అవసరం. ఇది ప్రజల ఆరోగ్య దృష్ట్యానేగాక, మార్కెట్ వ్యాపారం పెరగటానికి కూడ అవసరం.

కనపడుటలేదు

మంగతాయమ్మ (17 సంవత్సరాలు) 30—7—72 వ తేదీ ఉదయంనుండి కనపడటంలేదు

చామనఛాయరంగు, గుండ్రని ముఖం 5 అడుగుల ఎత్తుగల మంగతాయమ్మ ఇంటినుండి వెళ్లేటప్పుడు గులాబీరంగుచీర కట్టుకున్నది. ఆమెను తెలిసినవారు యీ క్రింది అడ్రసుకు తెలియచేయ ప్రార్థన

గుంటక సాంబిరెడ్డి,
గణపవరం (పోస్టు),
(వయా) మైలవరం, కృష్ణాజిల్లా

బొద్దపాడు గ్రామపంచాయతీ

టెండరు నోటీసు

కృష్ణాజిల్లా బొద్దపాడు గ్రామపంచాయతీ యీ క్రింది వర్కులు చేయుటకుగాను 21—8—72 వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటల వరకు యీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గారిచే గాని లేక వారి అనుమతిపొందినవారిచే గాని సీలువేసిన టెండర్లు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 4-30 గంటలకు హాజరయిన టెండరుదార్ల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు టెండర్లు షరతులకు లోబడి డిపాజిట్ చెల్లించి రశీదు టెండరుకు జతపర్చి టెండరు దాఖలు చేయవలయును. మిగతా విషయములు ఆఫీసు పనిచేయు వేళలలో తెలుసుకొనవలయును.

పంచాయతీ పేరు	వర్కు వివరం	ఎస్టిమేటు మొత్తం	చెల్లించవలసిన ధరావతుమొత్తం
1. బొద్దపాడు పంచాయతీ	మెటలింగు మెయిన్ బజారు యిన్ బొద్దపాడు పంచాయతీ	రు. 5000/-	రు. 250/-
2. బొద్దపాడు పంచాయతీ	(2) ప్రొవైడింగు 50 MM బోర్‌వెల్ యిన్ బాపూజీవీధి	1400/-	70/-
3. బొద్దపాడు పంచాయతీ	(3) మెటలింగు వేదుకువారి వీధి యిన్ బొద్దపాడు పంచాయతీ	120/-	10/-

సర్పంచ్ గ్రామ పంచాయతీ,
బొద్దపాడు, 3—8—72.

బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ లలో కరువు పరిస్థితి

న్యూఢిల్లీ, ఆగస్టు 4

బీహార్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి

సమస్తపూర్ సబ్ డివిజన్‌లో కరువు తీవ్రత దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం 30 వేల టన్నుల ఆహార ధాన్యాలను హుటాహుటీగా పంపింది.

బీహార్ ముఖ్యమంత్రి శ్రీ కేదార్‌నాథ్ పాండే ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలోమాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులను ఆదుకొనడానికి సహాయం చేయుటకు కేంద్రం వాగ్దానం చేసిందని తెలిపారు,

రాష్ట్రంలో పరిపాలనా యంత్రాంగాన్ని క్రమబద్ధం చేయడంద్వారా, కరువు ప్రాంతాల్లో ఆహారధాన్యాల పంపిణీ సక్రమంగా జరిగేటట్లు చూస్తామని అన్నారు.

ఇప్పటికి 18 వేల చౌకదుకాణాలు తెరిచినట్లు, ఇంకా మరికొన్ని త్వరలో తెరవబోతున్నట్లుతెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికి బీహారు కరువు పరిస్థితులను వివరించినట్లు, తక్షణ సహాయంగా 80 వేలటన్నుల ఆహారధాన్యాలను అగస్టునెల లోపల పంపమని కోరినట్లు ఆయన తెలియజేశారు

దర్భాంగజిల్లాను తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని, సత్వరం సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండుజేస్తూ కమ్యూనిస్టు శాసన సభ్యులు శ్రీ రాంజతన్ పాస్వాన్ దర్భాంగ కలెక్టర్ కార్యాలయంముందు నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు.

క్షుదార్తులు ఆహారాన్ని డిమాండుచేస్తూ పిరపైంతి, కొల్‌గాంగ్ తదితరచోట్ల ప్రదర్శనలు జరిపారు,

హజారిబాగ్ జిల్లాలో కరువు తీవ్రత అధికంగా వుందని, రాబీ, ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని డిప్యూటీ కమిషనరు పత్రికల వారికి తెలిపారు

పాట్నా జిల్లా, బిహార్‌షరీఫ్ సబ్ డివిజన్‌లో వ్యవసాయ పనులన్నీ స్తంభించిపోవడంతో, వ్యవసాయ కార్మికులు పట్టణాలకు వలస పోతున్నారు

ఉత్తరప్రదేశ్

ఉత్తరప్రదేశ్‌లోని ప్రధానమంత్రి ఇందిరాగాంధి నియోజక వర్గమైన రాయ్‌బరేలీలో కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయి.

ఈ జిల్లాలో పంటల నష్టం రు. 2 కోట్లుపైగా వుందని రాష్ట్ర రెవెన్యూమంత్రి శ్రీ ఉదిత్ నారాయణ్ తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో 34 జిల్లాల్లో, 74,345 గ్రామాల్లో దాదాపు 4 8 కోట్ల మందిప్రజలు కరువుకు గురి అయ్యారు.

దాదాపు రు. 103 46 కోట్ల ఖరీఫ్ పంటకు నష్టం వాటిల్లింది.

వారణాసి, ప్రతాప్‌గర్, ఉన్నో, రాయ్‌బరేలీ, లక్నో ప్రాంతాలు పూర్తిగా కరువుకు గురి అయ్యాయి. రు. 7 కోట్లకు పైగా పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

మీర్జాపూర్, ఫైజాబాద్ జిలాల్లో 3 వేల గ్రామాలు, బారాబంకి, ప్రతాప్‌గర్, ఖాన్‌పూర్, బరేలీ, సహరాన్‌పూర్, మొరదాబాద్, బిజ్‌నూర్, గోండ, సుల్తాన్‌పూర్‌జిల్లాలో 2 వేల గ్రామాలు కరువుకు గురిఅయ్యాయి.

పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్‌లో తీవ్రంగా వ్యాపించిన కరువు పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్రప్రభుత్వం రు. 4 కోట్ల వ్యయంతో కరువునివారణ కార్యక్రమాలను నిర్వహించుతూంది

రాష్ట్రంలో వ్యాపించిన కరువు పరిస్థితులను పరిశీలించుటకు 8 శాసనసభ్యుల బృందాలు పర్యటన జరుపుతున్నాయి.

వీరు ఆగస్టు 9 వ తేదీ నాటికి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తారు.

రాజస్థాన్, గుజరాత్ లకు 52½ వేలమంది శరణార్థులు

భారత్-పాక్ యుద్ధకాలంలో వచ్చినట్లు మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 3

పాకిస్తాన్‌తో గత సంవత్సరం డిసెంబరులో సంభవించిన యుద్ధంలో సరిహద్దుల నుండి రాజస్థాన్‌కు, గుజరాత్‌కు 52,619 మంది శరణార్థులు వచ్చారు

వీరిలో 15,390 మందినిశరణార్థుల శిబిరాలలో చేర్చుకోడం జరిగిందని, 24,039 మంది ఆ రెండు రాష్ట్రాలలోని గ్రామాలలో తమ స్నేహితులతోను, బంధువులతోను, కలిసి వుంటున్నారనీ, నేడు లోక్‌సభలో కార్మిక, పునరావాస శాఖ మంత్రి శ్రీ ఆర్. కె. ఖాడిల్కర్ తెలియజేశారు.

రి అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రు. 24 లక్షలు ఖర్చు పెట్టింది. ఇందులో రాజస్థాన్ ప్రభుత్వం సుమారు రు. 15 లక్షలు ఖర్చు పెట్టింది.

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షులు జాన్ మార్క్స్ మృతి

మాస్కో, ఆగస్టు 6

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షులు జాన్ మార్క్స్ గత మంగళవారం యిక్కడ మరణించారు.

ఆయన వయస్సు 60 సంవత్సరాలు. చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రికప్రావ్దా శుక్రవారం నాడు ఆయన జీవిత విశేషాలను ప్రచురించింది. జాన్‌మార్క్స్ 1928 లో దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీలో చేరారు. 1962 లో ఆయన పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

గత నెల 30 వ తేదీననే ప్రపంచ ప్రగతిశీల ప్రజానీకమంతా దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ 51 వ వార్షికోత్సవం జరుపుకున్నారు. శ్వేతజాత్యహంకారులకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా ప్రజానీకాన్ని సన్నద్ధం చేయడంలో మార్క్స్ మహత్తర పాత్ర వహించారు. 1948 ఎన్నికల తర్వాత దక్షిణాఫ్రికా పార్లమెంటులో "కమ్యూనిజం అణచివేత చట్టం" ఆమోదానికి వ్యతిరేకంగా పీడిత ప్రజానీకాన్ని సమీకరించిన ప్రముఖులలో ఆయన ఒకరు. 1950 జులైలో కమ్యూనిస్టుపార్టీని నిషేధించినపుడు ఆయనరహస్య జీవితం ప్రారంభించారు.

1962లో చారిత్రాత్మకమైన కమ్యూనిస్టు పార్టీ 6వ మహాసభ నూతన కార్యక్రమాన్ని ఆమోదించింది. ఆఫ్రికన్ నేషనల్‌కాంగ్రెస్, ఇండియన్‌నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, దిసౌత్ ఆఫ్రికన్ కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఇతర ప్రజాతంత్ర సంస్థల నాయకత్వాన సాగే జాతీయ విముక్తి పోరాటానికి ఆ మహాసభ బేషరతుగా తోడ్పాటు ప్రకటించింది. ఆ మహాసభలోనే మార్క్స్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు.

ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విముక్తి సైన్యానికి 1970 లో కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ పూర్తి తోడ్పాటు ప్రకటించింది. శ్వేతజాత్యహంకారానికి వ్యతిరేకంగా పోలీసు రాజ్యాన్ని ప్రతిఘటిస్తూ అనేక మంది పోరాట యోధుల్ని మార్క్స్ తన సమర్థవంతమైన నాయకత్వం క్రింద రూపొందించారు.

విశాఖ మున్సిపల్ కార్మికులకు పెన్షన్

యాజమాన్యం అంగీకారం

విశాఖపట్టణం, ఆగస్టు 5

1500 మంది మునిసిపల్ కార్మికులకు 1961 ఏప్రిల్ నుంచి పెన్షన్ చెల్లించేందుకు విశాఖపట్నం మునిసిపాలిటీ అంగీకరించింది

పై మేరకు మునిసిపల్ యాజమాన్యానికి కార్మికుల యూనియన్ ప్రతినిధులకు మధ్య మొన్న ఇక్కడ ఒప్పందం కుదిరింది.

ఒప్పందం ఫలితంగా మునిసిపల్ కార్మికుల యూనియన్ సమ్మె నోటీసును ఉపసంహరించుకుంది.

గతంలో రిట్రెంచ్ చేయబడిన 166 మంది కార్మికులను తిరిగి పనిలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తామని కూడా విశాఖపట్నం మునిసిపల్ యాజమాన్యం ఒప్పందంలో తెలిపింది.

పబ్లిక్‌హెల్త్, నాన్ పబ్లిక్‌హెల్త్ శాఖలకు చెందిన 1500 మంది కార్మికులకు 1961 ఏప్రిల్ 1 నుంచి పెన్షన్ పథకం వర్తింప చేసి అమలు పరచేందుకు అంగీకరించారు.

స్కూల్ కండెక్టర్సెస్‌కూడా ఇంటి అద్దె అలవెన్సు పొందడానికి అర్హులన్న అంశాన్ని ఒప్పందంలో మునిసిపల్ యాజమాన్యం అంగీకరించింది. మునిసిపల్ కార్మికులకు ఇళ్లు కట్టించేందుకు అంగీకరించారు.

అధికారులలోనూ, యూనియన్ ప్రతినిధులతోనూ ఇబ్బందుల పరిశీలక కమిటీని ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు.

బోనస్ పండ్ వివరాలు తెలిపే కాగితాలను ప్రతి కార్మికునికి అందచేసేందుకు ఒప్పుకున్నారు

మున్సిపల్ కార్మికులకు ఇళ్ళు కట్టించేందుకు స్థలం సేకరించడానికి మున్సిపల్ చైర్మన్, యూనియన్ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్‌తో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు.

కార్మికుల తరపున యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ వై. విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీ కె. గురుమూర్తి, మున్సిపాలిటీ తరపున మున్సిపల్ కమిషనర్ ఒప్పందపత్రంపై సంతకాలు చేశారు.

రాజీ సంప్రదింపుల అధికారి శ్రీ కె సూర్యారావు సమ్ముఖంలో ఒప్పందం కుదిరింది.

యుద్ధఖైదీల శిబిరంలో సొరంగం

లోక్‌సభలో రక్షణ మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 4

అలహాబాద్ నుండి ఫరీదాబాద్ రోడ్డుకు అభిముఖంగా అలహాబాద్ కాంప్‌లో బంధింపబడ్డ పాక్ యుద్ధఖైదీలు ఒక సొరంగాన్ని త్రవ్వారని రక్షణ మంత్రి శ్రీజగ్‌జీవన్‌రామ్ నేడు లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానమిస్తూ తెలియ జేశారు.

ఆ సొరంగం లోతు 10 అడుగులు వెడల్పు 2 అడుగులు, పొడవు 70 అడుగులుంటుందని మంత్రి వివరాలు తెలిపారు మే 17 న జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ల నివాస ప్రాంతంలో ఈ సొరంగాన్ని త్రవ్వారని ఆయన తెలిపారు.

దర్యాప్తు జరపడం జరిగిందనీ, ఆ దర్యాప్తులో వెల్లడైన వివరాలు ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడానికి తోడ్పడ్డాయని ఆయన తెలిపారు. క్యాంపు సిబ్బంది తప్పుకాని, పొరపాటు కానీ ఎంతమాత్రమూ లేదని ఆయన అన్నారు. అటువంటి సంఘటనలు జరక్కుండా రక్షణ చర్యలు కట్టుదిట్టంగా చేయబడ్డాయని ఆయన అన్నారు.

నూతన ఆర్మీ కమాండ్ ఏర్పాటు

నూతన ఆర్మీ కమాండ్‌ను "నార్తరన్ ఆర్మీ కమాండ్" అనే పేరుతో ఏర్పాటు చేసినట్లు లోక్‌సభలో మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ అధికారయుతంగా ప్రకటించారు.

వెస్టర్న్‌కమాండ్‌ను-నార్తరన్‌కమాండ్, వెస్టర్న్ కమాండ్‌లుగా విభజించామని జగ్‌జీవన్‌రామ్ తెలిపారు. దీనితో దేశంలో మొత్తం 5 కమాండ్‌లు ఉంటాయి.

ఈ నూతన కమాండ్ జమ్మూ అండ్ కాశ్మీర్ ప్రాంతాల రక్షణభారం వహిస్తుంది.

యూనివర్శిటీ ఉపాధ్యాయుల వేతనాలు

యూనివర్శిటీ ఉపాధ్యాయుల వేతనాలు, సర్వీసుల గ్యారంటీకి సంబంధించిన సమగ్ర బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు విద్యామంత్రి ప్రొ॥ ఎస్ నూరుల్ హసన్ తెలియజేశారు.

పత్రికల యాజమాన్య వికేంద్రీకరణ బిల్లు

ఈ సమావేశంతో ప్రతిపాదన అసాధ్యమని శ్రీ గుజ్రాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 4

పత్రికల యాజమాన్య వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాలన్న విధానానికి ప్రభుత్వం కట్టుబడివుందని సమాచారశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడు రాజ్యసభలో చెప్పారు.

ప్రస్తుత పార్లమెంటు సమావేశంలోనే వికేంద్రీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్‌గుప్తా డిమాండ్ చేశారు.

విచారపడ వలసిన అవసరం ఏమీ లేదని, ప్రధాని చెప్పినట్లుగా ప్రభుత్వ విధానంలో మార్పు యేమీలేదని గుజ్రాల్ చెప్పారు.

"ప్రస్తుత సమావేశంలో బిల్లును ప్రవేశపెట్టటం సాధ్యంకాదు. ఎందుచేతనంటే అనేక చట్టపరమైన యిబ్బందులున్నాయి. వచ్చే పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెడతాం" అని మంత్రి చెప్పారు.

ఈ బిల్లు ఎలావుండాలి అన్న విషయమై మంత్రులసంఘం అనేక సూచనలు చేసింది ప్రభుత్వం అనుకొన్న అన్ని లక్ష్యాలు ఈ బిల్లులో చేర్చడానికి వీలుగా దీనిని మంత్రివర్గం, న్యాయశాఖ జాగ్రత్తగా పరిశీలించవలసివుంది

కాంట్రాక్టు లేబర్ పద్ధతిరద్దు ప్రస్తుతం సాధ్యపడదట

న్యూఢిల్లీ, ఆగస్టు 3

కాంట్రాక్టు లేబర్ పద్ధతిని మొత్తంగా రద్దుచేయడం ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ క్రిందవున్న పరిస్థితులలో సాధ్యంకాదని కార్మికమంత్రి శ్రీ ఖాడిల్కర్ నేడు లోక్‌సభలో చెప్పారు.

శ్రీ దినేన్ భట్టాచార్య ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ, యిటీవల చేసిన కాంట్రాక్టు లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) చట్టం క్రింద పనిచేసేవారి ఉద్యోగాలను క్రమబద్ధం చేయటం ప్రారంభించామని మంత్రి చెప్పారు.

కేంద్ర ప్రభుత్వంక్రింద, అలాగే ప్రభుత్వరంగ సంస్థలక్రింద ప్రత్యక్షంగా వున్న సంస్థలలో కాంట్రాక్టు లేబర్ సంఖ్య ఎంత అని శ్రీ భట్టాచార్య అడిగారు.

ఆ వివరాలు సేకరిస్తున్నామని మంత్రి చెప్పారు.


ఆగష్టు 11 విడుదల!
ఉదయం ఆటతో
నన్ను జి.బి. బోస్ అందురు!
తెలుగు వాడినేనండీ!
అసలు పేరు గున్నవరం గంగాధరం!
సులువుగా పలకడానికి జి.బి. అని మార్చాను!
మనుగా వుండటంకోసం చివర బోస్ అని చేర్చాను!
జి.బి. బోస్ గానాగాభిషేకం
చెప్పే సూక్తులూ, ఉపదేశాలూ
వినండి! చూడండి!
నీతి నిజాయితీ
ఆద్యంతం నవ్వించే వినోద భరిత చిత్రం!



నోటిఫికేషన్

రామచంద్రపురం మునిసిపాలిటీ

1965 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘముల చట్టములోని 83 వ సెక్షన్ ననుసరించి ప్రకటన.

ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘముల చట్టములోని 103 వ, మరియు 113 వ సెక్షన్ల ననుసరించియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు జారీచేసిన 10-11-71 తేదీగల నెం 860 రు యమ్. ఎ. ఉత్తర్వుల ప్రకారమున్ను, యీ పురపాలక సంఘ ప్రాంతంలో ఉంచబడిన, మరియు ఉపయోగింపబడుచున్న వాహనములు, బండ్లు, మరియు జంతువులపై 1—4—1972 వ తేదీనుండి యీ దిగువ రేట్ల ప్రకారము పన్ను విధింపు విషయములో 9—6—1972 తేదీగల 'విశాలాంధ్ర'-దిన పత్రికలో ప్రకటించిన తేదీలగాయితు ఒకనెలరోజులలోగా ఏమైనను అభ్యంతరము లున్నయెడల తెలియజేయమని ప్రకటించబడినది. అందుపై ఏవిధమైన అభ్యంతరములు రానందున యీ పురపాలక సంఘమువారు 25—7—1972 వ తేదీగల నెం 101 రు తీర్మానంలో 1—4—1972 వ తేదీనుండి 103 నుండి 113 వరకుగల సెక్షన్ల ననుసరించి యీ దిగువ రేట్ల ప్రకారం పన్ను విధించి వసూలుచేయుటకు తీర్మానించియున్నారని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

వరుస నెంబరు	వాహనము, లేక జంతువు వివరము	1—4—1972 వ తేదీ నుండి అమలులో నున్న సంవత్సరపు పన్ను	
(1)	(2)	(3)	
1	స్ప్రింగులతో అమర్చబడిన నాలుగు చక్రముల వాహనము ఒకటి లేక ఎక్కువ జంతువులతో లాగబడునది.	ప్రైవేటు బండి	రు. 30-00
		అద్దె బండి	30-00
2.	స్ప్రింగులతో అమర్చబడిన రెండు చక్రముల వాహనము ఒకటి లేక రెండు జంతువులతో లాగబడునది (బండికి)	ప్రైవేటు బండి	6-00
		అద్దె బండి	10-00
		ఒంటెద్దు ప్రైవేటుబండి	2-00
		,, అద్దె బండి	2-00
3.	ప్రతి సైకిల్ రిక్షా స్వంతదారు నడుపుకొనునది కాక	అద్దె బండి	6-00
4.	ప్రతి బైసికిల్, లేక ట్రైసికిల్	అద్దె బండి	5-00
5.	స్ప్రింగులతో అమర్చబడిన తక్కిన ప్రతి వాహనమునకు (పసి పిల్లల త్రోపుడు బండి కాక)	ప్రైవేటు బండి	6-00
		అద్దె బండి	6-00
	జంతువులు		
1.	ఏనుగు ఒకటికి ...		రూ. 24-00
2.	ఒంటె ,, ...		12-00
3.	గాడిద ,, ...		1-00
4.	పంది ,, ...		1-00
5.	మేక ,, ...		1-00
6.	కుక్క ,, ...		1-00

పై పన్నుతోపాటు నెంబరింగ్ రుసుము క్రింద ప్రతి 1-కి రు 0-12 లు వసూలు చేయబడును

(సం.) ఎ. సుందరరాజన్,
కమీషనర్,
రామచంద్రపురం మునిసిపాలిటీ.
డి 29—7—1972

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ టి. వెంకటేశ్వరరావు ఎడిటర్ సి. రాఘవాచారి ముద్రణ